Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

: fb.com/vaartha Digital

ఖమ్మం 24-9-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 234 పేజీలు: 8+16 వెల: 6.50


కోల్‌కతాలో విద్యుత్‌షాక్‌కు 10 మంది మృత్యువాత 2

భరణం కోసం గొంతెమ్మ కోరికలు అనుచితం: సుప్రీం 5


## మోహన్ లాల్‌కు ఫాల్కే ప్రదానం

### ఉత్తమ నటుడుగా షారూఖ్, నటిగా రాణిముఖర్జీ

### ఉత్తమ తెలుగు చిత్రంగా భగవంత్ కేసరికి అవార్డులు



మోహన్ లాల్‌కి ఫాల్కే అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

### ఢిల్లీలో జరిగిన వేడుకలో 71వ జాతీయ పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** జాతీ య స్థాయిలో 71వ ఉత్తమ చిత్రాలు, వివిధ విభాగాల్లో ప్రతిభచూపిన కళా కారులకు పురస్కారాల >>2



అవార్డు అందుకుంటున్న నటుడు షారూఖ్

# మహాజాతరగా మేడారం

## పోరాటానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మలు

### మరో వెయ్యేళ్ల చరిత్రకు సజీవ సాక్ష్యంగా గద్దెల నిర్మాణం

### ఆదివాసీలే ఈ దేశానికి మూలవాసులు

### మేడారంలో మాస్టర్‌ప్లాన్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్



మంగళవారం మేడారంలో సమ్మక్క గద్దె వద్ద మొక్కు చెల్లిస్తున్న సిఎం రేవంత్

**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త:** మేడారం మహా జాతర మాస్టర్ ప్లాన్, ఆదివాసి సాంప్రదాయాలు ఆచారాలకు అనుగుణంగా పూజారుల సలహాలతో చేపట్టే గద్దెల విస్తరణ సమీక్ష సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం మేడారం విచ్చేశారు. మేడారానికి హెలికాప్టర్‌లో 12 గంటల 27 నిముషాలకు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ,సీఎం సలహాదారు వేం.నరేందర్ రెడ్డి కి మంత్రి సీతక్క,ఎస్సి ఎస్టీ గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిరిసిల్ల రాజయ్య రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్, మహబూబాబాద్, వరంగల్ పార్లమెంటు సభ్యులు పోరిక బాలరాం నాయక్, కడియం.కావ్య,ఎమ్మెల్సీలు,శాసన సభ్యులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.,ఎస్పి శబరిష్ వారికి పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘనస్వాగతం పలికారు.కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో ముఖ్య మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గిరిజన కొమ్ము,కోయ నృత్యంతో, గిరిజన సాంప్రదాయాలతో గద్దెల వద్దకు సీఎం కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లకు 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించి, శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ,దేవాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు,సీనియర్ అదికారులు,పూజారులతో సమీక్ష >>2

## చుక్కల్లో పసిడి



5


### 5 రోజుల్లో 2,600 పెరిగి 10 గ్రా. రూ.1,14,330కి చేరిన ధర

**బంగారాన్ని దాటేసిన వెండి కిలో రూ. 1,4,9,000 పైనే**

**పండుగ వేళ మరింత పెరుగవచ్చని నిపుణుల అంచనా**

## ఆయన్ని చూస్తే భయం..

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ డ్రెస్సింగ్ తీరుపై హైకోర్టు ఆగ్రహం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు23:** రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్‌కు డ్రెస్సింగ్ సెన్స్ సరిగ్గా లేదని.. ఆయన్ను చూస్తే >>2



## ఏడు యుద్ధాలు ఆపింది నేనే

### ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్, చైనా నుంచే రష్యాకు నిధులు

### ఐరాస పనితీరు అంతంతే: యుఎన్ సర్వసభ్య సమావేశంలో ట్రంప్

**న్యూయార్క్, సెప్టెంబరు 23:** ప్రపంచవ్యాప్తంగా తాను అధికారంలోకి వచ్చాక ఏడు యుద్ధాలను విరమింపచేసానని వాటిలో పాకిస్తాన్, భారత్‌ల మధ్య జరిగిన దాడి కూడా ఒకటని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు. తాను అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే సమీపంలో ముగింపు కనిపించని >>2

## కృష్ణా జలాల్లో 763 టిఎంసి వాటా

# తెలంగాణకివ్వండి

### కెడబ్ల్యుడిటి-2 ముందు మంత్రి ఉత్తమ్ సమక్షంలో వాదనలు

### కృష్ణా-గోదావరి హక్కులపై రాజీలేని పోరాటం

### సుప్రీంలో ఆల్మట్టి ఎత్తు పెంపు తేల్చుకుంటాం

### మంత్రి ఉత్తమ్ కుమార్



మంగళవారం మీడియాతో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** కృష్ణా నదిలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు కేటాయించిన 1005 టిఎంసి నీటితోపాటు,గోదావరి నీటి మళ్ళింపు కారణంగా అదనంగా 45టిఎంసి కేటాయింపు కలుపుకొని తెలంగాణకు 763టిఎంసిల(70శాతం) న్యాయమైన వాటా రావాలని కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్ -2 ముందు తెలంగాణ ప్రభుత్వంవాదనలు వినిపించిందని రాష్ట్ర ఇరిగేషన్, సివిల్ సప్లయిస్ మంత్రి కాప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఢిల్లీలో కృష్ణ ట్రిబ్యునల్ చేపట్టిన మూడు రోజుల విచారణలలో భాగంగా తొలిరోజు విచారణ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసు చివరి దశకు చేరుకుందని, ఫిబ్రవరి నుండి తెలంగాణ తుది వాదనలు వినిపిస్తున్నదని ఉత్తమ్ చెప్పారు.ఈ విచారణలు సెక్షన్-3 రిఫరెన్స్ కింద జరుగుతున్నాయని, అన్ని పిటిషన్లు పూర్తయ్యాయని గత కొన్ని నెలలుగా సీనియర్ అడ్వకేట్ ఎస్.వైద్యనాథన్ తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తున్నారని తెలిపారు. ఆయనకు మంగళ,బుధ,గురువారాల్లో వాదనలు >>2

# వెల్లువలా విదేశీ పెట్టుబడులు



### మామిడి, నారింజ పండ్ల రైతులకు భారీ ప్రోత్సాహం

### 3 బడా కంపెనీల పెట్టుబడులకు కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం: డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు23:** భారీగా పెట్టుబడులు పెడుతూ యువతకు ఉపాధి, వివిధ రకాల పండ్లు సాగు చేసే రైతులకు ప్రోత్సాహం కలిగించే పద్ధతుల్లో బహుళ జాతి కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వెల్లువలా కదిలి వస్తున్నాయని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద ఎత్తున ఆసక్తి కనబరుస్తున్నాయని డిప్యూటీ సీఎం, కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క >>2


PATANJALI®

12-18% శ్లాబ్‌లోకి వస్తున్న రోజువారీ వినియోగ ఉత్పత్తులపై GST రేట్లను 5%కి తగ్గించడం ద్వారా, ప్రధానమంత్రి మోదీ కోట్లాది మంది దేశస్థులకు పొదుపు అనే పెద్ద బహుమతిని అందించారు. "ఇతర దేశాలపై ఆధారపడటం దేశానికి అతిపెద్ద శత్రువు" అని పిలుపునిస్తూ, స్వదేశీ ఉత్పత్తులను రోజువారీ ఉపయోగంలో స్వీకరించడం ద్వారా భారతదేశాన్ని స్వావలంబన దిశగా మార్చాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

దేశంలోనే అతిపెద్ద ఆహార సంస్థ మరియు అతిపెద్ద స్వదేశీ FMCG కంపెనీ అయిన పతంజలితో మనమందరం చేతులు కలిపి, ప్రధానమంత్రి కలల సుసంపన్న భారతదేశాన్ని నిర్మించడానికి స్వదేశీ ప్రతిజ్ఞ చేద్దాం.

పతంజలి దేశంలోని ఏకైక మరియు అతిపెద్ద స్వదేశీ కంపెనీ, ఇది తన లాభాలలో 100% భారతమాత సేవలో పెట్టుబడి పెడుతుంది, ఎందుకంటే మా ఏకైక లక్ష్యం కష్టపడి సంపాదించిన డబ్బును దాతృత్వంలో పెట్టుబడి పెట్టడం ద్వారా బలమైన మరియు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడం. పతంజలికి, దేశం ఒక మార్కెట్ కాదు, ఒక కుటుంబం. అందువల్ల, GST రేటు తగ్గింపును పూర్తిగా ఉపయోగించుకోండి మరియు గౌరవనీయమైన ప్రధానమంత్రి దేశ నిర్మాణంపై సంకల్పాన్ని నెరవేర్చడానికి ప్రతి గ్రామం, నగరం, వీధి మరియు ప్రాంతంలో స్వదేశీని ఒక ఉద్యమంగా ప్రచారం చేద్దాం.

| Product | Pack | Old MRP | New MRP |
|---|---|---|---|
| Patanjali Cow's Ghee | 900 ml | ₹780/- | ₹731/- |
| Patanjali Cow's Ghee | 450 ml | ₹420/- | ₹393/- |
| Nutrela Chunks, Mini Chunks & Granules | 1 kg Pack | ₹210/- | ₹190/- |
| Nutrela Chunks, Mini Chunks & Granules | 200 g Pack | ₹50/- | ₹47/- |
| Doodh Biscuit | 35 g | ₹5/- | ₹4.50/- |
| Doodh Biscuit | 70 g | ₹10/- | ₹9/- |
| Marie Biscuit | 225 g | ₹30/- | ₹27/- |
| Marie Biscuit | 70 g | ₹10/- | ₹9/- |
| Amla Juice | 1 ltr | ₹150/- | ₹140/- |
| Aloe Vera Juice | 1 ltr | ₹220/- | ₹206/- |
| Giloy Juice | 500 ml | ₹90/- | ₹84/- |
| Chyawanprash | 1 kg | ₹360/- | ₹337/- |
| Nutrela Vit. B12 | 60 Cap | ₹165/- | ₹146/- |
| Dant Kanti Natural | 200g | ₹120/- | ₹106/- |
| Dant Kanti Advance | 100g | ₹90/- | ₹80/- |
| Toothbrush (Active Care) | 100g | ₹20/- | ₹18/- |
| Neem Kanti Body Cleanser | 75g | ₹25/- | ₹22/- |
| Neem Kanti Body Cleanser | 45g | ₹10/- | ₹9/- |
| Aloevera Kanti Body Cleanser | 45g | ₹10/- | ₹9/- |
| Haldi Chandan Kanti Body Cleanser | 45g | ₹10/- | ₹9/- |
| Kesh Kanti Hair Cleanser Range | 180 ml | ₹120/- | ₹106/- |
| Kesh Kanti Hair Cleanser Range | (Natural) 180 ml | ₹100/- | ₹89/- |

30కి పైగా ప్రముఖ బీమా కంపెనీల (SBI జనరల్, రిలయన్స్ ఇన్సూరెన్స్, యునైటెడ్ ఇన్సూరెన్స్, ICICI లాంబార్డ్, HDFC ERGO, MEGMA, ఆదిత్య బిర్లా మొదలైనవి) నుండి నగదు రహిత బీమా సౌకర్యాలు కలిగిన ఇతర పౌరులతో పాటు CGHS (కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు), CAPF (కేంద్ర సాయుధ పోలీసు దళం), ECHS (మాజీ సైనికులు) లబ్ధిదారులతో సహా దేశంలోని 5 కోట్లకు పైగా పౌరులు పతంజలి వెల్‌నెస్, యోగాగ్రామ్ మరియు నిరామయంలలో రీయింబర్స్‌మెంట్ సౌకర్యాలను పొందవచ్చు. పతంజలి వెల్‌నెస్, యోగాగ్రామ్ మరియు నిరామయంలలో 1 నుండి 2 వారాల పాటు ఉచిత సేవలను పొందడం గురించి వివరణాత్మక సమాచారం కోసం, సంప్రదించండి:

8954666111, 8954666222, 8954666333

booking@patanjaliwellness.com | www.patanjaliwellness.com

*The maximum retail price (MRP) of our products has been revised w.e.f. September 22, 2025, in line with the new GST rate slabs. This revision is applicable as per the government notification. Products with the old and new MRPs may be available simultaneously in the market for a short period. For more information, call 1800 180 4108 or email feedback@patanjaliayurved.org, wecare@patanjalifoods.co.in



మంగళవారం న్యూఢిల్లీలో ఉత్తమనటిగా రాణి ముఖర్జీకి జాతీయ పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

# మోహన్ లాల్‌కు ఫాల్కే ప్రదానం

>> ప్రధానోత్సవం విజ్ఞాన్‌భవన్‌లో వైభవోపేతంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముచేతులమీదుగా ఉత్తమ నటులు, నటీమణులు, దర్శకులు, వివిధ విభాగాల అధిపతులు ఈ పురస్కారాలు అందుకున్నారు. తెలుగులో ఉత్తమ చిత్రంగా భగవంత్‌కేసరి ఎంపిక కాగా దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటిలు పురస్కారాన్ని అందుకున్నారు. హిందీలో ఉత్తమ చిత్రంగా కథల్ ఎ జాక్‌ఫ్రూట్ మిస్టరీ చిత్రాన్ని ఎంపికచేసారు. బాలివుడ్‌నటి రాణిముఖర్జీ ఉత్తమ నటిగా ఎంపిక కాగా ఉత్తమ నటులుగా జవాన్ చిత్రంలో నటించిన షారూక్‌ఖాన్, 12త్‌ఫెయిల్ చిత్రంలో నటించిన విక్రమాంత్ మాసేకు లభించాయి. ఇదే చిత్రానికి ఉత్తమ ఫీచర్‌ఫిలిం అవార్డుకూడా లభించింది. వివిధ అవార్డులు అందుకున్న వారి వివరాలు వారి విభాగాలు ఇలా ఉన్నాయి.

- ఉత్తమ చిత్రం: కథల్ ఎ జాక్‌ఫ్రూట్ మిస్టరీ
- ఉత్తమ ఫీచర్‌ఫిలిం: 12త్ ఫెయిల్
- ఉత్తమ నటుడు: జవాన్ షారూక్‌ఖాన్
- ఉత్తమ నటి: రాణిముఖర్జీ మిసెస్ ఛటర్జీ వెర్సస్ నార్వే
- దాదాసాహెబ్ పాల్కే అవార్డు: మళయాళనటుడు మోహన్‌లాల్
- ఉత్తమ చిత్ర విమర్శకులు: ఉత్పల్‌దతా చిత్రం అస్సాం
- ఉత్తమ యాక్షన్ డైరెక్షన్: హనుమాన్, ప్రశాంత్ వర్మ
- ఉత్తమ గేయరచియత: బలగం.. కాసర్ల శ్యాం.. ఊరు పల్లెటూరు గీతం
- ఉత్తమ ప్రాచుర్యంలోకి వచ్చిన చిత్రం రాకీ ఔర్ రాణికి ప్రేమ్ కహాని
- ఉత్తమ తెలుగుచిత్రం: భగవంత్‌కేసరి,
- ఉత్తమ గుజరాతిచిత్రం: వాష్
- ఉత్తమ తమిళ చిత్రం: పార్కింగ్
- ఉత్తమ కన్నడ చిత్రం: ది రే ఆఫ్ హోప్
- ఉత్తమ నేపథ్య గాయని శిల్పారావు (ఛలియా...జవాన్)
- ఉత్తమ నేపథ్య గాయకుడు: ప్రేమిస్తున్నా... పివిఎన్ఎస్ రోహిత్ (బేబి తెలుగు)
- ఉత్తమ సినిమాటోగ్రఫీ: ది కేరళ స్టోరీ
- ఉత్తమ నృత్యదర్శకత్వం: రాకీ లండ్‌రాని లవ్‌స్టోరీ ధిన్‌దోడా బాజేరే
- ఉత్తమ మేకప్ కాస్ట్యూమ్ డిజైనర్ : శాంబహాదూర్ చిత్రం
- స్పెషల్ మెన్షన్ : యానిమల్ చిత్రం రిరికార్డింగ్‌మిక్సర్ ఎం ఆర్ రాధాకృష్ణన్
- ఉత్తమ సౌండ్ డిజైన్ యానిమల్ హిందీ చిత్రం
- ఉత్తమ బాలనటిగా: సుక్రుతి వేణి గాంధీతాత చెట్టు చిత్రం
- ఉత్తమ నేపథ్య సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్ యానిమల్
- ఉత్తమ యానిమేషన్ ఎఫెక్ట్స్: హనుమాన్: ప్రశాంత్ వర్మ
- ఉత్తమ స్క్రీన్‌ప్లే: బేబీ సాయిరాజేష్

**నాన్‌ఫీచర్‌ఫిలిం కేటగిరీ**

- ఉత్తమ సంగీత దర్శకత్వం: ద ఫస్ట్ ఫిలిం హిందీ
- ఉత్తమ క్రిటిక్ ఉత్పల్ దత్తా
- ఉత్తమ డాక్యుమెంటరీ: గాడ్ వల్చర్ హ్యూమన్ ద సీ లయద సెవెన్ విలేజెస్ (ఒరియా)
- బెస్ట్ స్క్రిప్ట్: సన్‌ఫ్లవర్ వెర్ ద ఫస్ట్‌వన్‌టు నో (కన్నడ)
- బెస్ట్ ఫిలిం: నేకాల్ క్రానికల్ ఆఫ్ దిప్యాడీమాన్ (మళయాళం)
- బెస్ట్ ఎడిటింగ్ మూవీ : మూవీఫోకస్ ఇంగ్లీష్

## పాల్కే పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది: మోహన్‌లాల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** కేంద్ర ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న దాదాసాహెబ్ పాల్కే అవార్డును మళయాళ నటుడు మోహన్‌లాల్ అందుకున్నారు. మంగళవారం విజ్ఞాన్‌భవన్‌లో ఆయన రాష్ట్రపతి ద్రౌపదిముర్ముచేతులమీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. 2023 సంవత్సరానికిగాను వివిధ భాషల్లో వెలువడిన చిత్రాలు వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభచూపించిన కళాకారులకు జాతీయ అవార్డులుప్రధానంచేస్తున్న సంగతి తెలిసిందే. తనకు దాదాసాహెబ్ పాల్కే అవార్డు వస్తుందని కలలో కూడా ఊహించలేదని ఈసందర్భంగా మోహన్‌లాల్‌పేర్కొన్నారు. అంతా మ్యాజిక్‌లాగే ఉందని, ఈ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా ఉందని, ఈపురస్కారం నా ఒక్కడికి కాదని, ఇది మళయాళ చిత్రపరిశ్రమకు చెందుతుందని,మరింత భాధ్యతగా పనిచేస్తానని మోహన్‌లాల్ అన్నారు. 1980లో సినిమాల్లోకి వచ్చిన మోహన్‌లాల్ ఉమారు 350కిపైగా సినిమాల్లో నటించారు. మంజిల్ విరిజ పూక్కళ్ అనే చిత్రంతో ఎంట్రీ ఇచ్చి 45 ఏళ్ల తన కెరీర్‌లో అనేక మళయాళ, తెలుగు, కన్నడ, తమిళ, హిందీభాషల్లో నటించారు. తెలుగులోజనతాగ్యారేజ్‌తో మంచి ఫేమ్ తెచ్చుకున్న మోహన్‌లాల్ మూర్తీభవించిన నటుడుగా పేరుతెచ్చుకున్నారు.

## వెల్లువలా విదేశీ పెట్టుబడులు

>> మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు, కేబినెట్ సబ్ కమిటీ సభ్యులైన దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాల ఆసక్తి చూపుతున్న జెఎస్‌డబ్ల్యు,విపివి లిమిటెడ్ మహేశ్వరంలో కొత్త యూనిట్ ప్రారంభించడానికి, తోషిబా ట్రాన్స్మిషన్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం, గ్యాస్ ఇన్సులేటివ్ స్విచ్ గేర్, బుషింగ్స్ పరిశ్రమ ఏర్పాటుకు, హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ కంపెనీ ఏర్పాటుకు కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఈ 3 భారీ కంపెనీల ఏర్పాటు ద్వారా 3,745 కోట్ల రూపాయల పెట్టుబడులు, 1,518 మంది యువతకు ఉపాధి లభిస్తుందని మంత్రుల బృందం తెలిపింది. సుమారు 2,398 కోట్లతో ఏర్పాటు చేస్తున్న కోకా కోలా బేవరేజెస్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా 600 మందికి ఉపాధి లభిస్తుందని, 785 కోట్లతో రూపాయల పెట్టుబడితో వస్తున్న జెఎస్‌డబ్ల్యు కంపెనీ ద్వారా 364 మందికి ఉపాధి లభిస్తుందని, 562 కోట్ల రూపాయల పెట్టుబడి తో వస్తున్న తోషిబా కంపెనీ ద్వారా 554 మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు మంత్రులకు వివరించారు. కోకా కోలా వంటి కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ సాగు చేసే రైతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బేవరేజెస్ పరిశ్రమల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యాన పంటల ఉత్పత్తులు ఆయా కంపెనీలకు అవసరం అవుతాయని, తద్వారా రాష్ట్రంలో మామిడి, నారింజ వంటి పంటలు సాగు ఉత్పత్తులకు డిమాండ్ ఏర్పడి రాష్ట్ర రైతులకు గణనీయంగా ఆదాయం సమకూరుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. దావోస్‌తో పాటు వివిధ దేశాల నుంచి మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిన వివిధ కంపెనీలు జరిగిన ఎంయులు, విధి విధానాలపై కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు సమీక్షించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి , కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్, డిప్యూటీసీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**24-09-2025, బుధవారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం**
**శరద్ ఋతువు, శుక్లపక్షం**
తదియ పూర్తి
చిత్త సా.4.18
వర్జ్యం : రా.10.34-12.21
దు.ఉ.11.36-12.24
శుభసమయం: ఉ.7.30-8.30, సా.6.45-7.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**వృషభం:** గృహం కొనుగోలు యత్నాలు ఆవరణలో పెడతారు. ఉద్యోగులకు స్థాన మార్పులు వుంటాయి.

**మిథునం:**నూతన వ్యక్తులు పరిచయమై మాట సహాయం అందిస్తారు. శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :**పోటీ పరీక్షలలో మీరు ఊహించిన ఫలితాలు పొందలేరు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**సింహం:** సభలు, సమావేశాలలో పాల్గొంటారు. సంతాన పురోగతి బాగుంటుంది.

**కన్య :** నిర్మొహమాటంగా వ్యవహరించి కొన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ప్రయాణాలు,

**తుల :**నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం అందుతుంది.

**ధనుస్సు:** కొన్ని ఆర్థిక కారణాల వల్ల గృహ నిర్మాణ కార్యక్రమాలకు ఆటంకం కలుగుతుంది.

**మకరం:** తల్లిదండ్రుల విషయంలో ప్రత్యేక శ్రద్ధను వహిస్తారు. దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు.

**కుంభం:** పరిస్థితులకు అనుగుణంగా మీ అభిరుచులను మార్చుకోగలుగుతారు. వాహనసౌఖ్యం,

**మీనం :** అవసరమైన సమాచారము కొరకు ధనమును, పాత పరిచయములను ఉపయోగిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మహాజాతరగా మేడారం

>> నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు వివరించారు. ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలు సీఎం తెలుసుకున్నారు. ఆలయాన్ని విస్తరణ, అభివృద్ధిని ముక్తకంఠంతో పూజారులు, ఆదివాసీ సంఘాలు ఏకీభవించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పలు అంశాలను సిఎం దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చారు.

**రాతి కట్టడాలతోనే నిర్మాణాలు**

వందరోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించానాని, ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా సమ్మక్క సారలమ్మ ఆలయం ఉందనీ అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములయిన వారి జన్మ ధన్యమవుతుందనీ తెలిపారు.

**ఆదాయం ఆశించి కాదు భక్తితో పని చేయాలి.**

ఇలాంటి అవకాశం ఈ జన్మకు దక్కిన వరం లాంటిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆలయ నిర్మాణ పనులలో ఆదాయం ఆశించి కాదు.. భక్తితో పనిచేయాలని సూచించారు. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేలా పనిచేస్తూ, జంపన్న వాగులో నీటి నిల్వ ఉండేలా సాగునీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైనచోట చెక్ డ్యామ్ లు నిర్మించాలని, రాబోయే వంద రోజులు సమ్మక్క సారలమ్మ మాలధారణ చేసినట్లుగా నిష్ఠతో పనిచేయాలన్నారు.

**అంకితభావంతో పనిచేసే బృందం ఏర్పాటు చేయాలి**

ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా అంకితభావంతో పనిచేసే ఒక బృందం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిధులు గ్రీన్ చానల్ లో విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహా జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని సమ్మక్క సారమ్మల గద్దెలు ప్రాంగణ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు ఆదివాసీలను భాగస్వాములను చేస్తూ ఆలయ అభివృద్ధి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిందని, తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ఈ జాత రప్రతీక అని సీఎం పేర్కొన్నారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ



మంగళవారం మేడారంలో అమ్మవారికి నిలువెత్తు బంగారం తులాభారం వేసిన సిఎం రేవంత్

తల్లులని, నేను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను సందర్శిస్తున్నానని, ఫిబ్రవరి 6, 2023 న ఈ గడ్డమీద నుంచే పాదయాత్ర మొదలుపెట్టానని, సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని అన్నారు.

ఆదివాసీల ఆచార వ్యవహారాలకు, సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలనే ఆలోచనతో మీ అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడికి వచ్చామన్నారు. సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే మా అభిమతం అన్నారు. ఇది డబ్బులతో కొలిచేది కాదు.. నమ్మకంతో కొలిచేదని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలన్నారు. మేడారం జాతర తెలంగాణ సాంస్కృతిక గొప్పతనాన్ని, గిరిజనుల పోరాట చరిత్రను ప్రతిబింబిస్తుందని, ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందేలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మేడారంలో శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెలు మరియు ప్రాంగణ పునరుద్ధరణ పనుల డీజన్లను విడుదల చేశారు.

**మేడారం జాతర జాతీయ పండుగ గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి**

కేంద్ర ప్రభుత్వం కుంభమేళాకు వేలకోట్ల రూపాయలు కేటాయిస్తున్న నేపథ్యంలో మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించడానికి నిధులను కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న సమ్మక్క సారలమ్మ ఈ జాతరకు ఎన్నో ఏళ్ల చరిత్ర, పోరాట పటిమ, రాచరిక వ్యవస్థ పై తిరుగుబాటు జెండా ఎగరేసిన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు.

**మరో వెయ్యిఏళ్ల చరిత్ర కి సజీవ సాక్ష్యంగా గద్దెల నిర్మాణాలు..**

ఆసియాలోని అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని పునరుద్ధరించడం కోసం సీఎం ఈ ప్రాంతానికి రావడం చాలా సంతోషంగా ఉందని మంత్రి సీతక్క అన్నారు. గద్దెల పునరుద్ధరణలో భాగంగా ఆదివాసీల ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా, జాతర ప్రాశస్తం అనేక శతాబ్దాలు గుర్తిండి పోయేలా ప్రణాళిక రూపొందించారన్నారు. పూర్తిగా గ్రానైట్ రాయితో వనదేవతల ప్రాంగణాన్ని నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. 13వ శతాబ్దంలో మొదలైన సమ్మ క్కసారలమ్మ చరిత్ర మరో వెయ్యి సంవత్సరాలు ఆదివాసి సాంప్రదాయాలతో గుర్తుండేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు.

# కోల్‌కతాలో కుంభవృష్టి

## దుర్గాపూజా మండపాల్లో విద్యుత్‌షాక్‌కు 10 మంది మృతి

### తక్షణ సాయం ప్రకటించిన సిఎం మమత

**కోల్‌కత్తా, సెప్టెంబరు 23:** నగరంలో కుంభవృష్టి వర్షాలకు గాను అనేకలోతట్టుప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. కనీసం పది మంది ఈ వరదల్లో మృతిచెందారు. రైల్వే ట్రాక్‌లపైకి వర్షపునీరు వచ్చిచేరడంతో అనేకరైళ్లు రద్దయ్యాయి. సబర్బన్‌రైళ్లు కూడా నిలిచిపోయాయి. కొన్ని ఇతర మార్గాలకు మళ్లిస్తే మరికొన్నింటిని రద్దుచేసారు. కనీసం 30 కోల్‌కత్తాకు రావాల్సిన విమానసర్వీసులు రద్దయ్యాయి. విమానాశ్రయంలోని యాప్రాన్ ప్రాంతాల్లో, రన్‌వేలు కూడా వర్షపునీరు నిలిచిపోవడంతో విమానసర్వీసులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. 42 విమానాలు విపరీతమైన ఆలశ్యంతో నడిచాయి. కోల్‌కత్తా మెట్రో సర్వీసులకు అంతరాయం కలిగింది. 1986తర్వాత మళ్లీ అంతటి భారీ స్థాయి వర్షం కురిసిందని అంచనా. దుర్గాపూజా మండపాల్లోనికి నీరు రావడం, ఆపై అక్కడకు వచ్చిన భక్తులకు అరక్షిత విద్యుత్ వైర్లు తాకడంతో పదిమంది చినపోయారు. విద్యుత్‌సరఫరా సిఇఎస్‌సి ద్వారానే జరిగిందని, సురక్షితంగాకేబుల్స్ లేవన్న విమర్శలు వెల్లువెత్తాయి. కాగా భారీ వర్షాలకు ఒక్కరోజే 251.4 మిల్లీమీటర్లవర్షపాతం నమోదయింది. గడచిన 137 ఏళ్లలో ఒక్కరోజులో భారీ వర్షం కురవడం ఇది మూడోసారి అని చెపుతున్నారు. వర్షపునీటికి దుర్గా పూజా మందిరాలు దెబ్బతిన్నాయి. వర్షపునీటికి విద్యుత్ వైర్లు తోడవడంతో షార్ట్‌సర్క్యూట్‌కే పదిమంది చనిపోయినట్లు తేలింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెంటనే స్పందించారు. చనిపోయిన కుటుంబాల్లో ఒక్కొక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని, సిఇఎస్‌సి అదనపు పరిహారం చెల్లించాలని కూడా ఆదేశించారు.

# 763 టిఎంసి వాటా తెలంగాణకివ్వండి

>> వినిపించడానికి సమయం కేటాయించబడిందని తెలిపారు. కృష్ణా ట్రైబ్యునల్ ముందు స్వయంగా నీటి పారుదల శాఖ మంత్రి హాజరుకావడం బహుశా దేశంలో ఇదే మొదటి సారి అయి ఉంటుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని ఎంతగానో సీరియస్‌గా తీసుకుంతుందో అర్థం అవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే విధంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 1005 టిఎంసిల నీటిలో 811 టిఎంసిలు 75శాతం నికరజలాలు ఆధారంగా,దీనికి తోడు 65 శాతం నికరజలాలు 49 టిఎంసిలు 65శాతం,సగటు ప్రవాహాల ఆధారంగా 145 టిఎంసిలు కేటాయించబడ్డాయి అదనంగా గోదావరి డైవర్షన్ ద్వారా 45 టిఎంసిలు ఎగువ రాష్ట్రమైన తెలంగాణకు వాటా లభిస్తోంది. కృష్ణానదిలో 1050 టిఎంసిలు కేటాయించబడ్డాయి. సగటు ప్రవాహాల కంటే ఎక్కువగా వచ్చే నీటిని వినియోగించుకోవచ్చని కూడా స్వేచ్ఛ ఇచ్చారు. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇప్పుడు కొత్తగా నది పరివాహక ప్రాంతల ఆధారంగా వాటాను కోరుతోందనిఉత్తమ్ తెలిపారు, తెలంగాణ డిమాండ్ శాస్త్రీయమైనది, అంతర్జాతీయం నది చట్టాలకు అనుకూలమైందని అన్నారు. క్యాచ్‌మెంట్ ఏరియా, బేసిన్‌లోని జనాభా, కరవు ప్రాంతం విస్తీర్ణం, సాగు భూములు వంటి అంశాల ఆధారంగా లెక్కలు వేసి 75శాతం నికరజాలలాలలో 555 టిఎంసిలు, 65శాతం నికజలాలు 43 టీఎంసీలు, సగటు ప్రవాహాల నుండి 120 టిఎంసిలు, పోలవరం నుంచి కృష్ణా బేసిన్ ఆవతలికి తరలించే గోదావరి నీటి కారణంగ 45 టిఎంసిలు తెలంగాణకు మొత్తంగా 763 టిఎంసిలు రావాలని కోరుతున్నామని అన్నారు సగటు ప్రవాహాలపై మిగిలిన అదనపు నీటిని వినియోగించే స్వేచ్ఛ కూడా తెలంగాణదేనని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించబడిన 811 టిఎంసిలు పెద్ద భాగాన్ని బేసిన్ వెలుపలికి మళ్లించిందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఇలాంటివి ఆపాలని, బదులుగా ప్రత్యామ్నాయ వనరులను వినియోగించాలని ట్రైబ్యునల్ ముందు తెలంగాణ విన్నవించుకుందని అన్నారు. అలా మిగిలిన నీటిని ప్రాంతాలలో వాడుకోవాలి. సగటు ప్రవాహాలపై మిగిలిన మొత్తం నీటిని వినియోగించే హక్కు తెలంగాణకే ఉందని, దీన్ని ట్రైబ్యునల్ ముందు బలంగా వాదిస్తామని అన్నారు. ఇది కేవలం ఒక డిమాండ్ మాత్రమే కాకుండా, దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిచేసే చర్య అని చెప్పారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలను తెలంగాణకే కేటాయిస్తూ, 512 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఒప్పందానికి అంగీకరించడం రైతులకూ, కరవు ప్రాంతాలకూ మోసం చేశారని ఉత్తమ్ అన్నారు. దాదాపు పది సంవత్సరాల పాటు బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని అంగీకరించింది. అందుకే ఇప్పుడు ఆ ఫైలును మళ్లీ తెరిచి మొదటి నుంచి వాదనలు వినిపిస్తున్నాం. 299 టిఎంసిలు అంగీకరించిన గత ఒప్పందం, మేం కోరుతున్న 763 టిఎంసిల మధ్య వ్యత్యాసమే ఈ అన్యాయానికి నిదర్శనం," అని అన్నారు. జలశక్తి మంత్రిత్వశాఖలో కూడా ఆ ఒప్పందం నమోదైనప్పటికీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారికంగా తిరస్కరించిందని చెప్పారు. పొరుగు రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణ రాజీపడబోదని అన్నారు కర్నాటకలో కాంగ్రెస్ ఉన్నా, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ఉన్నా, మహారాష్ట్రలో బిజెపి ఉన్నా, తెలంగాణ తన హక్కుల కోసం కఠినంగా పోరాడుతుంది. ఒక్క చుక్క నీళ్లను కూడా వదులుకోదు," అని ధీమా వ్యక్తం చేశారు. ఆల్మట్టి ఎత్తు పెంపును అడ్డుకోవడానికి సుప్రీంలో తేల్చుకొంటామని హెచ్చరించారు. ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే కర్ణాటక యోచనను ఆయనతీవ్రంగా వ్యతిరేకించారు. ట్రైబ్యునల్‌న్యాయమూర్తి బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని విచారణలో తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. "మేము మా వాదనలను అన్ని ఆధారాలతో సమర్పించాం. ఈ సారి తెలంగాణకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉంది," అని ఉత్తమ్ అన్నారు.

# సర్పంచ్, ఎంపిటిసి సీట్లకు రిజర్వేషన్లు ఖరారు

**హైదరాబాద్,సెప్టెంబర్ 23 ,ప్రభాతవార్త:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీలు, మండలాలలోని వార్డులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ పూర్తయింది. జిల్లా కలెక్టర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ చేయనుంది. జీవో విడుదలైన తర్వాత రిజర్వేషన్ల తుది జాబితాను పంచాయతీరాజ్ శాఖ విడుదల చేస్తుంది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీలు, మండలాల పరిధిలోని వార్డులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను అధికారులు చేపట్టారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. సోమవారం (సెప్టెంబర్ 22) ఉదయం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలు, డీఆర్‌డీవోలతో సమావేశం నిర్వహించి.. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించిన మార్గదర్శకాలను వివరించారు. పంచాయతీరాజ్ డైరెక్టరేట్ నుంచి అందిన వివరాలకు అనుగుణంగా రిజర్వేషన్ల జాబితాలను రూపొందించాలని నిర్దేశించారు. దీంతో గ్రామ కార్యదర్శులు తమ గ్రామాల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మహిళల జనాభా వివరాలను ఎంపీడీవోలకు సమర్పించారు. ఈ వివరాల ఆధారంగా ఎంపీడీవోలు గ్రామాల్లోని వార్డుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. అదేవిధంగా.. మండలాల పరిధిలో ఎంపీటీసీలు, సర్పంచ్‌ల రిజర్వేషన్లను ఆర్డీవోలు నిర్ధారించారు.

## ములుగు మండలంలోని 23 గ్రామాలు ఎస్టీవిగా పరిగణించొద్దు: సుప్రీంకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు23:** తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించగా, ఆయా గ్రామాల గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కనపెట్టి నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై ఆ గ్రామాలను ట్రైబల్ గ్రామాలుగా గతంలో తెలంగాణ హైకోర్ట్ ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టులో పరమాత్మ, పూజారి సమ్మయ్యలు సవాల్ చేశారు. మంగపేటలోని 23 గ్రామాలను షెడ్యూల్ ట్రైబ్ గ్రామాలుగా పరిగణించవద్దంటూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్(ఎస్ఎల్పీ) పిటిషన్ దాఖలు చేశారు.

## బీహార్ వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు23:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం బీహార్‌కు వెళ్లారు. బుధవారం(24వ తేదీన) పాట్నాలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్లూసీ) సమావేశానికి ఆయన హాజరుకానున్నారు. బుధవారం సాయంత్రం అక్కడి నుంచి తమిళనాడుకు సిఎం రేవంత్ వెళ్లనున్నట్టుగా సమాచారం. 25వ తేదీన తమిళనాడులోని చెన్నైలో నీట్‌కు వ్యతిరేకంగా అక్కడి సిఎం స్టాలిన్ నిర్వహిస్తున్న జరుగనున్న సమావేశానికి సిఎం రేవంత్ హాజరయ్యే అవకాశం ఉందని అధికారిక వర్గాల సమాచారం.

## ఆయన్ని చూస్తే భయం..

>> తమకే భయంగా ఉందని వ్యాఖ్యానించింది. ఇక ఆయన ప్రజలకు ఎలా సేవ చేస్తారని మండిపడింది. సందీప్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ హోం సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది. మిడ్ మానేరు నిర్వాసితురాలు వనబట్ల కవితకు నష్ట పరిహారం చెల్లించాలని గతంలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ నష్టపరిహారం చెల్లించకపోవడంతో పాటు ఆర్డీవో, ఎమ్మార్వోలకు చెప్పి కవితపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై న్యాయం కోసం కవిత తాజాగా హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై గతంలో న్యాయస్థానానికి హాజరైనప్పుడు సందీప్ కుమార్ ఝూ డ్రెస్సింగ్‌పై.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టు ప్రోసిడింగ్స్ తెలియదా.. కోర్టుకు వచ్చే పద్ధతి ఇదేనా అంటూ కలెక్టర్‌పై మండిపడింది.

## యుద్ధాలు ఆపింది నేనే

>> యుద్ధాలను విరమింపచేసానని ట్రంప్ చెప్పుకొచ్చారు. వాస్తవానికి ఐక్యరాజ్యసమితి చేపట్టాల్సిన బాధ్యతలను తాను నెరవేర్చానని, యుద్ధాలను విరమింపచేయడంలో సమితి ఘోరంగా విఫలం అయిందంటూ ట్రంప్ ఐక్యరాజ్యసమితిపై తీవ్ర విమర్శలుచేసారు. సమితి ప్రస్తుతం నిస్తేజంగా ఉందన్నారు. అంతేకాకుండా ప్రపంచంలో రష్యా ఉక్రెయిన్‌పై దాడులకు భారత్,చైనాలు నిధులు సమకూరుస్తున్నాయంటూ మండిపడ్డారు. ఐక్యరాజ్యసమితి 80వ వార్షిక సమావేశాల్లో ప్రసంగించిన ట్రంప్ ఆసాంతం తన ప్రసంగంలో భారత్‌పైనా, చైనాలపైనే ఎక్కుపెట్టారు. తను విరమింపచేసిన యుద్ధాల్లో కొన్ని 31 ఏళ్లుగా కొనసాగాయని, ఒకటయితే 36 ఏళ్లుగా సాగిందని అధికారంలోకి వచ్చినవెంటనే తాను వీటన్నింటినీ విరమింపచేసానన్నారు. నోబెల్ శాంతి పురస్కారానికి తాను అన్నివిధాలా అన్నిఅర్హతలు ఉన్నవాడినని చెప్పారు. కాబోడియా థాయిలాండ్, సెర్బియా, కాంగో, రువాండా, పాకిస్తాన్ ఇండియా, ఇజ్రాయెల్ ఇరాన్, ఈజిప్టు ఇథియోపియా, అర్మేనియా అజర్‌బైజాన్‌లమధ్య జరిగిన యుద్ధాలను తానే నివారించానని చెప్పారు.

## అక్టోబరు15లోపు 'వందేభారత్ స్లీపర్స్ రైళ్లు

### రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా వందేభారత్ రైళ్లు విజయవంతంగా నడుస్తున్నాయి. ప్రయాణీకులు సైతం ఉత్సాహంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణాలు చేస్తున్నారని రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ అన్నారు. వందేభారత్ స్లీపర్ రైళ్ల ప్రారంభంపై మంగళవారం ఆయన మాట్లాడారు. దేశంలో అన్ని ప్రధాన నగరాల్లో వందేభారత్ రైళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే వందేభారత్ స్లీపర్ రైళ్లు రెండు ఏర్పాటు చేయాలనే కేంద్రం కసరత్తు చేసింది. ఒక రైలు ఇప్పటికే సిదనదమైందని, రెండో రైలు తయారీ పనులు పూర్తికాగానే అక్టోబరు 15వరకు రెండు ఒకేసారి ప్రారంభం అవతాయని వివరించారు. సర్వీసులు సజావుగా సాగడానికి రెండు రైళ్లు అవసరమన్నారు. ఇప్పటికే న్యూఢిల్లీ, పాట్నా నడుమ నూతన రైళ్లు నడుస్తాయనే ఊహాగానాలు వెలువెత్తుతున్నాయి. ఇక వేగంలో కూడా క్రమక్రమంగా పెంచేందుకు గతంలో పలు సార్లు రాజస్థాన్ రైల్వే డివిజన్లఓ పరీక్షిం చారు. గరిష్టంగా 180 కిలోమీటర్ల వేగాన్ని అందుకున్నట్లు తెలిపారు.

## నిజామాబాద్‌లో రైస్‌మిల్ గోడకూలి తండ్రి, కుమార్తె మృతి

### తల్లికి గాయాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రం లో విషాద ఘటర చోటుచేసుకుంది. రైస్‌మిల్ గోడ కూలిన ఘటనలో తండ్రితోపాటు కుమార్తె మరణించింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఇందూరు మహేష్ కుమార్ (27) అతని తన భార్య మహేశ్వరితో పాటు ఆరు నెలల వయస్సున్నకు మార్తెతో కలిసి తమ ఇంట్లో నిద్రపోతున్నారు. అయితే ఉదయం నుంచి కురిసిన వర్షానికి వీరుండే ఇంటిపక్కనే గల రైస్‌మిల్ గోడ తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో ఒ క్కసారిగా కూలి ఇంటిషెడ్డుపై పడింది. ఈ ఘటనలో మహేష్ కుమార్‌తోపాటు అతని కుమార్తె మరణించగా మహేశ్వరి గాయాలపాలయ్యింది. ఈమెను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని పోలీసులు విచారణ చేబట్టారు.

## రైల్వేలో ఇకనుంచి ఆటోమెటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** భారత్ రైల్వేలో నూతన సరికొత్త టెక్నాలజీతో ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థను తీసుకువస్తుంది. లక్షలాది మంది ప్రయాణీకుల రాకపోకల్లో ఒక రైలు దాటిన తర్వాత సిగ్నల్ కోసం వేచి ఉండే పాత విధానాన్ని స్వస్తి పలికనుంది. కొత్తగా ఆటో మెటిక్ సిగ్నలింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. రైల్వే అధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ కొత్త విధానంతో ఒక స్టేషన్ నుంచి మరొక స్టేషన్‌కు క్రమం తప్పకుండా సిగ్నల్స్ చేరుతాయన్నారు. దీంతో ఒక రైలు సిగ్నల్‌ను దాటగానే మరో రైలే సిగ్నల్‌ను అందుకుని ట్రాక్‌పైకి వచ్చి వస్తుందన్నారు. గతంలో మొదటి రైలు బ్లాక్ సెక్షన్‌ను దాటే వరకు మరొక రైలును అనుమ తించే అవకాశం ఉండేది కాదన్నారు. నూతన వ్యవస్థ తక్కువ సమయంలో ప్రయాణీకులను ఎక్కువ రైళ్లను అందుబాటులోకి తీసుకరావచ్చన్నారు. ఆటోమెటిక్ వ్యవస్థతతో రైలు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉంటుందని ఆయన వెల్లడించారు. ఇటీవల ప్రయోగ పూర్వకంగా తూర్పు కోస్ట్ రైల్వే తాల్చేరు-పరదీప్ ఫ్రైట్ కారిడార్‌లోని కటక్-పరదీప్ ప్రాంతాల మధ్య ఈ అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థను విజయ వంతంగా ప్రారంభించింది. ఈ ఆటోమెటిక్ సిగ్నలింగ్ వ్యవస్థతో రైల్వే సేవలు ప్రయాణీకుల భద్రత, రైలు ప్రమాదాల తగ్గుదల, రైళ్ల ఆలస్యం కాకుండా ఉపయోగపడుతుందని వివరించారు. ఇక వాణిజ్యానికి సంబంధించిన ఎగుమతులు, దిగుమతులు త్వరగా జరగనున్నట్లు పేర్కొన్నారు.

# మీ నేతల విగ్రహాల కోసం ప్రజాధనం ఎందుకు?

### తమిళనాడు డిఎంకె సర్కారుకు సుప్రీం షాక్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎమ్‌కే ప్రభుత్వానికి భారత అత్యున్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. విగ్రహాల ఏర్పాటు కోసం ప్రజల సొమ్మువాడొద్దని ఆదేశించింది. 'మీ మాజీ నాయకులను కీర్తించటం కోసం ప్రజాధనాన్ని ఎందుకు వాడుతున్నారు. ఇందుకు అనుమతి లేదు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, ప్రశాంత్ కుమార్ మిశ్రా స్పష్టం చేశారు. తమిళనాడు ప్రభుత్వం తిరునెల్వేలి జిల్లా వల్లియూర్ కూరగాయల మార్కెట్ ప్రవేశ ద్వారం ముందు దివంగత నేత కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కొన్ని నెలల క్రితమే విగ్రహా ఏర్పాటు పనులు మొదలయ్యాయి. ప్రభుత్వం 30 లక్షల దాకా ఖర్చు పెట్టింది. అయితే, ఇలాంటి సమయంలో విగ్రహా ఏర్పాటును వ్యతిరేకిస్తూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు అయింది. విచారణ జరిపిన హైకోర్టు పిటిషన్‌కు సానుకూలంగా స్పందించింది. పబ్లిక్ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకూడదని హైకోర్టు పేర్కొంది. కొన్ని సందర్భాల్లో విగ్రహాల కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపింది. విగ్రహా ఏర్పాటును ఆపాలని తీర్పునిచ్చింది. అయితే, ప్రభుత్వం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తాజాగా, ఈ పిటిషన్‌పై ఇద్దరు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు బెంచ్ విచారణ జరిపింది. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు బెంచ్ మద్దతు ఇచ్చింది. ప్రభుత్వంపై మండిపడింది. మాజీ నాయకులను కీర్తించటం కోసం ప్రజా ధనాన్ని ఎలా వాడతారని జస్టిస్ విక్రమ్ నాథ్, ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రశ్నించారు. విగ్రహా ఏర్పాటుకు అనుమతి ఇవ్వటం కుదరదని స్పష్టం చేశారు. స్పెషల్ లీవ్ పిటిషన్‌ను వెంటనే వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఊరట కావాలనుకుంటే అదీ అవసరం అనుకుంటేనే హైకోర్టును ఆశ్రయించాలని సూచించారు

# బెట్టింగ్ యాప్‌లపై ఇడి విచారణకు క్రికెటర్ యువరాజ్‌సింగ్ హాజరు

### ఇన్‌ఫ్లూయెన్సర్ అన్వేషిజైన్ కూడా..

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బెట్టింగ్ యాప్‌లపై విచారణ చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) ఎదుట మంగళవారం క్రికెటర్ యువరాజ్‌సింగ్ హాజరయ్యారు. ఆయనతో పాటు ఇన్‌ఫ్లూయెన్సర్ అన్వేషి జైన్ కూడా హాజరయ్యారు. క్రికెటర్లు యువరాజ్ సింగ్‌తో పాటు సురేష్‌రైనా, శిఖర్ ధావన్, రాబిన్ ఉతప్ప, బెంగాల్ నటి టిఎంసి ఎంపి మిమి చక్రవర్తి, నటుడు అంకుష్ హజ్రాలపై ఢిల్లీ ఇడి విభాగం బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నందుకు కేసు నమోదు చేయడం తెలిసిందే. వీరంతా 1 బెట్ బెట్టింగ్ యాప్‌కు అంబాసిడర్లుగా వ్యవహరిస్తుండడం తెలిసిందే. ఈ బెట్టింగ్ యాప్ అక్రమంగా బెట్టింగ్ చేస్తూ లక్షలాది మంది అమాయకుల నుంచి కోట్లాది రూపాయలను లూటీ చేసిందని ఇడి తేల్చడం విదితమే. ఇదే సమయంలో కోట్ల రూపాయల పన్ను లను సైతం ఎగవేసినట్లు ఇడి గుర్తించింది.

ఈ కంపెనీ 18 యేళ్లుగా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఇడి గుర్తించింది. క్రీడలు ముఖ్యంగా క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న సమయంలో పందాలు కాస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు గెలుచుకోవచ్చని బెట్టింగ్ యాప్ నిర్వాహకులు సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడంతో యువత దీనిపట్ల బాగా ఆకర్షిమయింది. 70 భాషల్లో ఈ యాప్ వున్నట్లు ఇడి గుర్తించింది. ఇంతకు ముందు యువరాజ్‌సింగ్‌తోపాటు సురేష్‌రైనా, శిఖర్ ధావన్, రాబిన్ ఉతప్పలను ఢిల్లీ విభాగం విచారించింది.

తాజాగా యువరాజ్ సింగ్‌ను నాలుగు గంటలపాటు విచారించి ఆయన వాంగ్మూలం తీసుకుంది. మనీ లాండరింగ్ కోణంలో ఇడి విచారణ జరిగినట్లు సమాచారం. యువరాజ్‌సింగ్ కంటే ముందుగా ఇన్‌ఫ్లూయెన్సర్ అన్వేషిజైన్‌ను కూడా ఇడి అధికారులు విచారిం చారు. కాగా రెండు నెలల క్రితం హైదరాబాద్ ఇడి విభాగం నటులు రానా మంచు లక్ష్మి, విజయ్ దేవరకొండలను విచారించడం తెలిసిందే.

# అక్టోబర్ 24న కాలిఫోర్నియా వెళ్లనున్న కెటిఆర్

### తాల్ హెల్త్‌ఫెస్ట్-2025కు ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 23:** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావుకు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జరగనున్న ప్రతిష్టాత్మక తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ మంగళవారం ఒయు మాజీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్‌తో కలిసి తాల్ హాస్పిటల్స్ సిఇఒ సాయి గుండవెల్లి కెటిఆర్‌ను కలిసి ఆహ్వానించారు. 2025 అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో (యుసిఎస్‌డి)లో ఈ హెల్త్‌ఫెస్ట్ 2025 నిర్వహిం చనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, మార్పు తీసుకొచ్చేవారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సంరక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కెటిఆర్ కీలకోపన్యాసం చేయనున్నారు. తెలంగాణలో టెక్నాలజీ ఆధారిత పాలన, ఆవిష్కరణలతో కూడిన అభివృద్ధి, ఆరోగ్య రంగంలో తీసుకువచ్చిన విధానాలు ప్రపంచ ప్రజలకు ఎంతో విలువైనవిగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. తమ ఆహ్వానాన్ని కెటిఆర్ అంగీకరించినందుకు టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపింది. హెల్త్‌ఫెస్ట్-2025లో ఆయన భాగస్వామ్యం ఈ వేదికపై అర్థవంతమైన చర్చలకు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద ప్రవాహం

### 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

### సాగర్ జలాశయానికి 3,42,506 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

### 586.50 అడుగుల వద్ద నీటి మట్టం



**నాగార్జునసాగర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** కృష్ణానది పరివాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువనున్న జలాశయాలు నిండి ఉధృతంగా ప్రవహిస్తు న్నాయి. ఎగువ ప్రాజెక్టులన్ని నిండి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం క్రస్ట్ గేట్లు మరియు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ మొత్తం 3,42,506 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు వచ్చి చేరుతుండటంతో ఎన్‌ఎస్పి అధికారులు 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అందులో 12గేట్లను 5 అడుగులు 14 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,93,262 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 586.50 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 302.9125 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33,495 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వద్వారా 3549 క్యూసెక్కుల నీటిని, ఎస్.ఎల్.బి.సి ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని, లోలేవల్ కెనాల్ ద్వారా 300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుండి మొత్తం 3,42,506 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్ 2లో కలబ్‌గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం దయా పిఎస్పీ పంపింగ్ మెయిన్‌కు వివిధ ప్రాంతాల్లో భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు బుధవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు అనగా గురువారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ 24 గంటలు కొన్ని ప్రాంతాల్లో లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు తెలిపారు. అంతరాయం ఏర్పడే ప్రాంతాలు - ఓ అండ్ ఎం డివిజన్ 17 పరిధిలో ఆర్‌సిపురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్, ఓ అండ్ ఎం డివిజన్ 22 పరిధిలో బీరంగూడ, అమీన్ పూర్, ట్రాన్స్ మిషన్ డివిజన్ 2 పరిధిలో ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు, ఓ అండ్ ఎం డివిజన్ 6 పరిధిలో ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్, ఓ అండ్ ఎం డివిజన్ 9 పరిధిలో కెపిహెచ్‌బి కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ ప్రగతి నగర్ కాలనీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు తెలిపారు.

# మల్లోజుల వేణుగోపాల్‌ను ద్రోహిగా పేర్కొన్న మావోయిస్టు పార్టీ

### వెంటనే ఆయుధాలు అప్పగించాలని ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీ ఆయుధాలు వీడుతున్నట్లు, కాల్పుల విరమణ చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేసిన కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతిపై ఆ పార్టీ కేంద్ర కమిటీ మరోసారి మండి పడింది. భూపతి చేసిన ప్రక టన ఆయన వ్యక్తిగతమని ఇప్పటికే తెలంగాణ విభాగం అధికార ప్రతినిధి జగన్ తెలపగా తాజాగా పార్టీ కేంద్ర కమిటీ భూపతిని ద్రోహిగా పేర్కొం ది. భూపతి చేసిన ప్రకటన ఏకపక్షంగా వుండడంతో పాటు మావోయిస్టు పార్టీకి తీరని ద్రోహం చేసేదిగా వుందని కేంద్ర కమిటీ మంగళవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మావోయిస్టు పార్టీపై భూపతి తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది సరైన విధానం కాదని ఆక్షేపించింది. భూపతి చేసిన ప్రకటనను ఖండించడంతో పాటు ఆయన వద్ద వున్న ఆయుధాలను వెంటనే పార్టీకి అప్పగించాలని కోరింది. ఆయన లొంగిపోయేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని కేంద్ర కమిటీ ఆరోపించింది. భూపతి వెంటనే ఆయుధాలు అప్పగించకుంటే పీపుల్స్ గెరిల్లా ఆర్మీ స్వాధీనం చే సుకుంటుందని హెచ్చరించింది. భూపతి దివంగత మావోయిస్టు పార్టీ నాయకుడు మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీకి స్వయానా సోదరుడు కావడం గమనార్హం.



## అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 23:** అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందించారు. ఇటీవల అఖిల భారత ఫుట్ బాల్ సమాఖ్య నుంచి సౌమ్య ఉత్తమ క్రీడాకారుణి అవార్డు అందుకున్నారు. ఫుట్‌బాల్‌లో విశిష్ట ప్రతిభను చూపిస్తున్న సౌమ్యను సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు డా.మహమ్మద్ అలీ రఫాత్, ప్రధాన కార్యదర్శి పాల్గొణ పాల్గొన్నారు.

# నాన్‌డ్యూటీ లిక్కర్‌పై కొనసాగుతున్న తనిఖీలు

### శంషాబాద్‌లో 125 ప్రీమియం మద్యం బాటిళ్ల స్వాధీనం

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** శంషాబాద్ ప్రధాన రహదారిలో రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం సిఐలు సుభాష్‌చందర్ బాలరాజు సిబ్బంది కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 125 ప్రీమియం లిక్కర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గోవా ప్రాంతాల నుంచి మద్యాన్ని తీసుకు వచ్చినటువంటి 15 మందికి నోటీసులు ఇచ్చారు. పట్టుకున్న మద్యం విలువ రూ. 7.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. హెచ్‌డిఎఫ్‌డిటీం సిఐ నాగరాజు ముషీరాబాద్ అచ్చయ్య నగర్‌లో ఇ నరేష్ ఇంట్లో ఆరు జానీ వాకర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు న్నారు.

**భారీగా బెల్లం పట్టివేత..**

నాటుసారా తయారీకి వినియోగించే నల్లబెల్లాన్ని ఎస్టిఎఫ్‌బి టీమ్స్ ఎస్ఐ బాలరాజు హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ తరలి వెళ్తున్న బెల్లం వాహనాన్ని పట్టుకున్నారు. ఆ వాహనంలో 2,010 కేజీల బెల్లం, 50 కేజీల ఆలంను స్వాధీనం చేసుకున్నారు.

ఒక డీసీఎం వాహ నంతో పాటు రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసు కున్నారు. ఈ కేసులో అశోక్ లేలాండ్ వాహనంతోపాటు మహర్షి, ఖాసీంలను అరెస్ట్ చేశారు. బెల్లం, మద్యం విలువ మొత్తంగా రూ. 4.56 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు.

# నేడు పాట్నాలో సిడబ్ల్యుసి భేటీ

### బీహార్ ఎన్నికల వ్యూహాంపై చర్చ

### ఆ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపైనా సమాలోచనలు జరిపే అవకాశం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ అత్యున్నత కమిటీ సీడబ్ల్యూసీ సమావేశం బుధవారం పాట్నా వేదికగా జరుగనుంది. ఎన్నికల ప్రచారం, ఓట్ చోరీపై దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాట్నాలో జరిగే సీడబ్ల్యూసీ భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే సీడబ్ల్యూసీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ లీడర్లు పాట్నా చేరుకున్నారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా పార్టీ అగ్రనేతలంతా హాజరుకానున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశంలో రెండు తీర్మానాలను ఆమోదించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. సీడబ్ల్యూసీ సమావేశం ఉదయం 10గం.లకు సదాకత్ ఆశ్రమంలో జరుగుతుంది. స్వాతంత్ర్యానంతర కాలంలో పార్టీ తన అత్యున్నత నిర్ణయాలు తీసుకునే కమిటీ సమావేశాన్ని బీహార్‌లో నిర్వహించడం ఇదే మొదటిసారి. బీహార్ ఎన్నికలతోపాటు త్వరలో జరుగనున్న ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలపైనా చర్చించనున్నారు. ఓటు చోరీకి సంబంధించి బీజేపీపై దాడిని పెంచడంపై దృష్టి సారించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ 'సర్'కు వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ 'ఓటరు అధికార్ యాత్ర' నిర్వహించిన కొద్ది రోజులకే ఈ సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మహాఘట్‌బంధన్ మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకాలపైనా సమాలోచనలు చేయనున్నారు.

# మావోయిస్టు ఉద్యమానికి చుక్కెదురు

### కొంప ముంచుతున్న కోవర్ట్ ఆపరేషన్

### నెలరోజుల్లో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు మృతి

### మరో సభ్యురాలు లొంగుబాటు

**చర్ల, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** గడిచిన ఏడాదిన్నర కాలంలో మావోయిస్టు ఉద్యమానికి మునుపెన్నడూ లేని విధంగా వరస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశం చూస్తారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేసిన విధంగా జరుగుతుందా అన్న ఆలోచన మొదలైంది తాజా పరిస్థితులను బట్టి చూస్తే మావోయిస్టు ఉద్యమానికి కేంద్ర బిందువైన క్రేంద్ర కమిటీ సభ్యులను టార్గెట్ చేసి వారిని లేకుండా చేస్తే ఉద్యమం నీరుగార్చవన్న లక్షంతో టార్గెట్ కేంద్ర కమిటీ సభ్యుల ఏరివేత షూరు చేసారు. వరుస ఎన్ కౌంటర్లలో అగ్ర నాయకత్వాన్ని కోల్పోతున్న మావోయిస్టు ఉద్య మానికి మరో ఎదురుదెబ్బ తగిలింది.

ఛత్తీస్ గఢ్ లోని నారా యణపూర్ జిల్లా అబూజ్‌మఢ్ అటవి ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్లో కేంద్ర కమిటీ సభ్యులు కట్టా రామచంద్రారెడ్డి) కడారి సత్యనారాయణ రెడ్డి మృతి చెందారు. ఈ ఎన్ కౌంటర్ కోవర్టు ఆపరేషన్ తోనే జరిగింది అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మావోయిస్టు ఉద్యమ ప్రస్థానంలో దాదాపు పాతికేళ్ల తర్వాత కేంద్ర కమిటీ స్థాయిలో వ్యక్తులు చనిపోవడం ఇదే ప్రథమం ఉద్యమానికి దిశా నిర్దేశం చేసే మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మృతి చెందిన తర్వాత పార్టీలో నాయకత్వ లేమి కనిపిస్తుంది. కేశవరావు మృతి తర్వాత పార్టీలో విభేదాలు మొదలైనట్లు తెలుస్తుంది. అన్నీ తానై నడిపించే నాయకుడు మృతిచెందడం పార్టీకి కోలుకోని దెబ్బ అనేది సుస్పష్టం.

ఇటీవల సోను పేరుతో విడుదలైన లేఖ తాత్కరం. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సాదిస్తామని అడవి బాట పట్టి ఉద్యమాన్ని చేపట్టి నాలుగు దశాబ్దాల తర్వాత సోను పేరిట విడుదలైన లేఖ కలకలం సృష్టించింది. మావోయిస్టు చీఫ్ నంబాల ఆయుధాలు వీడి చర్చలు చేద్దామని ఆయన ఉద్దేశం ప్రకటించడం మావోయిస్టు ఉద్యమానికి తీవ్ర విఘాతం కలిగించిన అంశం ఈ క్రమంలో మరో కేంద్ర కమిటీ సభ్యుడు సోను ప్రకటన తన వ్యక్తి గత విషయం అని పార్టీ అభిప్రాయం కాదని వెల్లడించడం మావోయిస్టు ఉద్యమంలో చీకటి కోనాలు వెలుగుచూస్తున్నట్లు అర్థం అవుతుంది. తాజా పరిస్థితులను బట్టి చూస్తే మావోయిస్టులలో అంతర్గత విభేదాలు మొదలైనట్లు తెలుస్తుంది. ఇదే అదునుగా భావించిన కేంద్ర ప్రభుత్వం తమ కోవర్టు ఆపరేషన్ కు మరింత పదును పెట్టి అగ్రనాయకత్వాన్ని ఏరివేసే పనిలో నిమగ్నమైంది. కేంద్ర కమిటీ సభ్యులకు నాలుగు అంచెల భద్రత ఉంటుంది.

అటువంటి తరుణంలో భద్రతా వలయాన్ని చేదించి కేంద్ర నాయకత్వాన్ని ఒక్కొక్కరినీ ఏరివేస్తున్నారంటే నిఘా వ్యవస్థ ఏ మేరకు పనిచేస్తుంది. వారి కోవర్టు ఆపరేషన్ సక్సెస్ అవుతుండటం మావోయిస్టు ఉద్యమాన్ని అంతర్మధనంలో పడేస్తుంది.

మరో వైపు వరసగా జరుగుతున్న ఎన్ కౌంటర్ల పై పౌరసక్కుల సంఘాలు మానవ హక్కుల సంఘాలు చేసిన ప్రయత్నాలను ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. శరణమా మరణమా తేల్చుకోవాలని అని కేంద్ర స్పష్టం చేసిన నేపద్యంలో మావోలలో మరణం కంటే శరణమే అన్న ఆలోచన మొదలైనట్లు వినికిడి.

# వరంగల్‌లో కొత్త సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** వరంగల్లో కేంద్ర ప్రభుత్వం సైన్యాధారిత ఉద్యోగులు, పింఛన్ పొందే పౌరులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి కొత్త సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సిజిహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్‌ని ఆమోదించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సౌకర్యం ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు ఉపయోగపడనుందని, అయితే, సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లో ప్రాథమిక ఓపిడి చికిత్సలు సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉంటాయన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యోగుల సంక్షేమం, సామూహిక ఆరోగ్య పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రాధ్యానతను మళ్లీ ప్రస్తావిస్తుందన్నారు. ఇది సబ్కా సాత్, సబ్కా వికాస్ దార్శనికతకు సాక్ష్యంగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

వరంగల్లో కొత్త వెల్‌నెస్ సెంటర్ ఆమోదం పొందిన విషయాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ కొత్త సౌకర్యం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లు, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుండటం, ప్రాంతీయ ఆరోగ్య రంగానికి కీలక చొరవగా ఉంటుందన్నారు.


కొంత లోకజ్ఞానం, కొంత ఓర్పు, కొంత హాస్య చతురత ఉంటే ఈ జీవితంలో మనం ఎంతగానో సంతోషంగా ఉండవచ్చు.

-బల్తజాన్

# సూత్రధారులే మూలం

చట్టాలకు సామాన్యులు లోకువ, సమర్థులకు చట్టాలు లోకువ అంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారోకానీ మారిన కాల, మాన పరిస్థితుల్లో ఇది అక్షరాల నిజమనిపిస్తుంది. ఆర్థిక, అంగ, అధికార, రాజకీయ బలం ఉన్నవారు తప్పుచేస్తే చర్యల సంగతి అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్టపు రోజులు దాపురించాయి. మిగిలిన విషయాలు ఎలాఉన్నా మానవజాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలో అటు పాలకులు కానీ, ఇటు అధికార యంత్రాంగం కానీ అంత సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారేమోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎంతో పోలీసు సిబ్బందిఉంది. నిఘా వ్యవస్థలున్నాయి. ఏకంగా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఉంది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర విభాగాలున్నాయి.నిత్యం నిఘా పెడుతున్నారు. వీటన్నింటిని మించి తెలంగాణ ప్రభుత్వం 'ఈగల్' అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. కానీ నిత్యంఎక్కడో ఒకదగ్గర పట్టుబడుతూనే ఉన్నాయి. చిన్నస్థాయిలోనే కాదు భారీఎత్తున కోట్లాది రూపాయలు విలువైన డ్రగ్స్ నిందితులతోసహా పట్టుకుంటున్నారు. గత వారంలో సైబరాబాద్ పోలీసు కమీషనరేట్ పరధిలో దాదాపు ఇరువై అయిదు కోట్ల విలువైన గంజాయితో సహా మత్తుమందులను సీజ్‌చేశారు. ఈ మత్తు మందుల కేసుల్లో పట్టుబడుతున్న నిందితుల్లో తొంబైశాతం నలభై ఏళ్ల లోపల ఉన్న యువకులే. ఇటీవల కాలంలో యువతుల భాగస్వామ్యం కూడా పెరిగిపోతుండడం ఆందోళన కల్గిస్తున్నది. గత మూడేండ్లలో సైబరాబాద్ పరిధిలో 14వేల కేసులు నమోదు అయితే అందులో 13వేల 684మంది యువజనం ఉన్నారు.అందులో 316 మంది యువతులున్నారు. చెన్నై, ముంబాయి,బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లోని విమానాశ్రయాల్లోనూ ఇతర ప్రాంతాల్లోనూ గత రెండు,మూడేళ్లుగా పట్టుబడిందివెయ్యి కోట్లపైనే ఉండొచ్చని అంచనావేస్తున్నారు.అంతకుముందు ఒకసారి కేరళ సమీపంలో అరేబియా సముద్రంలో నౌకదళం స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్లో దాదాపు నాలుగు కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అధికార వర్గాలే అంచనా వేశాయి. ఈ యేడాది కూడా దేశవ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల డ్రగ్స్ కనుగొంటున్నారు. అంతెందుకు మొన్న హైదరాబాద్ నగరంలో మహారాష్ట్ర పోలీసులు ఏకంగా మత్తుమందు తయారు చేస్తున్న కర్మాగారాన్నే కనుగొన్నారు. ఈ సందర్భంగా పన్నెండు మందికిపైగా అదుపులోకి తీసుకున్నారు. ఇక గతవారంలో హైదరాబాద్ నడిబొడ్డున స్కూలు ముసుగులో మత్తుమందులు తయారు చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. భారీ ఎత్తున మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. మరోకపక్క మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో కూడా మత్తుపదార్థాల వినియోగం పెరిగిపోతున్నది. ముంబయి మహానగరం కొకైన్‌కు కేంద్రంగా మారినట్లు చెప్పక తప్పడం లేదు. ఇక గంజాయి సాగు దేశంలోనే అనేక రాష్ట్రాల్లో భారీగానే జరుగుతున్నట్లు సమాచారం. అయితే దండకారణ్యం ప్రాంతంలో ఇటీవల కేంద్ర పోలీసు బలగాలకు మావోయిస్టులకు జరుగుతున్న పోరుతో కొంత తగ్గినట్లు కన్పించినా కొన్ని ప్రాంతాల్లో మాత్రం విస్తారంగా సాగు చేస్తున్నారు.అప్పుడప్పుడు ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి గంజాయి పంటలను ధ్వంసం చేస్తున్నా మళ్లీ మూడు నెలల్లో యధావిధిగా సాగులోకి వస్తున్నాయి. అడవుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ సాగు చేసే స్మగ్లర్లు పట్టుబడగానే అదృశ్యమైపోతున్నారు. కేవలం ఆ ప్రాంతంలో ఉన్న అమాయక రైతులు, రైతు కూలీలు, ముఖ్యంగా గిరిజనులు ఈ కేసుల్లో ఇరుక్కుపోతున్నారు. గంజాయి సాగులోనేకాదు రవాణా, వ్యాపారంలో కూడా పట్టుబడుతున్నది పాత్రధారులే. మాదకద్రవ్యాలు అఫ్ఘానిస్థాన్ నుంచి ఆఫ్రికా మీదుగా భారత్ చేరుకొని వివిధ మార్గాల ద్వారా దేశంలోని అన్నిప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. కొన్ని మాదకద్రవ్యాల ముఠాలు ఈశాన్య భారతంలోని వివిధ తీవ్రవాద బృందాలకు నిధులు అందిస్తున్నట్లు కూడా సమాచారం. ఇది దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇక గంజాయితో పాటు బ్రౌన్‌షుగర్, కొకైన్ వంటి మత్తుపదార్థాల రవాణాలో కొందరు విద్యార్థులు పట్టుబడుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. మొత్తంమీద ఈ సరఫరా ముఠాల కదలికపై నిఘావేసి నియంత్రించాల్సిన నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, పోలీసులు తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా మత్తు పదార్థాల విస్తరణకు కారణమవుతున్నది. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్నది. ఈమహమ్మారి దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. మరోకపక్క ఎంతోమందిని అరెస్టు చేస్తున్నారు. కేసులు పెడుతున్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఈవ్యాపారం ఆగడంలేదు. లక్షలాది కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నది. ఈజాడ్యం విస్తరించడం అత్యంత ప్రమాదకరం. మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరి మితం కాకుండా ఆచరణలో చూపాల్సిన తరుణమిది. అవసరమైతే చట్టానికి మరింత పదునుపెట్టాలి. వినియోగం, ఉత్పత్తి, వ్యాపారం అత్యంత తీవ్రమైన నేరాలుగా కాంబోడియా, వియత్నాం,సింగపూర్ తదితర దేశాలు పరిగణించి మరణశిక్షలు కూడా విధించడానికి వెనుకాడడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా పాత్రధారులతోపాటు సూత్రధారులను పట్టుకుంటే తప్ప ఇది ఆగే పరిస్థితులు కన్పించడం లేదు.

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.



బి.జాన్సన్

చెలమలో నీరు తీసినకొద్దీ ఊరినట్టు, మనిషిలో చదివిన కొద్దీ వివేకం పెరుగుతుంది.



జె.ముర్రే

# ప్రజావాక్కు



### తిన్నింటి 'వీసాలు' లెక్కబెడుతున్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, హెచ్‌వన్‌బి వీసా ఫీజుని ఎకాఎకీ ఆరు రెట్లు పెంచి వెంటనే అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించడంభారత్‌లో ప్రకంపనలురేపింది. అమెరికాలో ఉన్న కంపెనీలు ఆ దేశ పౌరులు కాని తమ ఉద్యోగుల్ని అక్కడ ఉండిపనిచేసుకోడానికి ఉద్దేశించి ఇప్పించేపర్మిట్ లే హెచ్ వన్‌బి వీసాలు. అమెరికా వాటిని మూడు సంవత్సరాల వ్యవధికి ఇస్తుంది. తర్వాత అవసరమైతే ఇంకో మూడేళ్లు పెంచుతుంది. ఆ ఫీజు సంవత్సరానికి లక్ష డాలర్లు అంటే ఎనభై లక్షల రూపాయలుగా అధ్యక్షుడు పెంచినట్లు ప్రకటన మొదటవచ్చింది.తర్వాత అది సంవత్సరానికి కాదు, వన్ టైమ్ కట్టాల్సింది, అదీ కొత్త దరఖాస్తుదారులకే అని వివరణ వచ్చింది. కొంతనయం.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గెజిటెడ్ హోదా కల్పించాలి

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేయుచున్న పరిశోధన విద్య పూర్తి చేసి అటెండర్ నుండి ఐఎఎస్ ఆఫీసర్‌లు వివిధయూనివర్సిటీల నుండి వివిధ అంశాలపై పరిశోధనచేసి, డాక్టరేట్, పీహెచ్‌డి పట్టా పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఇంక్రిమెంట్ ప్రోత్సాహకంగా ఇవ్వాలి. వీరికి గెజిటెడ్ హోదాకల్పించాలి.కనీసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులైన ఉద్యోగులను డాక్టరేట్ పట్టాపొందిన వారిని గుర్తించి స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి.

- రాపాక రవీందం, జనగాం

### అభివృద్ధికే ఆటంకం

ఏ.ఐ, క్వాంటమ్, కంప్యూటింగ్ వంటి వాటిలో ప్రపంచ దేశాలమధ్య పోటీ అధికమైంది.పరిశీలనలప్రకారం ఆయా సాంకేతికల్లో తగినంత మంది నిష్ణాతులు అమెరికాలో లేరు. తదనుగుణంగా దేశవిదేశాల్లోని ప్రతిభావంతులకు ఎర్రతివాచీ పరవడం ద్వారానే శాస్త్రసాంకేతిక రంగాల్లో ఎంతో పురోగతిని సాధించగలిగింది.హెచ్.వన్.బి.వీసాతో అమెరికాకు వెళ్లినవారిలో ఎంతోమంది సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధిఅవకాశాలు కల్పిస్తున్నారు. ఇవేవీ పట్టించుకోని ట్రంప్ దురహంకారం చివరకు అమెరికా అభివృద్ధికే ఆటంకమోతుంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### ఇదీ మన గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని రాజకీయాలుబహురసవత్తరంగా సాగుతున్నాయి.వై.ఎస్.ఆర్.సి.పి. అనే ప్రభుత్వవ్యతిరేక పార్టీ రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే ప్రతీ చర్యను తీవ్రంగా తమ మీడియా ద్వారా,నాయకులద్వారా, టి.వి.వారు నిర్వహించేడిబేట్ల ద్వారా ఖండిస్తున్నారు. అది వారి రాజకీయ ఎత్తుగడలో భాగమే అనుకుందాం.ఈనిందితులు చిరునవ్వులు చిందించిహుందాగా, నిండుగా వస్త్రాలంకరణ చేసుకుని వారి వెంట వంది మాగధులతో ఖరీదయిన కార్లలో, పోలీసు వారి సంరక్షణతో, ఏమాత్రం భయం లేకుండా విచారణలకు హాజరవుతున్నారు. అటువంటి వారికి కోర్టువారు క్షణాల్లో బెయిల్ మంజూరు చేస్తారు. ఇదే సామాన్యులైతే రెక్కలు విరచి మరీ విచారణ జరిగే ప్రదేశానికి తీసుకెడతారు. చట్టాలు మారినా వీటి చుట్టరికాలు రాజకీయ నాయకులకు మరింత చేరువవుతున్నాయి. ఇదీ మన గణతంత్ర ప్రజాస్వామ్య వ్యవస్థ.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అంధకారంలో అమెరికా

వీసా నిర్ణయం అమెరికాను అంధకారంలో పడేస్తుంది. ఎందుకని ట్రంప్ నిర్ణయాలు అమెరికా తాత్కాలిక ప్రయోజనాలు మాత్రమే చేస్తాయి. కానీ భవిష్యత్ అంధకారం అవుతుంది. బిగ్ 7కంపెనీలు ఇండియా వంటి దేశాల వైపు తరలిపోతాయి. వేరే దేశాలలో ఉండే యువ ఉద్యోగుల మీద వీసా పొడిగింపు కోసం కంపెనీలు లక్ష డాలర్ల ఖర్చు చేయలేవు. ఇకపోతే స్వదేశీ ఉద్యోగం నినాదంతో అధికారం చేపట్టిన ట్రాంప్ భారత్ వంటి వర్ధమాన దేశాలకు హైదరాబాద్ వంటి ఐటి హబ్‌లకు సువర్ణ అవకాశం కల్పిస్తున్నారు. తద్వారా మెక్ అమెరికా గ్రేట్ అనే నినాదం మాసిపోతుంది. అమెరికా అంధకారంలో పడుతుంది.

- భారత అవినాష్, జనగామ

### అడ్డుకట్ట వేయాలి

వన్య ప్రాణులు జనావాస ప్రదేశాలలోకి రాకుండా ప్రభుత్వం అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పులులు, సింహాలు, ఏనుగులు, తోడేళ్ళు, ఎలుగుబంట్లు ఈ మధ్య కాలంలో జనావాస ప్రాంతాల్లోకి వచ్చి దాడులు చేస్తున్నాయి. అడవిలో వాటికి ఆహారం దొరకకపోవడమే కారణం కావచ్చు. కావున వన్య ప్రాణులు సమస్య గుర్తించి అవి జనావాసంలోకి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోని వెంటనే అమలు జరిగేటట్లు చూడాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అవినీతి పాలకులకు ఇక చెల్లుచీటీ!

**రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలను రాజ్యాంగబద్ధంగా పనిచేసే విధంగా ప్రోత్సహించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు,సంస్థలు అవినీతి బంధుప్రీతి రహితంగా విధులు నిర్వహించాలి. లేకపోతే భవిష్యత్తులో తగినమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని గ్రహించాలి. ప్రజలందరికీ కనీసం కూడు, గూడు,గుడ్డ అందించేపని పాలకులు చేపట్టాలి. విద్యా,వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషిచేయాలి.బడ్జెట్లో అధిక నిధులు సమకూర్చాలి. అధిక ధరలు, ప్రైవేటీకరణకు ముకుతాడు వేయాలి. సంక్షేమ పథకాలు, ఉచిత పథకాలతో సుస్థిర అభివృద్ధి అసాధ్యం అనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. వికసిత భారత్‌గా మనదేశం భవిష్యత్తులో మారాలంటే ముఖ్యంగా పాలకులు పారదర్శకంగా పరిపాలన అందించడంతో సాధ్యం.**

ఐ.ప్రసాదరావు

ఇటీవల కాలంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన పరిణామాలు యావత్ ప్రపంచాన్ని హడల్ ఎత్తించాయి. ఈ సంఘటనలతో దాదాపు అన్ని దేశాధినేతలు, పాలకులు, ప్రభుత్వాలు చాలా గుణపాఠాలు నేర్చుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశాల్లో ప్రజలు చాలా ఓపిక, సహనం కలిగి ఉంటారు. ఓటు ద్వారా, సోషల్ మీడియా ద్వారా, పత్రికలు ద్వారా, భావ ప్రకటన ద్వారా తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతూ ఉంటారు.ఇవేమీ పట్టించుకోకుండా, అధికారం మన చేతిలో ఉంది అని మూర్ఖంగా ముందుకు పోయే ప్రభుత్వాలకు ప్రజలు ముఖ్యంగా యువత ఏ రకంగా బుద్ధి చెబుతుందో గతంలో శ్రీలంకలో జరిగిన పరిణామాలు, తాజాగా నేపాల్‌లో జరిగిన పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి.తస్మాత్ జాగ్రత్త పాలకులారా అని హెచ్చరికలు యువత ప్రత్యక్ష చర్యలు ద్వారా తెలియజేయడం జరిగింది. ఇక ప్రపంచవ్యాప్తంగా పాలకులు తమ పాలనా పద్ధతులను, విధానాలు మార్చుకోవాలి. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల్లో ప్రజలు, యువత ఇంత బాహాటంగా పాలక వర్గంపై హింసాత్మక ఘటనలతో రెచ్చిపోవడానికి ప్రధాన కారణాలు 'పాలకుల అవినీతి, బంధుప్రీతి' అని గ్రహించాలి.ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలు, అధికారంలోకి వచ్చిన తర్వాత భారీ ఎత్తున అవినీతి/బంధుప్రీతికి పెద్ద పీటవేసి, ప్రజల అవసరతలు పక్కన పెట్టడంతో చివరికి విసుగు చెందిన ప్రజలు యువత ప్రత్యక్ష చర్యలకు పాల్పడి,పాలకులను పారద్రోలుతున్నారు. నిజానికి రాజకీయాల్లో వచ్చిన ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత స్వార్థం వదులుకుని, ప్రజలకు సేవ చేయాలి. ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలి.ప్రజల అవసరతలు తీర్చాలి. వారి అభిప్రాయాలను గౌరవించి తదనుగుణంగా పాలన అందించాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి.ప్రజాదర్బార్ తరచూ నిర్వహిస్తూ ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి. కానీ నేటి పాలకులు ఎన్నికయ్యే వరకూ ప్రజలే దేవుళ్లు అంటూ పొగిడి, ఓట్లు, సీట్లు దండుకుని తదుపరి ప్రజలకు దూరం జరగడంతో ప్రజా వ్యతిరేకత మూటకట్టుకుంటున్నారు.అవినీతి, బంధుప్రీతి భారీ స్థాయిలోచేయడం, అధికారం అడ్డుపెట్టుకుని అడ్డదారుల్లో నడవడంతో చివరికి దేశం విడిచి పారిపోయే పరిస్థితి, ప్రాణ సంకటంతో బ్రతికే పరిస్థితి తెచ్చుకోవడం జరుగుతుంది.ఇకనైనా పాలకుల స్వభావం మారాలి. ప్రజలకు పారదర్శకంగా పరిపాలన అందించాలి. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ప్రపంచ సర్వే సంస్థలు వెలువరించిన నివేదికల ప్రకారం ముఖ్యంగా అవినీతిలో శ్రీలంక 121వ స్థానంలో, బంగ్లాదేశ్ 151వ స్థానంలో, నేపాల్ 107వస్థానంలో, ఇక భారతదేశం 96వ స్థానంలో ఉంది. అనగా ఈ దేశాల్లో అవినీతి బంధుప్రీతి ఎంతగా విస్తరించి ఉందో తేటతెల్లం అవుతుంది. పాలకులు నిజ జీవితంలో ముఖ్యంగా అధికారం చేపట్టిన తరువాత విచ్చలవిడిగా అవినీతి బంధుప్రీతితో వేల కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని లూటీ చేయడంతో, మోసపోయిన ప్రజలు పోరుబాటపడుతున్నారు.తిరుగుబాటు బావుటా ఎగుర వేస్తున్నారు. ఇక అన్ని దేశాల పాలకులు



కళ్లు తెరవాలి. తమ పాలనను సమీక్షించుకోవాలి. పారదర్శకంగా పరిపాలన అందించాలి. ప్రజల మన్ననలు పొందాలి. మన దేశంలో కూడా ఇటీవల కాలంలో రాజకీయ అవినీతి, బంధుప్రీతి పెచ్చుమీరుతున్నది. ప్రశ్నించే గొంతులను అణగదొక్కాలని చూడటం జరుగుతుంది.ఇది ఏమాత్రం శ్రేయోష్కరం కాదు.ప్రజాస్వామ్యంలో భావప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోరాదు. ప్రజల అవసరతలు పాలకులు తీర్చాలి. ఎన్నికల్లో అడ్డమైన వాగ్దానాలు ఇచ్చి, గద్దె ఎక్కిన తరువాత గళ్ళాపెట్టేలో డబ్బులు లేవు అని మోసం చేయరాదు.గత ప్రభుత్వాలు ఎంత మేరకు నిధులు నిల్వలు ఉంచారోతెలిసే కదా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ప్రజలకు, యువతకు అనేక వాగ్దానాలు ఇచ్చి, ఓట్లు సీట్లు దండుకుని,తీరా అధికారం చేపట్టిన తరువాత డబ్బులు లేవు అని వాగ్దానాలు నెరవేర్చకపోతే, ప్రజలకు, యువతకు ఆగ్రహం రాక ఏమోతుంది? తస్మాత్ జాగ్రత్త పాలకులారా, ప్రజా ప్రతినిధులారా ఎల్లకాలం ప్రజలు, యువత అమాయకులు కాదు అని ఇకనైనా గ్రహించాలి. ముఖ్యంగా అవినీతి బంధుప్రీతివదులుకోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజాధనాన్ని వేతనాలుగా తీసుకుంటూ, కనీసం శాసనసభ సమావేశాలకు, శాసనమండలి సమావేశాలకు, పార్లమెంటు సమావేశాలకు రాకుండా వేతనాలు తీసుకోవడం మంచిది కాదు. భవిష్యత్తులో జవాబు చెప్పవలసిన పరిస్థితి ఉంటుంది.అధికారం రాలేదు అని, గెలిచిన తరువాత సమావేశాలకు రాకుండా ఉంటే ఎలా? మీ నియోజకవర్గం ప్రజల అవసరతలు ఎలా తీరుస్తారు? మీ ప్రాంతాల ప్రజల సమస్యలు ఎలా పరిష్కరించబడతాయి. ఇకనైనా ఆలోచన చేయాలి.ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు, ప్రజల మనిషిగా ఉండాలి.సొంత వ్యాపారాలు పెంచుకోవడం, సొంత సంపద పెంచుకోవడం కోసం రాజకీయ అవతారాలు ఎత్తడం సరికాదు. ఏదో ఒక సమయంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని మన ఇరుగు పొరుగు దేశాల పరిస్థితులు బట్టి తెలుస్తోంది. ప్రజాప్రతినిధులు జవాబుదారీతనంగా ఉండాలి.'మాఎమ్మెల్యే కనుపడుట లేదు, మా ఎం.పి కనుపడుట లేదు, మాప్రజా ప్రతినిధి కనుపడుట లేదు అనే బోర్డులు దర్శనం కారాదు. మనదేశంలో కూడా ముఖ్యంగా రాజకీయ వ్యవస్థ, ప్రతినిధులు అవినీతి బంధుప్రీతితో తారాస్థాయికి చేరుకుంటుంది. ఇకనైనా చిత్తశుద్ధితో పనిచేయాలి. పారదర్శక పాలన అందించాలి. మన భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలి. రాజ్యాంగ నిర్మాతలు,స్వాతంత్ర్య సమర యోధులు ఆశయాలు లక్ష్యాలు నెరవేర్చండి. దేశంలో ఉన్న అవినీతిపై ఉక్కుపాదం మోపాలి. నిరక్షరాస్యత, అనారోగ్యం పేదరికం కూకటివేళ్లతో పెకలించాలి. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటు చేసిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలను రాజ్యాంగ బద్ధంగా పనిచేసే విధంగా ప్రోత్సహించాలి. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, సంస్థలు అవినీతి బంధుప్రీతి రహితంగా విధులు నిర్వహించాలి. లేకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది అని గ్రహించాలి.ప్రజలందరికీ కనీసం కూడు, గూడు, గుడ్డ అందించే పని పాలకులు చేపట్టాలి. విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలి.బడ్జెట్లో అధిక నిధులు సమకూర్చాలి.అధిక ధరలు, ప్రైవేటీకరణకు ముకుతాడు వేయాలి. సంక్షేమ పథకాలు, ఉచిత పథకాలతో సుస్థిర అభివృద్ధి అసాధ్యం అనే వాస్తవాన్ని పాలకులు గ్రహించాలి. వికసిత భారత్‌గా మనదేశం భవిష్యత్తులో మారాలి అంటే ముఖ్యంగా పాలకులు పారదర్శకంగా పరిపాలన అందించడంతో మాత్రమే సాధ్యం. ప్రజలకు ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా తలసరి ఆదాయం పెరుగుతుంది. జీవన ప్రమాణాలు కలిగి ఫిన్లాండ్, స్వీడన్, నార్వే వంటి దేశాలు సరసన మన భారత్ చేరుతుంది. అవినీతి బంధుప్రీతి రహిత దేశంగా, అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన దేశంగా మన పాలకులు మన దేశాన్ని తీర్చిదిద్దుతారు అని ఆశిద్దాం.ఇటీవల మన ఇరుగు పొరుగు దేశాల్లో జరుగుతున్న పరిణామాలు, అన్ని దేశాలకు కనువిప్పు కావాలి. ●

# మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు పెద్దపీట వేయలేమా!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత ఆశయ సాధనలు, పిల్లల పెంపకం, కెరీర్ బాధ్యతలతో సతమతం అవుతున్న మహిళలకు తమ వ్యక్తిగత ఆరోగ్యం, ఫిట్‌నెస్, శ్రేయస్సు పట్ల ఆలోచించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. మహిళల ఆరోగ్యం, శ్రేయస్సుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా సెప్టెంబర్ చివరి బుధవారం రోజున, అనగా 24 సెప్టెంబర్ 2025 రోజున జాతీయ మహిళా ఆరోగ్యం ఫిట్‌నెస్ దినోత్సవం (నేషనల్ వూమెన్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. మహిళా ఆరోగ్యం చాలా సంక్లిష్టతతో కూడి పలు సవాళ్ల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మహిళలకు కౌమార దశ నుంచి వృద్ధాప్యం వరకు మోనోపాజ్, గర్భం దాల్చడం, పిల్లల్ని కనడం, రుతు స్రావ సమస్యలు, పిసిఎస్ సమస్యలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. దీనికి తోడుగా ప్రతి చిన్న సమస్యను బూతద్దంలో చూస్తూ అనవసర ఆందోళన, నిరాశ, ఒత్తిడులు, పని ఆధార ఒత్తిడులు, సామాజిక కట్టుబాట్లకు లోనవుతూనే ఉంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మహిళలకు అనారోగ్యం, శారీరక సమస్యలు, మానసిక ఉద్రేకాలు, భావోద్వేగ సమస్యలను అదుపులో ఉంచుకోవడానికి తగు సమాధానాలను ప్రచారం చేయడం నిరంతరం కొనసాగించాలి. కుటుంబ బాధ్యతలు, పని ప్రదేశాలు, ఒత్తిడులు, పిల్లల పెంపకం బాధ్యతలు, వ్యక్తిగత సమస్యల పట్ల సమతుల్యత సాధించడానికి తమ ఆరోగ్యాలను సహితం పణంగా పెట్టడం జరుగుతోంది. మహిళల ఆరోగ్యం ఫిట్‌నెస్ సాధించుట వల్ల జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండడం, మానసిక శ్రేయస్సు పెరగడం, శారీరక శక్తిజననం,సరైన సమయంలో నిద్రపోవడం, ఏకాగ్రత పెరగడం, దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు కలగడం, శారీరక వ్యాయామాలకు సమయం కేటాయించడం లాంటి ఉపయోగాలు కలుగుతాయి. మహిళలకు అందుబాటులో ఉన్న సమయాన్ని తగు రీతిలో ప్రాధాన్యతా క్రమంలో గడపడం, దినచర్యలో శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వడం, టెక్నాలజీ వాడుతూ తేలికగా పని చేయడం, సుసాధ్యం అయ్యే లక్ష్యాలను నిర్ణయించుకోవడం, అవసరం అయినప్పుడు పనిని ఇతరులకు కేటాయించడం, విశ్రాంతికి తగు సమయం కేటాయించడం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వడం లాంటివి విధిగా జరగాలి. మహిళలు తమ పని ఒత్తిడిలో తగు పోషకాహారాన్ని తీసుకోవడంలో విఫలం అవుతూ ఉంటారు. అందరూ తిన్న తర్వాత మిగిలిన దానిని తిని తమ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటారు. సమతుల పోషకాహారం తీసుకోవడం, పోషకాహారంలోపాలను గమనించి ఆహార అలవాట్లు మార్చుకోవడం,ప్రతిరోజు తగు నీటిని తాగడం, బరువును అదుపులో ఉంచుకోవడం, పోషకాహారాన్ని మాత్రమే తయారు చేయడం,ప్రాసెస్డ్ ఫుడ్ వాడకాన్ని తగ్గించడం, శరీర స్వభావాన్ని బట్టి ఆహారం ఎంపిక చేసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ మహిళలుతమ ఆరోగ్యాలను కాపాడుకోవాలి. మానసిక వికాసానికి అవసరమైన వ్యాయామాలు, ఒత్తిడి నియంత్రణ,మానసిక స్పష్టత, నిద్రలేమీ సమస్యను దూరం చేయడం, ఆశావహ సామాజిక సంబంధాలను నెలకొల్పడం, నిలకడను పెంచుకోవడం,వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం, ఆత్మగౌరవాన్ని కాపాడుతుంటే ముందుకు సాగడం లాంటివి కొనసాగించాలి. మహిళలు తమ జీవనశైలిని తగురీతిలో మార్చుకుంటూ, పోషకాహారం తీసుకుంటూ, కుటుంబ శ్రేయస్సుతోపాటు తమ ఆరోగ్యం పరిరక్షించుతుంటూ, ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలి. ●

# 'వక్ఫ్'లో కొన్ని సవరణలపై స్టే చాలునా?

జాన్ బర్నబాస్ చిమ్మె

కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన వక్ఫ్‌సవరణ చట్టం 2025పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం కొన్ని సవరణలు రాజ్యాంగ వ్యతిరేకమైనవని భావిస్తూ వాటి అమలును నిలిపివేస్తూ స్టే విధించింది. కనీసం ఐదు సంవత్సరాలు ఇస్లాం మతాన్ని అనుసరిస్తున్నవారు మాత్రమే వక్ఫ్‌ను రూపొందించగలరనే నిబంధన కూడా స్టే విధించిన జాబితాలో ఉంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ అగస్టీన్‌జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనంమధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. మతపరమైన ఆస్తులపరిరక్షణ పేరుతో చేసిన ఈ సవరణలు ఇప్పుడు రాజ్యాంగ బద్ధతపైనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పిటిషన్లు వక్ఫ్‌చట్టం 2025ను రద్దుపరచాలని కోరుతూ దాఖలు అయ్యాయి. పిటిషనర్లు వాస్తవానికి మొత్తం చట్టాన్నే కొట్టివేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కేవలం రాజ్యాంగ బద్ధతను పాటించని సెక్షన్లను మాత్రం నిలిపివేయాలని ఆదేశించింది. చట్టం రాజ్యాంగ బద్దతకు ఊహ ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటుందని, అరుదైన సందర్భాలలో మాత్రమే జోక్యం చేసుకోవచ్చని మేము భావిస్తున్నాము అని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల స్థితిని నిర్ణయించడానికి కలెక్టర్‌కు ఇచ్చిన అధికారాలపై కూడా సుప్రీంకోర్టు స్టే విధించింది. వక్ఫ్‌బోర్డులో ముస్లింయేతరుల భాగస్వామ్యం అనే వివాదాస్పద అంశంపై తీర్పునిస్తూ సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ఉండే 20 మందిలో నలుగురు కంటే ఎక్కువ మంది ముస్లింయేతర సభ్యులు ఉండకూడదని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో 11 మందిలో ముగ్గురు కంటే ఎక్కువ ముస్లింయేతర సభ్యులు ఉండకూడదని ఆదేశించింది. కొత్త చట్టంలోనిప్రతి విభాగానికి 'ప్రాథమిక అడ్డంకి' (సవాలు)గా ధర్మాసనం పరిగణించింది. చట్టంలోని మొత్తం నిబంధనలను నిలిపివేయడానికి ఎటువంటి కేసును రూపొందించలేదని ధర్మాసనం పేర్కొంది.అయితే ఇందులోని కొన్ని విభాగాలకు కొత్త రక్షణ అవసరమని సుప్రీంకోర్టు ధర్మాసనం భావించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ప్రాథమికంగానూ, తాత్కాలికంగానూ ఉన్నాయనీ తుది విచారణలో చట్టం రాజ్యాంగ చెల్లుబాటుపై పిటిషనర్లు లేదా కేంద్రప్రభుత్వం పూర్తి వాదనలు ముందుకు తీసుకెళ్లకుండా అవి నిరోధించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నాడా లేదా అని పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమాలను రూపొందించేవరకూ వక్ఫ్(సెక్షన్ 3(ఆర్) ఆస్తిని అంకితం చేయడానికి ముందు గత ఐదు సంవత్సరాలుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్న వ్యక్తి అయి ఉండాలి అనే నిబంధన ఏకపక్ష అధికార వినియోగానికి దారి తీస్తుంది అని సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల స్థితిని నిర్ధారించడానికి నియమించబడిన ప్రభుత్వ అధికారులకు ఉన్న అధికారాలకు సంబంధించి ఉన్న సెక్షన్ 3(సి)కి సంబంధించి అత్యంత ముఖ్యమైన విషయంపై సుప్రీంకోర్టు ప్రస్తావించింది. ప్రభుత్వ అధికారి నివేదిక ప్రకారం ఒక భూమి ఆక్రమణ కాదని నిర్ధారించే వరకూ ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించరాదని చట్టంలోని సెక్షన్ 3సి(2) నిబంధనపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఒక ఆస్తిని ప్రభుత్వ భూమిగా ప్రకటించ





డానికి, రెవెన్యూ రికార్డులను మార్చడానికి అధికారికి ఇచ్చిన అధికారానికి సంబంధించిన సెక్షన్ 3సి(3)పైన కూడా స్టే విధించింది. అధికారి కనుగొన్న దాని ఆధారంగా దాని రికార్డులను సరిచేయమని రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డును ఆదేశించాల్సిన సెక్షన్ 3సి(4)ను కూడా సుప్రీంకోర్టు నిలిపివేసింది. కలెక్టర్ హక్కులను నిర్ణయించడానికి అనుమతించడం, అధికారాల విభజనకు విరుద్ధం. కార్య నిర్వాహణాధికారి పౌరుల హక్కులను నిర్ణయించడానికి అనుమతించబడదు అంటూ సుప్రీంకోర్టు పేర్కొంది.వక్ఫ్ ట్రిబ్యునల్‌నసెక్షన్ 83 ప్రకారం ఆస్తిపై హక్కును, కోర్టుల్లో చివరి తీర్పు వచ్చే వరకూ లేదా హైకోర్టులో అప్పీల్‌కు లోబడి ఉండేవరకూ వక్ఫ్ స్వాధీనం లేదా దాని రికార్డులు ఏవీ ఇబ్బంది కలిగించవని ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలో అటువంటి ఆస్తుల విషయంలో మూడవ పక్ష హక్కులను సృష్టించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. వక్ఫ్ బోర్డులలో ముస్లింయేతర భాగస్వామ్యంపై నిబంధనలను నిలిపివేయడానికి ధర్మాసనం నిరాకరించింది. కానీ పరిమితులను విధించింది. ముస్లిం దాని వ్యక్తులకు వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఒ)గా అవకాశం ఇవ్వొచ్చుంటూ చట్టంలో చేసిన సవరణపై 'స్టే' విధించలేమని ధర్మాసనం పేర్కొంది. సాధ్యమైనంత వరకూ ముస్లింలకే ఆ పదవిని కేటాయించాలని ప్రభుత్వానికి సూచించింది. చీఫ్‌ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ల నియామకానికి సంబంధించిన సెక్షన్ 23పై ధర్మాసనం ఈ విధంగా వ్యాఖ్యానించింది. 'సాధ్యమైనంతవరకు బోర్డుకు చెందిన ఎక్స్ అఫీసియో కార్యదర్శి అయిన సిఇఒను ముస్లిం సమాజం నుంచి నియమించడానికి ప్రయత్నించాలి అని పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల నమోదును తప్పనిసరి చేసే నిబంధనలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇది ప్రస్తుత కొత్త అవసరం కాదనీ, 1995, 2013 నాటి మునుపటి చట్టాల ప్రకారం ఉందని పేర్కొంది. ఈ చట్టం ప్రకారం వక్ఫ్ అంటే మసీదులు, పాఠశాలలు, ఆస్పత్రులు లేదా ఇతర ప్రభుత్వ సంస్థలను నిర్మించడం వంటి ధార్మిక లేదా మతపరమైన ప్రయోజనాల కోసం ముస్లింలు చేసిన దానం అని అర్థం. ఎక్స్ అఫీసియో సభ్యులు మినహా ముస్లింలు మాత్రమే పనిచేయాలని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. ఈ తీర్పు ద్వారా రాజ్యాంగ వ్యవస్థలు ఏవైనా సరే అవి రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా నడుచుకోకపోతే సహించేది లేదని సుప్రీంకోర్టు విస్పష్టంగా తెలియచెప్పింది. జిల్లా కలెక్టర్లు సర్వాధికారులు కారనీ, వారు ఏది నిర్ణయిస్తే అది అంతిమం అవుతుందనే విషయాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. కార్యనిర్వాహకవర్గం కూడా రాజ్యాంగ బద్ధమైంది కాబట్టి రాజ్యాంగ నియమాలన్నీ వర్తిస్తాయని సుప్రీంకోర్టు ఈతీర్పు ద్వారా స్పష్టపరిచింది. ఒక ఆస్తి భూమి కానీ మరేదైనా కావచ్చు. వక్ఫ్ ఆస్తి అని ముస్లింల వాదన ఒకవైపు, అది ప్రభుత్వ స్థలమనీ మరొకవైపు ఉన్నప్పుడు కలెక్టర్లకు నిర్ణయాధికారం ఇవ్వడానికి వీలులేదని సుప్రీంకోర్టు స్పష్టపరిచింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో ఇద్దరు మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరి అవుతుంది. ఆ మహిళలు కూడా ముస్లింలు అయి ఉండాలి. వక్ఫ్ బిల్లును పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ కూడా ఏర్పాటయింది. వక్ఫ్ చట్టంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఉన్నందువలన వాటిపైన మాత్రమే సుప్రీంకోర్టు 'స్టే'విధించి, ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం చట్టాన్ని కొట్టివేయాలని పిటిషనర్లు కోరినా సుప్రీంకోర్టు నిరాకరించడం గమనార్హం. మత వ్యవహారాలలో ప్రభుత్వాలు ఇష్టానుసారం వ్యవహరించడానికి వీలు లేదని మాత్రం స్పష్టపరిచింది. అధికార విభజనల బదలాయింపు సూత్రాన్ని యధేచ్ఛగా ఉల్లంఘించడం కూడా కుదరదని తేల్చి చెప్పింది. ఈ తీర్పు కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిది. ●

# ఆయుష్మాన్ భారత్.. ఆరోగ్య విప్లవం

## ప్రజలకు రూ.5 లక్షల దాకా ఉచిత ఆరోగ్య బీమా అందిస్తున్నాం: ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** పేద, ధనిక తేడా లేకుండా ప్రజలందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం ఓ విప్లవమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఆ పథకం ప్రజారోగ్య రంగంలో విప్లవాన్ని సృష్టించిందని, లబ్ధిదారులకు ఆర్థిక రక్షణ, గౌరవాన్ని నిర్ధరిస్తుందని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ అమల్లోకి వచ్చి నేటితో ఏడు సంవత్సరాలు పూర్తి కాగా, మోడీ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. నేటితో మనం ఆయుష్మాన్ భారత్ పథకం మొదలుపెట్టి 7 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాం. ఇది భవిష్యత్తు అవసరాలను ముందుగానే ఊహించి, ప్రజలకు అత్యున్నత నాణ్యతతో పాటు సరసమైన ఆరోగ్య సంరక్షణను నిర్ధరించడంపై దృష్టి సారించి తీసుకున్న ఒక కార్యాచరణ అని ప్రజారోగ్య రంగంలో ఒక విప్లవాన్ని చూస్తోంది. ఆయుష్మాన్ భారత్ ఆర్థిక రక్షణ, గౌరవాన్ని నిర్ధరించింది" అని మోడీ తెలిపారు. సాంకేతికత, మానవ సాధికారతను భారత్‌ఎలా మరింత ముందుకు తీసుకువెళుతుందో ఆ పథకం ప్రపంచానికి చూపించింది" అని మోడీ అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం 55 కోట్లకు పైగా పౌరులకు వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య హామీ పథకంగా ప్రశంసించింది. ఇప్పటివరకు 42 కోట్లకు పైగా ఆయుష్మాన్ కార్డులు జారీ అయ్యాయని చెప్పింది. లక్షలాది కుటుంబాలను రక్షించిన ఆయుష్మాన్ భారత్ ఆయుష్మాన్ భారత్ పథకం వల్ల ప్రభుత్వ ఆరోగ్య వ్యయం 29 శాతం నుంచి 48 శాతానికి పెరిగిందని, ప్రజల ఖర్చు 63 శాతం నుంచి 39 శాతానికి తగ్గిందని చెప్పింది. అనారోగ్యం సమయంలో లక్షలాది కుటుంబాలను రక్షించిందని వెల్లడించింది. అనారోగ్యం వచ్చినప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదనే ధ్యేయంతో మొదలుపెట్టామని తెలిపింది. ఏటా ఆరు కోట్లకు పైగా కుటుంబాలను రక్షించిందని పేర్కొంది. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని 2018 సెప్టెంబర్‌లో కేంద్రం లాంఛనంగా ప్రారంభించింది. ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు ఏటా రూ.5 లక్షల వరకు లబ్ధి పొందుతారు. అన్ని సామాజిక, ఆర్థిక వర్గాలకు చెందిన వృద్ధులకు వైద్యబీమా లభిస్తుంది. దీనికింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు.

ఇప్పటికే ఆయుష్మాన్‌భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. సిజిహెచ్‌ఎస్, ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పథ కాల కింద ఉన్న వయోవృద్ధులు వాటినిగానీ, ఎబిపి ఎంజెఎవైనిగానీ ఎంచుకోవచ్చు. ప్రైవేటు వైద్య ఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందొచ్చు. ఈ పథకం కింద దేశంలోని పేద కుటుంబాల్లోని ప్రతి సభ్యునికి ఆయుష్మాన్ కార్డు అందిస్తారు. ఈ కార్డుతో ఆసుపత్రిలో చేరినప్పుడు రూ. 5లక్షల వరకు వైద్యసేవలు ఉచితం.



### కోర్టులు బకాయిలు వసూలుచేసే

# రికవరీ ఏజెంట్లు కాదు

## సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** న్యాయస్థానాలు బకాయిలు వసూలుచేసే రికవరీ ఏజెంట్లు కాదని సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మార్చే ఈ ధోరణి మంచిది కాదని అసహనం వ్యక్తంచేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కేసును విచారిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది. డబ్బు రికవరీ అనేది సివిల్ వివాదమని, సివిల్ వివాదంలో అరెస్టును ఒక సాధానంగా ఉపయోగించరాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం పేర్కొంది. డబ్బు తీసు కున్న వ్యక్తి ఆ డబ్బు రికవరీకి వెళ్లిన వ్యక్తిని కిడ్నాప్ చేశాడని యూపికి చెందిన ఓ కేసులో పోలీసులు అభియోగాలు మోపడంపై కోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. క్రిమినల్ చట్టాలను దుర్వినియోగం చేస్తోన్న సంప్రదాయాన్ని ఈకేసు ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించింది. న్యాయం చేసే విధానానికి ఈ కేసు తీవ్ర ముప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. బకాయిల మొత్తాన్ని వసూలు చేయడానికి కోర్టులేమీ రికవరీ ఏజెంట్లు కావని, న్యాయవ్యవస్థ దుర్వినియోగాన్ని అనుమ తించబోమని కోర్టు స్పష్టంచేసింది. ఎవరినైనా అరెస్టు చేసే ముందు తమ వద్దకు వచ్చిన ఆ కేసు క్రిమినలా సివిలా అని పోలీసులు సరిగా పరిశీలిన చేయాలని సూచించింది.

ఇలాంటి కేసులు పోలీసులను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టివేస్తా యని పేర్కొంది. సివిల్ వివాదాల్లో వేధింపుల సాధనంగా క్రిమినల్ చట్టాలను ఉపయోగించకుండా నిరోధించేందుకు తెలివిగా వ్యవహరిం చాలని యూపి ప్రభుత్వ తరఫు న్యాయవాదికి సుప్రీంకోర్టు సూచించింది. పోలీసులు తమవద్దకు వచ్చిన కొన్ని క్లిష్టమైన కేసులు సివిలో క్రిమినలో తెలుసుకునేందుకు పదవీ విరమణ పొందిన న్యాయమూర్తులను జిల్లాలకు ఒకరు చొప్పున నోడల్ అధికారులు నియమించవచ్చని సలహా ఇచ్చింది.



# మహిళా పోలీసుల ఎన్‌కౌంటర్

## దోపిడీ దొంగ అరెస్టు

### బైక్, ఫోన్, ట్యాబ్ స్వాధీనం

**ఘజియాబాద్, సెప్టెంబర్ 23:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఆదివారం రాత్రి అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఓ పోలీస్ చెక్ పోస్ట్ వద్ద అనుమానితుడు బైక్‌పై వెళ్తుండగా, అడ్డుకున్న పోలీసులపై కాల్పులకు పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడి కాలికి తూటా తగిలి కింద పడిపోయాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు 22ఏళ్ల జితేంద్రపై స్నాచింగ్, దోపిడీ, దొంగతనం తదితర కేసులు ఉన్నాయి. పోలీసుల విచారణలో నిందితుడు ఢిల్లీ-ఎన్సీ ఆర్ ప్రాంతంలో బైక్‌లు, స్కూటర్లు దొంగలిస్తున్నాడు. ఫోన్లు, ట్యాబ్స్ తదితర ఖరీదైన ఎలక్ట్రానిక్ పరికరాలను దొంగలించి సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి బైక్‌తోపాటు ఓఫోన్, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇవన్నీ కూడా దొంగలించినవేనని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసులంతా మహిళలే కావడం విశేషం. ఘజియాబాద్‌లో తొలిసారి మహిళా పోలీసులు ఎన్‌కౌంటర్‌లో పాల్గొనడం ఉత్తంప్రదేశ్ చరిత్రలో మొదటిసారి అని సీనియర్ పోలీస్ అధికారి ఉపాసన పాండే తెలిపారు.

# ఆధార్ నమోదులో కొత్త మార్పులు

## ఇక అన్నీ ఆన్‌లైన్‌లోనే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** దేశవ్యాప్తంగా ఆధార్ వ్యవస్థను మరింత సులువుగా, సురక్షితంగా వినియోగించుకునేందుకు వీలుగా యుఐడిఎఐ మరి కొన్ని మార్పులను ప్రవేశపెట్టనుంది. ఆన్‌లైన్‌లో ఆధార్ వివరాలు మార్చుకునేలా ఇటీవలె కొత్త అప్‌డేట్‌ను తీసుకువచ్చారు. ఫలితంగా ఆధార్‌కు సంబంధించిన మొబైల్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్, చిరునామాను సులభంగా ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. దీంతో ఆధార్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఆ తర్వాత బయోమెట్రిక్ అథెంటికేషన్‌లో కూడా కీలక మార్పులు తీసుకువచ్చింది ఆధార్ సంస్థ. ఇప్పటి వరకు ఉన్న ఫింగర్ ప్రింట్, కంటి ఐరిస్ స్కాన్‌ను ఇప్పుడు మరింత ప్రతిభావవంతంగా పనిచేసేలా మార్పులు చేశారు. ఫలితంగా బ్యాకింగ్, ఇన్సూరెన్స్‌తో పాటు ఇతర సేవలు ఉపయోగించే సమయంలో సులభంగా, వేగంగా పనులు పూర్తిచేసుకోవచ్చు. ముఖ్యంగా ప్రజల గోప్యతను దృష్టిలో పెట్టుకుని మాస్క్‌డ్ ఆధార్‌ను వినియోగించేలా ప్రచారం చేస్తుంది. ఇందులో12అంకెల పూర్తిఆధార్‌నంబర్ కాకుండా చివరి నాలుగు నంబర్‌లు మాత్రమే కనిపిస్తాయి. దీనివల్ల యూజర్ల ప్రైవసీ భద్రంగా ఉంటుందని అంటున్నారు. బ్యాకింగ్ రంగంలో ముఖ్యమైన ఈ కెవైసి ప్రక్రియను మరింత సులభంగా మార్చారు. ఫలితంగా కొత్త బ్యాంక్ ఖాతా, మొబైల్ కనెక్షన్, లేదా ఏదైనా ఆన్‌లైన్ సేవలను సులభంగా పొందే అవకాశం కలుగుతుంది. పాన్, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ కార్డును లింక్‌చేసినప్పటి నుంచి ట్యాక్స్, ఆర్థిక సేవలకు సంబంధించిన మోసాలు తక్కువవయ్యాయి. ఆధార్‌ను మరింత సురక్షితంగా, ఆధునికంగా మార్చేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) అనేక మార్పులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే త్వరలోనే కొత్త మార్పులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది. ఇందులో ముందుగా బయోమెట్రిక్ వెరిఫికేషన్‌లో భాగంగా ఫేస్ అథెంటికేషన్ ఫీచర్‌ను తీసుకురానుంది.

# భరణంకోసం గొంతెమ్మ కోరికలు అనుచితం

## పట్టుబడితే ప్రతికూల తీర్పులు ఎదుర్కోవాలి: 'సుప్రీం' ధర్మాసనం హెచ్చరిక

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** పెళ్లైన 14 నెలల్లోనే విడాకులు కోసం దరఖాస్తు చేసిన ఓ వివాహిత తనకు భరణంగా రూ.5 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేయడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మొత్తం కోసం పట్టుబడితే చాలా కఠినమైన తీర్పు తప్పదని జస్టిస్ జేబీ పార్థివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఆ మహిళను హెచ్చరించింది. అమెజాన్‌లో ఇంజినీర్‌గా పనిచేస్తోన్న ఆమె భర్త విడాకుల సమయంలో భరణంగా రూ.35 లక్షలు ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. కానీ, ఆ మహిళ మాత్రం తనకు రూ.5 కోట్లు ఇస్తేనే విడాకుల పత్రంపై సంతకం పెడతానని పట్టుబట్టింది. అయితే, మహిళ తరపు న్యాయవాది విచారణలో ఆమెభర్తతరపు లాయర్ వాదనలను తోసిపుచ్చారు. మధ్యవర్తిత్వ కేంద్రంలో ఈ మొత్తాన్ని తగ్గించారని, తన క్లయింట్ ముందు డిమాండ్ చేసినా తర్వాత రాజీకి వచ్చారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా జస్టిస్ పార్థివాలా. భర్త తరపు న్యాయవాదిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆమెను వెనక్కిపిలిచి మీరు పెద్దతప్పు చేస్తున్నారు.. ఆమెను ఎవరూ ఆపలేరు ఆమె కలలు చాలా పెద్దవి" అని వ్యాఖ్యానించారు. భరణంగా రూ.5 కోట్లు కావాలనే డిమాండ్ అమోదయోగ్యం కాదని, అలాంటి వైఖరి ప్రతికూల తీర్పును ఆహ్వానించడమేనని న్యాయమూర్తి అన్నారు. తదుపరి సర్దుబాటు చర్చలకోసం దంపతులు ఇద్దరూ సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వ కేంద్రానికి రావాలని అల్టిమేటం జారీచేసింది. ఇదే సమయంలో రూ.5 కోట్ల భరణం డిమాండ్ చేస్తే ప్రతికూల తీర్పు ఎదుర్కొక తప్పదని హెచ్చరించింది. గతేడాది ఏప్రిల్‌లో వివాహం చేసుకున్న ఓ జంట విబేధాల కారణంగా విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించగా భరణవిషయంలో భార్య గొంతెమ్మ కోరికలు కోరడం గమనార్హం. గతంలోనూ ఓ మహిళ కూడా ఇలాగే తనకు విడాకుల సమయంలో రూ.18 కోట్లు, బీఎండబ్ల్యూ కారు ఇవ్వాలని కోరింది. 14 నెలల కిందటే వివాహం చేసుకుని, ఏడాది పాటే దాంపత్య జీవితం కొనసాగించిన ఈజంట విడిపోవాలని నిర్ణయించుకుంది ఏది ఏమైనా ఇదిదురదృష్టకరం.. కానీ, వివాహబంధం రద్దు కోసం భరణంగా భార్య రూ.5కోట్లు కావాలని డిమాండ్‌చేసినట్టు మాకు సమాచారం ఉంది, భార్య ఇలాంటి పట్టుదలతోనే ముందుకువెళ్తే ఆమెకు వ్యతిరేకంగా ఆదేశాలు ఇవ్వాల్సి రావచ్చు. కాబట్టి ఈ వివాదానికి ముగింపు పలికేలా ఆమోదయోగ్యమైన, సబబైన డిమాండ్లు భార్యపెట్టాలని మేము ఆశిస్తున్నాం'అని జస్టిస్ పార్థీవాలాఅన్నారు. ఇరువర్గాలు అక్టోబర్ 5న సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వ కేంద్రముందు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

### ప్రముఖ మలయాళ నటుల ఇళ్లల్లో

# కస్టమ్స్ అధికారుల సోదాలు

## స్మగ్లింగ్‌ద్వారా వచ్చిన హైఎండ్ కార్లు కొన్నట్లు వారిపై ఫిర్యాదులు



**కోచి, సెప్టెంబరు 23:** మలయాళ నటులు దుల్కర్ సల్మాన్, పృథ్వీరాజ్‌సుకుమారన్ నివాసాలపై కస్టమ్స్ అధికారులు దాడులుచేశారు. మంగళవారం ఉదయం కోచిలోని వారి నివాసాల్లో సోదాలు చేపట్టారు. లగ్జరీ కార్ల స్మగ్లింగ్ ఆరోపణలకు సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా అధికారులు 'ఆపరేషన్ నమకూర్' చేపట్టారు. ఇందులో భాగంగానే దుల్కర్, పృథ్వీరాజ్ నివాసాలతో పాటు కేరళలోని 5జిల్లాల్లో 30 చోట్ల సోదాలు జరుపుతున్నారు. ఒక ఆన్‌లైన్ మ్యాగజైన్ కథనం ప్రకారం లగ్జరీ కార్లను భూటాన్ నుంచి అక్రమంగా రప్పించుకున్నారని దుల్కర్, పృథ్వీరాజ్‌లపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు భూటాన్ ఆర్మీకి చెందిన హైఎండ్ వాహనాలను కొనుగోలు చేసి అక్రమంగా రీసేల్ చేసే గ్యాంగు నుంచి నటులు ఈ వాహనాలను కొనుగోలు చేసినట్లు అధికారులు ఆరోపిస్తున్నారు. భూటాన్‌లో నిర్వహించే వేలంలో ఖరీదైన వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, హిమాచల్‌ప్రదేశ్ మీదుగా భారత్‌లోకి తీసుకొచ్చి సెలబ్రెటీలకు అమ్మడమే ఈ ముఠా పని అని అధికారులు గుర్తించారు. అయితే పృథ్వీరాజ్ సుకుమారన్ నివాసంలో జరిపిన సోదాల్లో అధికారులకు ఎలాంటి ఆధారాలు లభించలేదని సమాచారం. కాగా దుల్కర్‌సల్మాన్‌కు హైఎండ్ కార్ల సేకరణ ఎక్కువఇష్టం. ఇందుకోసం ఆయన ప్రత్యేక గ్యారేజినే ఏర్పాటుచేసు కున్నారు. పోర్షే, మెర్సిడిస్, బిఎండబ్ల్యులతోపాటు అత్యంత అరుదుగా కనిపించే హైఎండ్ లగ్జరీ వాహనాలను సేకరిస్తారని ఇందుకు ఆయనే స్వయంగా ఎక్స్‌లో పోస్టుపెట్టినట్లు సమాచారం.

# చుక్కల్లో పసిడి

## 5 రోజుల్లో రూ. 2,600 పెరిగి 10 గ్రా. రూ. 1,14,330కి చేరిన ధర

### బంగారాన్ని దాటేసిన వెండి.. కిలో రూ. 1,49,00 పైనే



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23:** పసిడి ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడికి బంగారం అందని ద్రాక్షగా మిగిలిపోతున్నది. బంగారం రేటు తగ్గేదేలే అంటూ దూసుకుపోతోంది. దీపావళి నాటికి బంగారం ధరలు భారీగా పెరుగుతాయని అనుకుంటే, అంతకన్నా ముందే గోల్డ్ రేట్ షాక్ ఇస్తోంది. మంగళవారం ఒక్కరోజే బంగారం ధర భారీగా పెరిగింది. ఫెడ్ వడ్డీ రేటు ఎఫెక్ట్‌తో బంగారం ధర భారీగా పెరుగుతోంది. గత ఐదు రోజుల్లో తులం బంగారం ధర రూ.2,600 పెరిగింది. దీపావళి నాటికి బంగారం ధర ఎంత పెరుగుతుందా అని అనుకున్నారు కానీ, అంతకన్నా ముందే గోల్డ్ రేట్ భారీగా పెరుగుతోంది. కిలో వెండి ధర ఐదు రోజుల్లో రూ.8,000 పెరిగింది. ఇంకో రూ.1,000 పెరిగితే వెండి లక్షన్నర మార్క్ చేరుకుంటుంది.

సెప్టెంబర్ 23న బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర రూ.1,260 పెరిగి రూ.1,13,070 నుంచి రూ.1,14,330కి తగ్గింది. అలాగే 22 క్యారెట్ బంగారం ధర కూడా రూ.1150 పెరిగి రూ.1,03,650 నుంచి రూ.1,04,800కి చేరుకుంది. ఇక 18 క్యారెట్ బంగారం ధర రూ.940 పెరిగి రూ.84,810 నుంచి రూ.85,750కి చేరింది. వెండి సైతం పైపైకి బంగారంతో పాటు వెండి ధరలు కూడా అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇవాళ కిలో వెండిపై ఏకంగా రూ.1,000 పెరగడంతో ధర రూ.1,49,000కి చేరుకుంది. డిసెంబరు డెలివరీకి సంబంధించిన వెండి ఫ్యూచర్స్ ధర రూ.461 (0.34 శాతం) పెరిగింది. దీంతో 1కేజీ వెండి ధర రూ.1,34,016కి చేరింది. ఎంసీఎక్స్‌లో వచ్చే సంవత్సరం (2026) మార్చి డెలివరీకి సంబంధించిన వెండి ఫ్యూచర్స్ ధర సైతం రూ.508 (0.37 శాతం) మేర పెరిగి, 1కేజీకి రూ.1,35,397కు చేరింది.

**పోటాపోటీగా సిల్వర్, గోల్డ్ రేట్లు పెరుగుదల**

ఇక మల్టీ కమాడిటీ ఎక్స్‌చేంజ్‌లో కూడా "సిల్వర్, గోల్డ్ రేట్ల పెరుగుదలలో వేగం ఏ మాత్రం తగ్గలేదు. వాటి రేట్లు కొత్త రికార్డులను క్రియేట్ చేస్తున్నాయి. లైఫ్ టైం హై లెవల్‌కు బంగారం ధర చేరింది. 15 ఏళ్ల గరిష్ఠ స్థాయికి వెండి రేటు పెరిగింది. గోల్డ్ అక్టోబర్ ఫ్యూచర్స్ ధర 0.35 శాతం అంటే రూ.396 పెరిగి రూ.1,12,626 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే డిసెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ ధర 0.17 శాతం అంటే రూ.230 పెరిగి రూ.1,33,785కి వచ్చింది. ఫెడరల్ రిజర్వ్ కామెంట్స్, నవరాత్రి, స్థానికంగా జరిగిన కొనుగోళ్లతో బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డాలర్ బలపడుతుండటం, రూపాయి వీక్ అవుతుండటం కూడా బంగారం కొనుగోళ్లను పెంచింది. బంగారాన్ని అత్యంత సురక్షిత పెట్టుబడి సాధనంగా మదుపరులు చూస్తుండటం అతిపెద్ద సానుకూల అంశం" అని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ (కమొడిటీస్) రాహుల్ కలంత్రి విశ్లేషించారు.

బంగారం ధరలు పెరుగుతుండటంతో, ఇప్పటివరకు గోల్డ్ కొన్నవాళ్లు ఆఫ్‌లోడ్ చేయడం కన్నా, అలాగే హోల్డ్ చేసేందుకు ఇష్టపడుతున్నట్లు కనిపిస్తోంది. లాభాల బుకింగ్ ఉండవచ్చని అందరూ అనుకున్నారు కానీ, డిమాండ్ ఇంకా పెరుగుతోంది. ఇన్వెస్టర్లకు బంగారం బాగా మద్దతు ఇస్తున్నట్లు కనిపిస్తోంది అని ఇండియా బులియన్ జ్యువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) వైస్ ప్రెసిడెంట్, ఆస్పెక్ట్ గ్లోబల్ వెంచర్స్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ అక్ష కాంబోజ్ అన్నారు. సాధారణంగా దసరా, దీపావళి పండుగ సీజన్‌లో బంగారం కొనుగోళ్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ధనత్రయోదశి రోజు బంగారం కొనేందుకు ఆసక్తి చూపిస్తారు.

# చుక్కలమందుతో కంటిచూపు మెరుగు!

## అర్జెంటీనా శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడి



**బ్యూనస్ ఏరీస్, సెప్టెంబరు 23:** అర్జెంటీనాలోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ ఆఫ్ ప్రెస్‌బ్యోపియాకు చెందిన పరిశోధకులు ఈ కంటి చుక్కల మందును తయారు చేశారు. ప్రెస్‌బ్యోపియా సమస్యను సర్జరీ అవసరం లేకుండా, కళ్లద్దాలు వాడకుండా ఓ పరిష్కారం కనుగొనడం కోసం వీరు చాలా కాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ఈ క్రమంలో దగ్గరి చూపును తిరిగి పొందేందుకు ఐ డ్రాప్స్‌ను అభివృద్ధి చేశారు. ఇటీవల జరిగిన యురోపియన్ సొసైటీ ఆఫ్ కాటరాక్ట్ అండ్ రిఫ్రాక్టివ్ సర్జన్స్ 43వ కాంగ్రెస్‌లో అర్జెంటీనా పరిశోధకులు తాము డెవలప్ చేసిన కంటి చుక్కల మందు గురించి వివరాలను వెల్లడించారు. ఈ కంటి చుక్కలు వేసుకుంటే సర్జరీ, కళ్లద్దాలతో పనిలేదు. వెల్లడించారు. ఈ మందులో ఉండే పిలోకార్పైన్ అనే పదార్థం కంటి ప్యూపిల్‌ను చిన్నగా చేస్తుంది. అన్‌ఫోకస్డ్ లైట్ కంట్లోకి రాకుండా చేస్తుంది. దగ్గరి, దూరం వస్తువులు స్పష్టంగా కనిపిస్తాయి. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ మెడిసిన్ డైక్లోఫెనాక్ కూడా ఉంటుంది. ఈ రెండింటినీ ఆఫ్తాల్మిక్ సొల్యూషన్‌లో కలుపుతారు. ప్రెస్‌బ్యోపియా ఉన్న 766 మంది వలంటీర్లకు ప్రయోగాత్మకంగా ఈ చుక్కల మందును ఇచ్చి చూశారు. 1 నుంచి 3 శాతం సాంద్రతలో పిలోకార్పైన్‌ను ఉపయోగించారు. ఈ మందు వేసుకున్న వారిలో 80-90 శాతం మంది తమ దగ్గరి చూపు మెరుగుపడిందని చెప్పారు. ఈ కంటి చుక్కలు వేసుకున్న గంటలోపే కొందరు వలంటీర్లు నియర్ విజన్ చార్ట్‌లో (కంటిచూపు పరీక్ష) 23 లైన్లు ఎక్కువ చదవారట. ఈ ఐ డ్రాప్స్ వలంటీర్లపై సమర్థంగా పనిచేశాయని కానీ కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ వచ్చినట్లు పరిశోధకులు తెలిపారు. కొందరిలో కొద్దిగా మసకగా కనిపించడం, చికాకు అనిపించినట్లు కానీ కొద్ది సేపటికే వాటికవే తగ్గినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ కంటి చుక్కల మందు ఇప్పటి వరకు మంచి ఫలితాలు ఇచ్చినా దీనిపై ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉందని పరిశోధకులు అంటున్నారు. ఈ చుక్కల మందును ఏళ్ల తరబడి ప్రతి రోజూ వాడితే.. కంటిపై ప్రతికూల ప్రభావం చూపుతుందా లేదా అనే విషయం తేలాల్సి ఉంది. దీని వల్ల కాటరాక్ట్, రెటీనల్ సమస్యల వస్తాయా? అనేది విషయంలోనూ స్పష్టమైన సమాచారం లేదు. ఈ కంటి చుక్కల మందును అందరూ ప్రతిరోజు వాడొచ్చని తేల్చడానికి దాదాపు 5 సంవత్సరాల ఫాలోఅప్ టెస్టింగ్ అవసరమని సైంటిస్టులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 180 కోట్ల మంది ప్రెస్‌బ్యోపియా సమస్యతో బాధపడుతున్నారు. ఇందులో చాలా మందికి కళ్లద్దాలు కూడా అందుబాటులో లేవు. ప్రస్తుతం సైంటిస్టులు చేస్తున్న ప్రయోగాలు ఫలిస్తే.. భవిష్యత్తుల్లో లక్షలాది మందికి సర్జరీ, రీడింగ్ గ్లాసెస్ పెట్టుకోవాల్సిన అవసరం ఉండదు. కేవలం కొన్ని చుక్కలు కంటి మందు వేసుకుంటే సరిపోతుంది. కంటిచూపు మెరుగుపరిచే పరిశోధనల్లో ఇదో కీలక ముందడుగు. శాస్త్రవేత్తల ప్రయోగాలు ఫలిస్తే మరి కొన్నేళ్లలోనే కేవలం కంటి చుక్కల మందుతోనే కంటి చూపు మెరుగుపర్చుకునే అవకాశం ఉంటుంది.

# సంక్షిప్తంగా..

## చైనా అత్యున్నత రక్షణ శాస్త్రవేత్త అరెస్టు!

**బీజింగ్, సెప్టెంబరు 23:** చైనాలో కీలక వ్యక్తుల అరెస్టులు కొనసాగుతున్నాయి. తాజాగా ఆ దేశ ఆయుధ వ్యవస్థల కోసం సెమీకండెక్టర్లను తయారుచేసిన అత్యున్నత శాస్త్రవేత్త యూ ఫాక్సిన్ అవినీతి ఆరోపణలపై అరెస్టు చేశారు. ఆయనకు చెందిన ఝిజియాంగ్ మైక్రోవేవ్ టెక్నాలజీ కంపెనీ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నెల 21న తమ ఛైర్మన్ ఫాక్సిన్‌ను ది సూపర్‌వైజరీ కమిషన్ ఆఫ్ హవాంగ్‌షి అదుపులోకి తీసుకొన్నట్లు ఝిజియాంగ్ సంస్థ పేర్కొంది. ఈ విషయాన్ని సౌత్‌చైనా మార్నింగ్ పోస్టు కథనంలో వెల్లడించింది. ఫాక్సిన్ ఝిజియాంగ్ యూనివర్సిటీలోని ఏరోనాటిక్స్ అండ్ ఆస్ట్రోనాటిక్స్ స్కూల్‌లో ప్రొఫెసర్‌గా కూడా పనిచేస్తున్నారు. ఆయన మైక్రోవేవ్ అండ్ మిల్లీమీటర్ వేవ్ రేడియో ఫ్రీక్వెన్సీ టెక్నాలజీలో నిపుణుడు. కమ్యూనికేషన్, నేవిగేషన్, రాడార్ టెక్నాలజీలో ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. దీంతోపాటు గాలియం నైట్రేడ్, గాలియం ఆర్సెనైడ్ సెమీకండెక్టర్లకు అవసరమైన మెటీరియల్‌ను ప్రాసెస్ చేయడంపై కూడా ఫాక్సిన్ పనిచేశారు.

## జర్మనీవైపే మొగ్గుచూపిస్తున్న అత్యధిక భారతీయులు



**బెర్లిన్,సెప్టెంబరు 23:** ఐరోపా దేశాల్లో జర్మనీ అత్యంత ఇష్టమైన దేశంగా మారుతోంది. ఈ ఏడాది తొలి ఏడు నెలల్లోనే భారత పర్యాటకులు జర్మనీలో 5.20 లక్షల మంది బస చేశారని జర్మన్ నేషనల్ టూరిస్ట్ ఆఫీస్ మంగళవారం వెల్లడించింది. ఈ గణాంకాలతో యూరప్‌లో భారతీయులు ఎక్కువగా సందర్శించే టాప్3 దేశాల్లో ఒకటిగా జర్మనీనిలిచింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఈ ఏడాది జనవరి జూలై మధ్య జర్మనీకి వచ్చే భారత పర్యాటకుల సంఖ్య 5.5 శాతం పెరిగింది. ముఖ్యంగా భారత్ జర్మనీ మధ్య విమాన సర్వీసులు గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. 2019తో పోలిస్తే 2024 నాటికి ఇరు దేశాల మధ్య విమానాల రాకపోకలు 26 శాతం అధికమయ్యాయి. మెరుగైన కనెక్టివిటీతో పాటు, ఆధునిక భారత పర్యాటకులను ఆకట్టుకునేలా రూపొందించిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా సత్ఫలితాలనిచ్చాయని జిఎన్‌టిఒ తెలిపింది.

## ప్రధాని నివాసానికే గుంతల రోడ్డు!: డికె శివకుమార్

**బెంగళూరు, సెప్టెంబరు 23:** బెంగళూరు నగరంలోని అధ్వాన రోడ్లపై వెల్లువెత్తుతున్న విమర్శలను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ గట్టిగా తిప్పికొట్టారు. ఈ సమస్య ఒక్క బెంగళూరుకే పరిమితం కాదన్న ఆయన, దేశ రాజధాని ఢిల్లీని ఉదాహరణగా చూపించారు. తాను ఢిల్లీలో పర్యటించాను. ప్రధానమంత్రి నివాసం ఉండే రోడ్డులోనే ఎన్ని గుంతలు ఉన్నాయో మీడియా గమనించాలని వ్యాఖ్యానించారు. రోడ్లపై గుంతలు ఉండటం దేశవ్యాప్త సమస్య అని, కానీ మీడియా మాత్రం కేవలం కర్ణాటకను లక్ష్యంగా చేసుకుని ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. దేశమంతటా ఇదే పరిస్థితి ఉంది. గతంలో బిజెపి ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే రోడ్లు ఎందుకిలా ఉంటాయని ఆయన ప్రశ్నించారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ, తమ సిబ్బంది ప్రతిరోజూ వేలాది గుంతలను పూడ్చివేస్తూనే ఉన్నారని శివకుమార్ స్పష్టం చేశారు. టెక్ హబ్ అయిన బెంగళూరు గుంతల నగరంగా మారిపోయిందంటూ ఇటీవల కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి విమర్శించిన విషయం తెలిసిందే.

## బివైడిలో పూర్తి వాటాలు విక్రయించిన వారెన్ బఫెట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** పెట్టుబడుల మాంత్రికుడు, ఇన్వెస్ట్ గురు వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాత్‌వే చైనా ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిగ్గజం బివైడిలో తమకున్న పూర్తి వాటాను విక్రయించి, 17 ఏళ్ల సుదీర్ఘ పెట్టుబడికి లాభాల ముగింపు ఇచ్చింది. ఈ ఏడాది మార్చి 31, నాటికి బివైడిలో బెర్క్‌షైర్ హాత్‌వే వాటా పూర్తిగా ముగిసినట్లు స్పష్టమైంది. దీంతో ఆ సంస్థ నుంచి బెర్క్‌షైర్ పూర్తిగా బయటకు వచ్చినట్లయింది. బెర్క్‌షైర్ హాత్‌వే తొలిసారిగా 2008లో బివైడిలో పెట్టుబడులు పెట్టింది. అప్పట్లో కేవలం 230 మిలియన్ డాలర్లతో సుమారు 22.5 కోట్ల షేర్లను (10శాతంవాటా) కొనుగోలు చేసింది. గడిచిన 17 ఏళ్లలో బీవైడీ షేరు ధర ఊహించని రీతిలో పెరిగింది. 2008 సెప్టెంబరు నుంచి ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆ కంపెనీ షేరు విలువ ఏకంగా 4500 శాతానికి పైగా వృద్ధి చెందడం విశేషం.

# ఓట్ చోరీపై గ్రామీణులను చైత్యపరచండి

## రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్, సెప్టెంబరు 23,ప్రభాతవార్త:** బిజెపి ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే కుట్రలకు పాల్పడుతూ ఓట్‌చోరి చేసే వైనంపై గ్రామీణులను చైతన్యపరచాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. మంగళవారం జూమ్ మీటింగ్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వలో జరుగగా ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నట రాజన్ మాట్లాడుతూ ఓట్ చోరీ సంతకాల సేకరణ ప్రతిష్టాత్మకంగా తీసు కోవాలని కోరారు. అక్టోబర్ 15 నాటికి గ్రామ గ్రామాన సంతకాల సేకరణ జరగాలని,. లక్షలాదిగా సంతకాల సేకరణ చేసి ఎఐసిసి కి పంపాలని ఆమె కాలమానం నిర్థేశించారు. రాహుల్ గాంధీ, ఎఐసిసి చేస్తున్న ఓట్ చోరీ ఉద్యమంలో మనం అండగా నిలవాలని కోరారు. డిజిటల్ మెంబర్‌షిప్ లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు.

మోడీ, షా ద్వయం ఇద్దరు అటు ఎన్నికల కమిషన్ ను ఇటు ఓట్ చోరీ ని నమ్ముకొని మూడో సారి అధికారంలోకి వచ్చారు ఓట్‌చోరీపై ప్రజల్లో పూర్తి అవగాహన, చైతన్యం తేవాలి ప్రతి గ్రామంలో, అర్బన్ వార్డులలో సంతకాల సేకరణ చేపట్టాలని కోరారు. తెలంగాణలో స్థానిక సంస్థలు ఎన్నికలు కూడా వస్తున్న నేపత్యంలో ఓట్ చోరీ సంతకాల సేకరణ పెద్దఎత్తున గ్రామాల్లోని ప్రజల వద్ద చేపట్టాలని సూచించారు. శిబిరాలు ఏర్పాటు చేసి సంతకాల సేకరణ పెద్దఎత్తున చేపట్టా లని కోరారు.

# భాషా సంస్కృతుల భాగస్వామ్యంతోనే జాతి ఔన్నత్యం

## శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు డా. వరప్రసాదరెడ్డి




కీర్తిపురస్కార గ్రహీతలతో వరప్రసాదరెడ్డి, నిత్యానందరావు, గణపతిరెడ్డి, హనుమంతరావు, రామమూర్తి తదితర అతిథులు

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** ఏ జాతి ఔన్నత్యమైనా దాని ఆర్థిక విజయాలపై ఎదగదని, ఆ జాతి భాషా సంస్కృ2తుల భాగస్వామ్యంతో వెల్లివిరుస్తుందని శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు డా. వరప్రసాద రెడ్డి తెలిపారు. ప్రతీఒక్కరూ బాధ్యతగా వీటిని పోషించాలని కోరారు. తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీ యేటా వివిధప్రక్రియల్లో ప్రముఖుల ప్రతిభను గుర్తించి వివిధ పురస్కారాలను అందజేయడం తెలుగుజాతి ఔన్నత్యాన్ని పెంచడమేనని అభిప్రాయపడ్డారు. మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయంలో కీర్తి పురస్కా రాలకు ఎంపికచేసిన 48 మందిలో వివిధ రంగాల్లో విశేషసేవలు అందించిన 24 మంది ప్రముఖులకు 2024 సంవత్సరానికిగాను అంద జేస్తున్న కీర్తిపురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరప్రసాదరెడ్డి విశ్వవిద్యాలయం పురస్కారం కింద అందిస్తున్న పారితోషికానికి తనవంతుగా ఒక్కొక్కరికి మరో 5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తానని ప్రకటించారు. అనంతరం వరప్రసాదరెడ్డి 24మంది ప్రముఖులను శాలువా, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, రూ.5,116 నగదుతో ఘనంగా సత్కరించి కీర్తిపురస్కారాలను ప్రదానంచేశారు. తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించే ప్రతీ కార్యక్రమాన్ని ఒక చక్కటి తెలుగు పద్యంతో ప్రారంభిస్తే మరిచిపోతున్న తెలుగు పద్యాలను గుర్తుచేయడంతోపాటు ప్రోత్సహించిన వారమవుతామని ఐ.గణపతిరెడ్డి సూచించారు. వెలుదండ నిత్యానందరావు అధ్యక్షోపన్యాసంలో కీర్తిపురస్కారాల గ్రహీతల ప్రతిభా విశేషాలను సభకు పరిచయం చేశారు. స్మారక కీర్తిపురస్కారాలు అందుకున్న 24 మంది ప్రముఖుల్లో కేతరాజు పూర్ణిమ, కామేశ్వరరావు, ఎం.వి.లోకనాథం, డా. ఉదారి నారాయణ, వరి గొండ కాంతారావు, డా. పి.రమేష్ నారాయణ, డా. అమరవాది నీరజ, కోటం చంద్రశేఖర్, డా. గడ్డం శ్యామల, కర్నాటి రఘురాములుగౌడ్, పాలపర్తి హవీల, డా. వేంపల్లె షరీఫ్, చింతకింది శ్రీనివాసరావు, అరుణ తోలేటి, డా. కంపల్లె రవిచంద్రన్, డా. ఎం.దేవేంద్ర, జలదంకి సుధా కర్, డా. చాగంటి కృష్ణకుమారి, డా. తుమ్మల దేవరావ్, దేవనపల్లి వీణావాణి, డా. ఆలేటి మో హన్‌రెడ్డి, డా. ఎస్.రఘు, అవుసుల భానుప్రకాష్, డా. మరింగంటి లక్ష్మణాచార్యులు, బైరెడ్డి కృష్ణారెడ్డి ఉన్నారు.

# జిఎస్టీ పేరిట జనం రక్తం తాగిన కేంద్ర పాలకులు

## రాష్ట్రం నష్టపోయే ఏడువేల కోట్లపై కేంద్రం స్పష్టత ఇవ్వాలి

## కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బాధ్యత తీసుకోవాలి

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంగళవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** జిఎస్‌టి కాదు గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని రాహుల్‌గాంధీ మొదటి నుండి చెబుతున్నట్లుగానే ఎనిమిది సంవత్స రాలుగా బిజెపి పాలకులు ప్రజల రక్తం పీల్చుకు తిన్నారని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడతూ జిఎస్‌టి అమలు చేసిన ఎనిమిది సంవత్సరాల తర్వాత ప్రజలకు ఇన్ని వేల కోట్లు ఆదా అవుతున్నాయని చెబుతున్నారంటే ఇన్ని రోజులు అంత పెద్ద ఎత్తులో పన్నుల పేరుతో పెనుభారం మోపినట్లే కదా అని ఆయన ప్రశ్నిం చారు. జిఎస్‌టి శ్లాబు లు తగ్గించడం కూడా సహేతుకంగా లేనీ స్లాబులు కాదు రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిఎస్‌టి రేట్లు తగ్గించాలనే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వ మాత్రం పెడచెవిన పెట్టిందని విమర్శించారు. బిజెపి అమలు చేస్తున్న జిఎస్‌టిలో 18,24 శాతం స్లాబులో ప్రజలు అధికంగా వినియోగించే వస్తువులు చేర్చారని ఆయన ఆరోపించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విశాఖపట్నంలో ఇటీవల మాట్లాడుతూ గడిచిన ఆరు మాసాల కాలంలో 22 లక్షల కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. దీనిని బట్టి జిఎస్టీ రూపంలో పిండేసి ఇప్పుడు వెన్నపూసినట్లుగా 5,18 శాతం మాత్రమే పరిమితం చేస్తున్నట్లు చెప్తున్నారని ఆరోపించారు.

జిఎస్‌టి తో నిత్యవసర వస్తువుల ధరలు డబులైనాయని ఆయన ఆవేదన చెందారు. 10 రూపాయలు ఉన్న ఉప్పు పాకెట్ 20 రూపాయలు అయింది.60 రూపాయలు ఉన్న కందిపప్పు 160 రూపాయలు అయింది.70 రూపాయలు ఉన్న ఆయిల్ పాకెట్ 160 రూపాయలు అయిందని ఆయన ధరల పెరిగిన సరళిని వివరిస్తూ ఏకరువు పెట్టారు. మీరు వేసిన జిఎస్‌టి రొట్టెలు తినే పేదవాడి మీద ఎక్కువ,విలాస వస్తువుల మీద మాత్రం తక్కువ ఉండేదని పొన్నం విమర్శించారు..

ఫైవ్ స్టార్ హోటల్లో ఫుడ్ కి తక్కువ జిఎస్‌టి వేస్తే చిన్న హోటల్లో కప్పు టీ కి మాత్రం ఎక్కువ జిఎస్‌టి వేసి దోచుకున్నారని ఆయన అన్నారు. పెట్రోల్ ,డీజిల్ జిఎస్‌టిలో చేర్చాలని తద్వారా పన్ను రేటు తగ్గి ప్రజలకు మేలు జరుగుతుందని చాలా రాష్ట్రాలు విజ్ఞప్తి చేశాయి.. ఇప్పటి వరకు పెట్రోల్ డీజిల్ జిఎస్‌టి పరిధిలోకి తేలేదని అన్నారు. మీరు శవ పేటికలకు కూడా జిఎస్‌టి వేసారు. శవాలను దహనం చేసే సమయంలో చెల్లించే సొమ్ముపై జిఎస్‌టి తీసేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు మీరు తగ్గించిన జిఎస్‌టి ఫలాలు పేదోడి కి ఎంత వరకు అందుతాయో చూడాలని అన్నారు.

నిన్న తగ్గిన జిఎస్‌టి అమలులోకి వచ్చిన పాత ధరలే తీసుకున్నట్లు వార్తలు చూసామని చెప్పారు.ఇన్ని సంవత్సరాల తరువాత ఎన్నికలు వస్తున్నాయని రియలైజై జిఎస్‌టి తగ్గిస్తున్నట్లు నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలి ఒక చేతితో ఇచ్చి మరొక చేతితో తీసుకునట్లు ఉంది.జిఎస్‌టి కౌన్సిల్ ను ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పాటు చేయాలి.కేంద్ర ప్రభుత్వం ది పెత్తనం ఉంది.తెలంగాణ రాష్ట్రం కొత్త జిఎస్టి వల్ల ప్రతి సంవత్సరం 7000 కోట్ల రూపాయలు నష్టపోతుందని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్రాలు నష్టపోతున్న దానిని కేంద్ర ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. జిఎస్‌టి తగ్గించి కేంద్ర ప్రభుత్వం మీ చావు మీరు చావండి అన్న విధంగా వ్యవహరిస్తున్నారు.

సంక్షేమం మొత్తం రాష్ట్రాల మీద రుద్దుతున్నారని ఆవేదన చెందారు కేంద్ర ప్రభుత్వ మాత్రం సెస్ ల పేరుతో దండుకుంటున్నారని విమర్శించారు. జిఎస్‌టి తీసుకొచ్చినప్పుడు 10 సంవత్సరాల పాటు రాష్ట్రాల నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేస్తుంది అని చెప్పారు.

కానీ పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదుఇప్పుడు తెలంగాణ రాష్ట్రం నష్టపోతున్న ఏడు వేల కోట్ల రూపాయల పై మాకు ఎంత ఇస్తారు. ప్రామిస్ చేయాలిరాష్ట్రాలు నష్టపోతున్న దానిపై తెలంగాణలోని కేంద్ర మంత్రుల కిషన్ రెడ్డి ,బండి సంజయ్ లు కేంద్ర ప్రభుత్వం తో మాట్లాడించాలి..మీరు కేంద్రం నుండి స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు

# ఇబ్రహీంపూర్ మదర్సాలో ఫుడ్‌పాయిజన్ కలకలం

## చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై కలెక్టర్ ఆరా

**రామాయంపేట, (ఇబ్రహీంపూర్) సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలోని మదర్సాలో ఫుడ్ పాయిజన్ ఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో 10 మంది చిన్నారులు వాంతు లు, విరోచనాలతో అస్వస్థ తకు గురయ్యా రు.వెంటనే సమాచారం అందుకున్న అధికారులు వారిని రామా యంపేట ప్రభుత్వ ఆసు పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆసుప త్రిలో వైద్యులు, సిబ్బంది పర్య వేక్షణలో చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి స్థిరంగా ఉన్నట్టు సమాచా రం. మరో 25 మంది పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనపై స్పందించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిని స్వయంగా సందర్శించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని తగిన సూచనలు చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ప్రస్తుతం చికిత్స పొందుతున్న చిన్నారులందరూ బాగానే ఉన్నారనీ, వైద్యులు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించి, సరైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కాగా ప్రభుత్వ రెసిడెన్షియల్ హాస్టళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు పిల్లలకు ఎల్లప్పుడూ నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు కూడా వంటగదులు పరిశుభ్రంగా ఉంచుతూ,ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి అని స్పష్టం చేశారు. అదేవిధంగా ఆహారం విషయంలో నాణ్యత నిబంధనలు పాటించని హోటళ్లపై, రెస్టారెంట్లపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట ఇంచార్జి డిఎంహెచ్వో సృజన, ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ లింబాద్రి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ కోఆర్డినేటర్ శివదయాల్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో చిన్నారుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కలెక్టర్

# వ్యవసాయ డిగ్రీ విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించాలి

## వర్సిటీ అధికారులతో మంత్రి పొన్నం సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవ సాయ విశ్వ విద్యాలయం అధికారులతో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ మంగళవారం సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ఇంచార్జి సెక్రటరీ బుద్దా ప్రకాష్, వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్, రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఎంజెపి గురుకుల సెక్రటరీ సైదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే వ్యవసాయ డిగ్రీ కాలేజీ విద్యార్థులకు మరింత నాణ్యమైన టెక్నికల్ విద్యను అందించడానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంతో ఒప్పందానికి సిద్ధమైనట్టు తెలిపారు. కరీంనగర్, వనపర్తిలో కొనసాగుతున్న బిసి గురుకుల వ్యవసాయ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ద్వితీయ, తృతీయ, చివరి సంవత్సరం విద్యార్థులకు వ్యవసాయ విశ్వ విద్యాలయ అధ్యాపకుల సమక్షంలో విద్యా బోధన ..ఈ ఏడాది ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో కొనసాగనున్న నేపథ్యంలో విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ విద్యార్థులకు, ఫీల్డ్ విజిట్, మౌలిక సదుపాయాలు, ల్యాబ్, రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, దాని అనుబంధ కళాశాలల్లోనే నిర్వహణ జరిగేలా కసరత్తు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు.

# ఐదు నెలల కమీషన్‌ను విడుదల చేయాలి

## రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రేషన్ డీలర్ల కమిషన్‌ను ఈ నెల 30 లోపు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో అక్టోబర్ 1,2 వ తేదీలో పౌర సరఫరాల శాఖ కార్యాలయం ముందు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 17200 మంది రేషన్ డీలర్లు ఉన్నారని ఐదు నెలలుగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన కమిషన్ రాకపోవడంతో భవన కిరాయిలు, హెల్పర్ జీతాలు ఇవ్వలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారని తెలిపారు. ఇట్టి విషయాన్ని పౌర సరఫరాల శాఖ కమిషనర్ కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని వాపో యారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ నాగరాజు వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిఒ నం.190లో స్థానికతపై ప్రభుత్వం స్పందించాలి

## 27న చలో హైదరాబాద్‌కు ఉద్యోగ ఉపాధ్యాయ జెఎసి పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** జిఒ నెంబర్ 190లో స్థానికతపై ప్రభుత్వం స్పందించాలని 317 ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ టి.విజయ్‌కుమార్,ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.జీవో నం.370 ఉద్యోగ ఉపాధ్యాయ బాధితులకు తాత్కాలిక డిప్యూటేషన్ల కోసం ఉపశమనం కొరకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం. 190ను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో 317 జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 27న చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లా డుతూ జీవో నెంబర్ 190లో స్థానికతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, డిప్యూటేషన్ జీవో190లో కూడా స్థానికత లేదనే విషయం పైన స్పందించాలని కోరారు.ఈ జీవో ద్వారా తాత్కాలిక డిప్యూటేషన్‌లో కేవలం కొంతమందికి మాత్రమే అవకాశాన్ని కల్పించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 317 బాధితులు అందరికీ న్యాయం జరిగేలా శాశ్వతంగా వారి సొంత జిల్లా జోన్లకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశంపై ఈనెల 27న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టా మని 317 జీవో బాధితులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

# డిసిసి అధ్యక్షుల ఎంపిక కోసం పరిశీలకుల నియామకం

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతం కోసం పదవుల పంపిణీకి రంగం సిద్ధం చేసుకొంటున్నది. డిసిసి అధ్యక్షుల ఎంపిక కోసం ఎఐసిసి సీనియర్ నాయకులను పరిశీలకులను అధిష్టానం నియమించింది. తెలంగాణ, ఛత్తీస్ గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల ఎంపిక కోసం పరిశీలకుల పేర్లను ఎఐసిసి మంగళవారం ప్రకటించింది. జాతీయ స్థాయిలో సీనియర్ నాయకులను పరిశీలకులనియమించినారు.

తెలంగాణ కోసం 22 మందిని ఎఐసిసి చీఫ్ మల్లికార్జున ఖర్గే నియమించినట్లు ఇవాళ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు.డిసిసిల నియామకాలను ఎఐసిసిసి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందనే సంకేతం విడుదల చేసిన జాబితాతో ఒక సంకేతం క్షేత్రస్థాయికి పంపినారు. ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా నిర్ణయాలు తీసుకోవడానికి ఎఐసిసి సీనియర్ నాయకులను ఇంచార్జ్ లుగా నియమించినారు. ఎఐసిసిమాజీ ముఖ్యమంత్రి, సభ్యులు, మాజీ కేంద్ర మంత్రులు, స్పీకర్ గా పని చేసిన వారిని తెలంగాణ డిసిసిల నియామకాలకు ఇంచార్జ్ లుగా వేయడం జరిగింది. డిసిసి నియామకాలకు ఇస్తున్న ప్రాధాన్యత కు నిదర్శనమని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. దీంతో డిసిసి నియామకాలు ఎంత పారదర్శకంగా, ప్రతిష్టాత్మకంగా, ఎలాంటి ఒత్తిడి లేకుండా జరుగుతాయో అర్థం చేసుకోవచ్చు.డిసిసి లకు భవిష్యత్ లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వనుండడంతో డిసిసి లకు డిమాండ్ పెరిగింది.

తెలంగాణ డిసిసిల నియామక పరిశీలకులుగా వి.నారాయణస్వామి, సి.పి.జోషి. శక్తి సింగ్ గోహిల్, బెన్నీ బెహానన్, అంటో ఆంటోనీ, హిబి ఈడెన్, స్టారిటా లైట్‌ప్లాంగ్,శోభా ఓజా, బి.వి. శ్రీనివాస్, అజయ్ సింగ్, రిజ్వాన్ అర్షద్, టి.సిద్ధిక్ ,సోఫియా ఫిర్దాస్, శ్రీనివాస్ మానే, అమిన్ పటేల్ ఎం.నారాయణ స్వామిప సారత్‌రౌత్,. బిస్వరంజన్ మోహంతీ,. నబజ్యోతి పట్నాయక్, డెబాసిస్ పట్నాయక్, జాన్సన్ అబ్రహామ్,కె.మహేంద్రన్ నియమించారు.

# ఆల్మట్టిడ్యాం ఎత్తు పెంపుతో దక్షిణ తెలంగాణకు తీవ్రనష్టం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు


**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచాలనుకోవడం దక్షిణ తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భం గా రాంచందర్ రావు మాట్లాడుతూ సుప్రింకోర్టు స్టే ఉన్నప్పటికీ కర్నాటక ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం, భవిష్యత్తులో డ్యాం ఎత్తును పెంచే ప్రయత్నాలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

కర్ణాటకలో ఉన్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అయినప్పటికీ కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను రక్షించడానికి, రైతులకు అన్యాయం జరకుండా సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు చొరవ చూపడం లేదంటూ ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్రాన్ని రక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపును ఆపకపోతే, దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తును పెంచితే దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదముంది.

ఉమ్మడి పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. జూరాల, నాగార్జునసాగర్, పాలమూరు-రంగారెడ్డి, నెట్టెంపాడు, కల్వకుర్తి వంటి ప్రాజెక్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతాయని, హైడల్ పవర్ కోసం, రైతులకు సాగు నీరు కోసం కృష్ణానదిపై ఆధారపడ్డామన్నారు. కృష్ణా నదిపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుతో రైతులకు నష్టం జరుగుతుందనే కారణంతోనే గతంలో సుప్రింకోర్టు దీనిపై స్టే ఇచ్చిందని అన్నారు. సుప్రింకోర్టు స్టే ఉన్నప్పటికీ, ఆల్మట్టి ఎత్తు పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం సిద్ధమవ్వడం అన్యాయమని, 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్ణాటకలో ఉన్న ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు 519 నుంచి 524 మీటర్లకు పెంచాలని ప్రయత్నించిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, తెలంగాణకు కృష్ణా జలాల వాటా కేవలం 299 టిఎంసిలు మాత్రమే సరిపోతుందని కెసిఆర్ సంతకం చేశారన్నారు. దీని కారణంగా నదీజలాల వాటాలో తెలంగాణకు నష్టం ఏర్పడిందని, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నీటివాటా విషయంలో తెలంగాణకు నష్టం చేసిందన్నారు.

ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తుందంటూ మండిపడ్డారు. అందుకే బిఆర్ఎస్‌కు ఈ విషయంలో మాట్లాడే నైతిక అర్హత కోల్పోయిందని, ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు అంశంపై పిటిషన్ సుప్రింకోర్టులో ఉన్నప్పటికీ, కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ చేపట్టిందన్నారు. భవిష్యత్తులో డ్యామ్ ఎత్తును పెంచే ప్రయత్నంలో ఇది ఒక ముందస్తు చర్య అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతిసారి ఢిల్లీ వెళ్తుంటారు. అదేవిధంగా కర్ణాటకలో ఉన్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఇప్పుడు ఆల్మట్టి ఎత్తు పెంపు నిర్ణయం తీసుకున్న కర్ణాటక ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న ద్రోహాన్ని సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో మాట్లాడి తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు, రైతులకు అన్యాయం జరగకుండా ఎందుకు చొరవ చూపడం లేదు? ఎందుకు మాట్లాడటం లేదు? అని ప్రశ్నించారు.

కర్ణాటక, తెలంగాణలో ఉన్నది రెండు ప్రభుత్వాలు, పార్టీలు మీవే కదా, మరి తెలంగాణ రైతులకు అన్యాయం జరగకుండా ఎందుకు చొరవ చూపడం లేదు?రేవంత్ రెడ్డికి సోనియా గాంధీ ఆస్కార్ అవార్డు ఇచ్చిందని చెప్పారు కదా, మరి అంత పలుకుబడి, ప్రాధాన్యత, చొరవతో రాష్ట్ర ప్రయోజనాల గురించి ఎందుకు నోరుమెదపడం లేదు? అన్నారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సిఎం రేవంత్ రెడ్డి, పాలమూరుకు నీరు ఆగిపోతే ఎందుకు నోరు మూసుకుంటున్నారు? అన్నారు. తెలంగాణలో కృష్ణా జలాల వాటాను రక్షించడంపై లేదని, ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు చర్యలు సుప్రింకోర్టులో కేసు ఉన్న సందర్భంలో చేయకూడదని సీడబ్ల్యూసి కూడా చెప్పిందని, ఇప్పటికైనా తెలంగాణ రైతులకు నష్టం కలగకుండా కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరపాలన్నారు. కేవలం కాంట్రాక్టర్ల లాభం కోసం, కమీషన్లపై ధ్యాసతో కృష్ణా నీటిని కర్ణాటకకు అప్పగించడం తెలంగాణ రైతులకు ద్రోహం చేయడమే.తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా రాష్ట్రాన్ని రక్షించేలా చర్యలు తీసుకోవాలి. ఆల్మట్టి ఎత్తు పెంపును ఆపకపోతే దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందన్నారు.



మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

### బిజెపిలో చేరిన వరణ్‌సందేశ్ తల్లి రమణి

సినినటుడు వరుణ్ సందేశ్ తల్లి డాక్టర్ రమణి బిజెపిలో చేరారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆమెకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణి మాట్లాడుతూ సమాజసేవ చేయడం అంటే తనకు చాలా ఇష్టమన్నారు. హిందుత్వం అంటే తమ కుటుంబానికి ఇష్టమన్నారు. అందుకే తాను బిజెపిలో చేరుతున్నానని, పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.



# సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదు

## బకాయిలు తక్షణమే చెల్లించాలి

### శ్రీరాంపూర్‌లో బతుకమ్మ వేడుకలు.. పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత

**నస్పూర్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యాన్ని సహించేది లేదని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూని యన్ (హెచ్ఎంఎస్) గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ఎంఎస్) తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. మొదట హెచ్ఎంఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి నివాసంలో సింగరేణి కార్మికులు, స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చారు. సాయంత్రం శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో నిర్వహించిన బతు కమ్మ వేడుకలలో స్థానిక మహిళలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు లాభాల వాటా పంపిణీలో అంకెల గారడీతో ప్రభుత్వం సింగరేణి కార్మికులను మోసం చేసిందన్నారు. సింగరేణి కార్మికులకు జరుగు తున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యేడాదికి ఐదు నూతన గనులు ప్రారంభించడానికి చేసిన ప్రణాళికలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# నకిలీ పాసుపుస్తకాల ముఠా గుట్టురట్టు!

## ఐదుగురు సభ్యులను రిమాండ్‌కు తరలించిన ఎస్సై

**కూసుమంచి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** ఖమ్మం జిల్లా కూసుమంచి మండ లం జక్కేపల్లికి చెందిన కొంతమంది రైతుకు పట్టాదారు పాస్‌బుక్స్ ఇప్పి స్తామని డబ్బులు తీసుకొని నకిలీ పట్టాదారు పాస్‌బుక్స్ ఇచ్చారని, జక్కేపల్లికి చెందిన కళ్లెం అంజిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు కూసుమంచి ఎస్సై నాగరాజు తెలిపారు. మంగళవారం గంగాబండతండ ఫ్లైఓవర్ దగ్గర నకిలీపాస్ పుస్తకాల తయారీ చేస్తున్న ఐదు గురు ముఠా సభ్యులను కూసుమంచి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుండి రెండుకార్లు, 10 నకిలీ పట్టా దారు పాస్‌బుక్స్ స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. నిందితుల వివ రాలు..కొత్త జీవన్‌రెడ్డి, కూసుమంచి మండలం, జక్కేపల్లి, కొండూరి కార్తీక్, గార్ల బయ్యారం, మహబూబాద్ జిల్లా ప్రస్తుతం సాయిగణేష్ నగర్, ఖమ్మంలో నివాసం ఉంటున్నాడు, పారిపత్తి సాయికుశాల్, టీచర్స్ కాలనీ, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జక్కపల్లి వరప్రసాద్, ఇందిరానగర్ కాలనీ, లక్ష్మీదేవిపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నందమూరి లక్ష్మణ్‌రావు, బొక్కలగడ్డ, మంచికంటి నగర్, ఖమ్మం, ప్రస్తుతం మసీద్ ఏరియా, ఏకే ప్రింటింగ్స్, సారాపాక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నకిలీ ముఠాకు సంబంధించి పోలీసులు కొన్ని వస్తువులు స్వాధీనపర్చుకున్నట్లు తెలిపారు. మహీంద్రా థార్ కారు, ఎర్టిగా కారు, తయారు చేసిన నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు మొత్తం పది ఉన్నాయని తెలిపారు.

# రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం దుర్మార్గం

## మాజీమంత్రి హరీశ్‌రావును కలిసిన రేషన్‌డీలర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 23:** నెల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీశ్‌రావు మండిపడ్డారు. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీర్చుతున్న రేషన్‌డీలర్లకు.. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయం అని పేర్కొన్నారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుందని దారుణమని వ్యాఖ్యానించారు. రేషన్ డీలర్లు మంగళవారం నగరంలోని తన నివాసంలో హరీశ్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు రూ. 5 వేల గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంపు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదని, ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలు తప్ప చేతలులేని కోతల ప్రభుత్వం ఇది అని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సచివాలయానికి రేషన్ డీలర్లను ఆహ్వానించి వారి సమస్యలను విని పరిష్కరించామని గుర్తు చేశారు. మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను రూ.900 నుంచి రూ.1400లకు పెంచామని, ప్రభుత్వంపై రూ.139 కోట్ల అదనపు భారం పడుతున్నా రేషన్ డీలర్ల సంతోషం కోసం కెబినెట్ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. 17వేలకు పైగా ఉన్న రేషన్ డీలర్ల ముఖాల్లో చిరునవ్వులు నింపామని అన్నారు. కమీషన్ చెల్లించడమే కాదు, కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేశామని చెప్పారు.

## 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు

# టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

## పాఠశాల విద్య డైరెక్టర్‌కు ఎస్‌ఎల్‌టిఎ టిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి పదోన్నతుల కోసం టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర భాషా ఉపాధ్యాయుల సంఘం(ఎస్‌ఎల్‌టిఎ), తెలంగాణ రాష్ట్రం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు చక్రవర్తుల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె గౌరీశంకర్ రావు మంగళవారం పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్‌కి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. 2010 సంవత్సరానికి కంటే ముందు నియమించబడిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పాధ్యాయ వృత్తిలో చేరుటకు తగిన అర్హతలు పొందడమే కాక, ఉద్యోగాలు పొందుటకు నిర్వహించిన డిఎస్‌సిలో మెరిట్ పొంది ఉపాధ్యాయులుగా చేరి 20 సంవత్సరాలపైబడి అనుభవమున్న వారిని ముఖ్యమున్న స్కూల్ అసిస్టెంట్‌కి సరిపడు అర్హతలతో నియమించబడిన వారిని టెట్ వ్రాయాలని కావాలనడం అసమంజసమన్నారు.

# పదోన్నతి పొందిన భాషాపండితులకు న్యాయం చేయాలి

## మంత్రి శ్రీధర్‌బాబుకు ఆర్‌యుపిపి టిఎస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పదోన్నతి పొందిన భాషా పండితులను స్కూల్ కేటగిరీ కింద ఒకే జిల్లాలో పనిచేసే విధంగా సర్దుబాటు చేయాలని కోరుతూ రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు(ఆర్‌యుపిపి) రాష్ట్రశాఖ మంత్రి శ్రీధర్ బాబుకి విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు శానమోని నర్సింలు నేతృత్వంలో పండిత పరిషత్తు బృందం మంగళవారం ఐటి, సాంకేతిక శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ప్రభుత్వం ఇటీవల 317 బాధితులకు తాత్కాలిక ఉపశమనం కలిగిస్తూ విడుదల చేసిన 190 జీవోలోని మార్గదర్శకాలలో పదవ కాలమును సవరించి భాషాపండితులకు న్యాయం చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఆర్‌యుపిపి టిఎస్ నాయకులు తెలిపారు. 317 జీవో ప్రకారం భార్యాభర్తలను సొంత జిల్లాకు చేర్చుటకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు.

# ఇంటర్‌బోర్డులో నిధుల దుర్వినియోగంపై ఎసిబితో విచారణ జరిపించాలి

## విద్యాశాఖ కార్యదర్శికి టిజిఐ ఉపాధ్యక్షుడు ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** తెలంగాణ ఇంటర్ బోర్డులో కోట్లాది రూపాయల దుర్వినియోగం జరిగిందని.. ఈ దుర్వినియోగంపై వెంటనే ఏసీబీతో విచారణ జరిపించాలని టిజిఐ సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షులు మాచర్ల రామకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణాకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇంటర్ బోర్డులో బోర్డ్ అనుమతి లేకుండా బోర్డు కార్యదర్శి కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేశారని విమర్శించారు. కోట్లాది రూపాయలను ఖర్చు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 6000 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారని అలాగే మరో 2000 సిసి కెమెరాలను ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు తీసుకొచ్చారని తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. సిసి కెమెరాల కొనుగులుకు, అద్దెకు తీసుకురావడానికి బోర్డు అనుమతి తీసుకోలేదన్నారు. ఇంటర్ బోర్డు భవనం నవీకరణ కోసం కూడా బోర్డు అనుమతి లేకుండానే.. కనీసం బోర్డుకు సమాచారం కూడా ఇవ్వకుండానే నవీకరణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని ఫిర్యాదు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అవసరం లేకున్నా ఫైర్ నియంత్రణ పరికరాలను కొనుగోలు చేయడం కోసం సుమారు రూ. 60 లక్షలు ఖర్చు చేశారని తెలిపారు.

# ఆగ్రోఫారెస్ట్‌కు ప్రోత్సాహం ఇస్తాం

## అటవీ దళాల ప్రధాన సంరక్షణ అధికారి సువర్ణ

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** అగ్రోఫారెస్ట్రీ ప్రోత్సాహానికి తమశాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తుందని అటవీ దళాల ప్రధాన సంరక్షణ అధికారి సువర్ణ హామీ ఇచ్చారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా వుడ్ డిమాండ్ పెరుగుతుందన్నారు. తెలంగాణ అటవీశాఖ, బెంగళూరుకు చెందిన వన శాస్త్ర,సాంకేతిక సంస్థ సంయుక్తం గా వుడ్ బేస్డ్ ఇండస్ట్రీస్ అభివృద్ధిపై హైదరాబాద్ లోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఒక ప్రత్యేక ప్రత్యేకసమావేశం జరిగింది. ఈ కార్యాక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేవలం అటవీ ప్రాంతంలో లభించే చెట్లు మాత్రమే కాకుండా రైతుల తమ పంట పొలాల్లో సేద్యాల ద్వారా బాంబూ, యూకలిప్టస్ సుబాబులు వీటితోపాటు త్వరగా పంట సాగుకు వచ్చే కలపపై దృష్టి పెట్టాలన్నారు. వీటితో పాటుగా కలపేతర వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ఫర్నిచర్ తయారుచేసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ స్కూల్, కాలేజీల బాలికలకు రూ. 30వేల స్కాలర్‌షిప్

## 15 వేల మందికి ఇవ్వాలని అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ నిర్ణయం

## నెలాఖరు వరకు దరఖాస్తులకు అవకాశం

## ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ తెలంగాణ హెడ్ శ్రీనివాసరావు



**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్ 10వ తరగతి చదివిన, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చేసిన బాలికలకు ప్రముఖ టెక్ సంస్థ విప్రో సంస్థ అధినేత అధ్వర్యంలో కొనసాగుతున్న అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ స్కాలర్‌షిప్‌లను అందిస్తూ ఆర్థికసాయం చేయనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి సూచించారు.

ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ తెలంగాణ హెడ్ ఎం శ్రీనివాసరావు, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తో కలిసి మీడియాకు తెలిపారు. గత ఏడాది రెండు, మూడు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన స్కాలర్‌షిప్ అందజేత కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచి 18 రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి 15 వేల మంది విద్యార్థినులకు ఇవ్వాలని ఫౌండేషన్ నిర్ణయించిందని తెలిపారు. ఇప్పటికే ఈ నెల 10 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

ఇప్పటి వరకు సుమారు 3276 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2200 మంది పూర్తి వివరాలను సమర్పించినట్టు వారు తెలిపారు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే స్వీకరించనున్నట్టు తెలిపారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

దరఖాస్తుకి ఎటువంటి ఫీజు లేదు. ప్రతి ఏడాది బాలికలకు రూ. 30వేల స్కాలర్‌షిప్‌ను అందించను న్నారు. దీనిని రెండు విడతల్లో అందిస్తారు. వారు ఇతర ఎటువంటి స్కాలర్‌షిప్‌లు పొందుతున్న తమ స్కాలర్‌షిప్‌కి అర్హులని.. కానీ వారు 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి ఉండాలన్నారు. మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 1,26,392 మంది దరఖాస్తు చేసుకున్నారని, కర్ణాటకలో సుమారు 88వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో లాటరీ ద్వారా బాలికలను ఎంపిక చేస్తారని తెలిపారు.

దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో 2.50 లక్షల మందికి స్కాలర్‌షిప్ అందించాలని అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ నిర్ణయించినట్టు తెలిపారు. ఇప్పటికే బెంగళూరు, భోపాల్‌లో అజీమ్ ప్రేమ్‌జీ యూని వర్సిటీలు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిం చారు. రెండో విడతలో వచ్చే ఏడాది జనవరి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు.

# రేపు 317 జిఒ బాధిత ఎస్సీ గురుకుల ఉపాధ్యాయుల బస్సుయాత్ర

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జీవో 317 బాధితులు రేపు(25 సెప్టెంబర్)న బస్సు యాత్రను నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టిగారియా) తెలిపింది. ఎస్సీ గురుకుల సొసైటీలో 317 జీవో అమలు వల్ల స్థానికత కోల్పోయినటువంటి ఉపాధ్యాయులు గురువారం హైదరాబాద్ పట్టణంలో బస్సు యాత్రను నిర్వహించి, 317 జీవో అమలు వల్ల సొసైటీలో తమకు జరిగినటువంటి నష్టాన్ని ప్రభుత్వము ఏర్పాటు చేసినటువంటి పోర్టల్‌లో కనీసం అప్లై చేసుకునేటటువంటి అవకాశాన్ని కోల్పోయి విధానాన్ని తెలియజేయనున్నట్టు టిగారియా సెంట్రల్ యూనియన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఏ మధుసూదన్ తెలిపారు. అదేవిధంగా 317 జీవోలో ఉన్నటువంటి వివిధ క్లాజ్‌లను ఉల్లంఘించి కనీసం ఆప్షన్ చేసుకునే అవకాశం కూడా కల్పించకుండా, పాత సిక్త్ జోన్ వాళ్లను నియమాలకు విరుద్ధంగా నూతన జోన్ ఒకటి నుంచి నాలుగుకి బదిలీ చేయడాన్ని, పాత జోన్ 5 ఉపాధ్యాయులను నూతన జోన్ 5, 6, 7 కు బదిలీ చేయడాన్ని వివరంగా మంత్రులకు, అన్ని పార్టీల అధ్యక్షులకు, అదేవిధంగా సంస్థ అధికారులకు తెలియజేస్తూ వినతి పత్రాలు ఇవ్వాలని బస్సు యాత్రను నిర్వహించడం జరుగు తుందన్నారు. ప్రభుత్వం, యాజమాన్యంఇప్పటికైనా స్పందించి 317 జీవో అమలులో జరిగిన అవకతవకల వల్ల స్థానికత కోల్పోయినటువంటి ఉపాధ్యాయులకు సంబంధించి కేసులను పునః పరిశీలన జరిపి వారికి తగు న్యాయం చేయాలని తిగారియా తరపునప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. జీవో 190 కేవలం తాత్కాలిక ఉపశమనమే కలిగిస్తుందని.. స్థానికత కోల్పోయి నటువంటి వారికి శాశ్వత పరిష్కారం చూపించ లేదన్నారు. ఎస్సీ గురుకుల సంస్థలలో 2479 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్న నేపథ్యంలో.. 317 జీవో వల్ల స్థానికత కోల్పోయిన వారందరికీ కూడా పూర్తిస్థాయిలో న్యాయంచేసే అవకాశం ఉంటుందన్నారు.

# హెటిరో నుంచి అత్యంత సరసమైన పెర్టుజుమాబ్ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** హెటిరో హెల్త్‌కేర్ లిమిటెడ్, ఎంజీన్ బయోసైన్సెస్‌తో కలిసి పెర్జియా భారతదేశంలో అత్యంత సరసమైన పెర్టుజుమాబ్‌ను విడుదల చేసింది. ఇది రొమ్ము క్యాన్సర్ చికిత్సకు ప్రాధాన్యతను విస్తరిస్తోంది. హెటెరో హెల్త్‌కేర్ లిమిటెడ్, భారతీయ రోగులకు సరసమైన ధరలకు పెర్జుమాబ్ అయిన పెర్జియోను విడుదల చేసింది. హెటెరో హెల్త్‌కేర్, ఎంజీన్ బయోసైన్సెస్ మధ్య సెమీఎక్స్‌క్లూజివ్ సహకారంతో భారతదేశంలో అత్యంత సరసమైన పెర్టుజుమాబ్ ప్రారంభించబడింది. అధునాతన క్యాన్సర్ చికిత్సలను ప్రజాస్వామ్యీకరించే వ్యూహాత్మక అడుగులో భాగంగా, భారతదేశంలోని ప్రముఖ ఔషధ కంపెనీలలో ఒకటైన హెటిరో హెల్త్‌కేర్ లిమిటెడ్, పెర్టుజుమాబ్ యొక్క అత్యంత సరసమైన బయోసిమిలర్ అయిన పెర్జియాను ప్రారంభించినట్లు ప్రకటించింది. హెచ్ఇఆర్2 పాజిటివ్ రొమ్ము కేన్సర్‌కు లక్ష్యంగా చేసుకున్న చికిత్స అయిన ఈ ఉత్పత్తిని ఎంజీన్ బయోసైన్సెస్ లిమిటెడ్‌తో సెమీఎక్స్‌క్లూజివ్ సహకారం ద్వారా ప్రవేశపెట్టారు.

ఈ భాగస్వామ్యం భారతదేశం అంతటా రోగులకు అధిక నాణ్యత గల ఆంకాలజీ చికిత్సలను అందుబాటులోకి తీసుకు రావడానికి, సరసమైనదిగా చేయడానికి హెటిరో హెల్త్‌కేర్ నిబద్ధతను బలోపేతం చేస్తుంది. అదే సమయంలో ప్రాణాలను రక్షించే ఔషధాలకు సమానమైన ప్రాప్యతను నిర్ధారించాలనే భారత ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ దృక్పథానికి అను గుణంగా ఉంటుంది. చికిత్స అంతరాన్ని తగ్గించడం హెచ్ఈఆర్2-పాజిటివ్ రొమ్ము కేన్సర్ చికిత్సకు ట్రాస్టుజుమాబ్, కీమోథెరపీతో కలిపి ఉపయోగించినప్పుడు, మోనోక్లోనల్ యాంటీబాడీ అయిన పెర్టుజుమాబ్ ప్రపంచ వ్యాప్తంగా ఒక ప్రమాణ సంరక్షణగా గుర్తింపు పొందింది. పెర్జియా ప్రారంభంతో, హెటెరో హెల్త్‌కేర్ ఖర్చు అడ్డంకులను తగ్గించడానికి ప్రయత్ని స్తుంది. భారతదేశంలోని వేలాది మంది రోగులు అధునాతన చికిత్సా ఎంపికలను పొందేందుకు ఫలితాలను మెరుగుపరచడానికి వీలు కల్పిస్తుంది.

హెటిరో హెల్త్‌కేర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 'హెటిరో హెల్త్‌కేర్‌లో, మా దృష్టి ఎల్లప్పుడూ ఆవిష్కరణ, సరసతపై ఉందన్నారు. ఎంజీన్ బయోసైన్సెస్‌తో కలిసి పెర్జియా ప్రారంభించడం, ప్రపంచ స్థాయి కేన్సర్ చికిత్సలను భారతీయ రోగులకు అందుబాటులోకి తీసుకురావాలనే మా నిబద్ధతను హైలైట్ చేస్తుందన్నారు.

# బతుకమ్మకుంటను సందర్శించిన మాజీ ఎంపి విహెచ్, హైడ్రా కమిషనర్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త :** పిసిసి మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంత రావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌లు మంగళవారం రాత్రి అంబర్‌పేట బతుకమ్మ కుంటను సందర్శించారు. అందంగా రూపుదిద్దు కున్న బతుకమ్మకుంట నీటిలో వారు బోటులో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బతుకమ్మకుంటను ప్రజలకు అంకితం చేయనున్నారని తెలిపారు. వి.హను మంత రావు విజ్ఞప్తికి ఏప్రిల్ 14న ప్రారంభం అయిన బతుకమ్మ కుంట పునరుద్ధరణ పనులు.. కేవలం ఐదు నెలల్లోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్ కృషి మేరకు వివిధ శాఖలతో సమన్వయం చేసుకొని పునరుద్ధరణ కావడం గమనార్హం. కబ్జా నుండి బతుకమ్మ కుంట భూమి స్వాధీనం చేసుకొని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఈ సందర్భంగా వి.హనుమంతరావు అభినందనలు తెలిపారు. ఈనెల 26న జరిగే బతుకమ్మకుంట ప్రారంభోత్సవ వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని విహెచ్ కోరారు.



బతుకమ్మకుంటలో ఏర్పాట్లను బోటులో ప్రయాణిస్తూ పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు

**బతుకమ్మకుంటలో ఉత్సవాలకు ఆటంకాలు లేవు : అక్టోబరు 9కి కేసు వాయిదా**

అంబర్‌పేటలోని బతుకమ్మకుంటలో ఈ నెల 26న జరపతలపెట్టిన బతుకమ్మ ఉత్సవాలకు ఆటంకాలు తొలగాయి. బతుకమ్మకుంట ప్రారంభోత్స వాన్ని, అక్కడ నిర్వహిస్తున్న ఉత్సవాలను ఆపాలంటూ అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్‌తో దశాబ్దాలుగా పోరాడుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై విచారణను అక్టోబర్ 9కి హైకోర్టు వాయిదా వేసింది.

గతంలోనే అక్కడ పనులు చేసుకునేందుకు అనుమతిచ్చిన హైకోర్టు అక్కడ ఈ నెల 26న నిర్వహించ తలపెట్టిన బతుకమ్మ ఉత్సవాల విషయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. దీంతో అక్కడ ఉత్సవాలు గతంలో నిర్ణయించిన మేరకు ఈ నెల 26న జరుగుతాయని హైడ్రా స్పష్టం చేసింది.

# తెలంగాణకు రూ.5,944 కోట్ల రెవెన్యూ మిగులు

## 12.24 శాతం లోటులో ఆంధ్రప్రదేశ్

## ఆడిట్ నివేదికలో వెల్లడించిన కాగ్

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** దేశంలో రెవెన్యూ మిగుల్లో తెలంగాణ, రెవెన్యూ లోటులో ఆంధ్రప్రదేశ్ ఉంది. రాష్ట్రాల రెవెన్యూ లోటు తదితర అంశాలకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) ఆడిట్ నిర్వహించింది. దీని ప్రకారం, 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశంలోని 28 రాష్ట్రాలలో 16 రాష్ట్రాలు రెవెన్యూ మిగులులో ఉండగా, మిగిలిన 12 రాష్ట్రాలు మాత్రం రెవెన్యూ లోటులో ఉన్నాయని కాగ్ ప్రకటించింది. రెవెన్యూ మిగులు ఉన్న 16 రాష్ట్రాల్లో ఉత్తర్‌ప్రదేశ్ రూ.37,263 కోట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. గుజరాత్, ఒడిశా తదితర రాష్ట్రాలు తరువాత స్థానాల్లో ఉన్నాయి. అంటే 16 రాష్ట్రాల్లో మాత్రమే వ్యయానికి మించిన ఆదాయం సమకూరింది. యూపీ తొలి స్థానంలో ఉండగా, గుజరాత్ రూ.19,865 కోట్లు, ఒడిశా రూ.19,456 కోట్లు, ఝార్ఖండ్ రూ.13,564 కోట్లు, కర్ణాటక రూ.13,494 కోట్లు రెవెన్యూ మిగులుతో టాప్ 5లో నిలిచాయి. ఛత్తీస్‌గఢ్ రూ.8,592 కోట్లుతో 6వ స్థానం, తెలంగాణ రూ.5,944 కోట్ల రెవెన్యూ మిగులుతో 7వ స్థానంలో నిలిచింది. ఉత్తరాఖండ్ రూ.5,310 కోట్లు, మధ్యప్రదేశ్ రూ.4,091 కోట్లు, గోవా రూ.2,399 కోట్లు రెవెన్యూ మిగులుతో టాప్ 10లో ఉన్నాయి. ఇదే సమయంలో 12 రాష్ట్రాలలో రెవెన్యూ లోటు ఉందని కాగ్ పేర్కొంది. ఆ రెవెన్యూ లోటు మొత్తం రూ.2,22,648 కోట్లుగా ఉంది. ఈ రాష్ట్రాల్లో ఆదాయం కంటే వ్యయం ఎక్కువగా ఉంది. 2022-23లో రాష్ట్రాల రెవెన్యూ లోటును భర్తీ చేసేందుకు 14వ ఆర్థిక సంఘం రూ.86,201 కోట్లు విడుదల చేసింది. ఇది మొత్తం లోటులో 39 శాతంగా ఉంది. బిహార్, కేరళ, మేఘాలయ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో తమ రెవెన్యూ వ్యయంపై 90 నుండి 100 శాతం వరకు రాబడి అందుకున్నాయి.

# అక్టోబర్ 5 నుంచి ఐసెట్ స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్

## 6, 7 తేదీల్లో వెబ్‌ఆప్షన్లకు అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబిఏ, ఎంసిఏ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఐ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా అక్టోబర్ 5 నుంచి స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. అక్టోబర్ 6న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు. అక్టోబర్ 6, 7 తేదీల్లో వెబ్ ఆప్షన్లకు అవకాశమిచ్చినట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 10లోగా సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్టు తెలిపారు. స్పెషల్ ఫేజ్‌లో సీటు పొందిన వారు అక్టోబర్ 13న ఆయా కాలేజీల్లో చేరాలని సూచించారు. అయితే ఇప్పటికే సెకండ్ ఫేజ్‌లో సీటు పొందిన విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి మంగళవారం వరకు గడువు ఉండగా.. దానిని కాస్త నేటి(బుధవారం) వరకు పొడిగించినట్టు తెలిపారు. బుధవారం వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి.. గురువారం లోగా కాలేజీల్లో చేరాలని సూచించారు. ఫైనల్ ఫేజ్‌లో 19,540మంది 2,51,192 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు.

## దాశరథి రంగాచార్య సతీమణి కమల కన్నుమూత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 23:** సుప్రసిద్ధ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత దివంగత దాశరథి రంగాచార్య సతీమణి కమల (93) మంగళవారం వయోభారంతో కన్నుమూశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా చిన్నగూడూరు వాస్తవ్యులు అయిన దాశరథి రంగాచార్య జూన్ 7, 2015లో కన్నుమూశారు. ఆయనకు భార్య కమలతోపాటు ముగ్గురు సంతానం. దాశరథి కమల ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు రచయితలు, సాహితీ అభిమానులు కోరుకున్నారు. ఆమె మరణం సాహిత్య లోకానికి తీరని లోటని వ్యాఖ్యానించారు. దాశరథి కమల మృతిపట్ల ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్ సంతాపం తెలిపారు.

## గ్రూప్1 తీర్పుపై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 23:** గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్, మార్కుల జాబితాను రద్దు చేస్తూ.. ఇటీవల వెలువడిన తీర్పుపై హైకోర్టులో మరో అప్పీల్ దాఖలైంది. గ్రూప్1 ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థి ఒకరు ఈ అప్పీల్‌ను దాఖలు చేశారు. జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గతంలో ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సదరు అభ్యర్థి అప్పీల్‌ను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణకు స్వీకరించింది. టిజిపిఎస్సి కూడా అప్పీల్ దాఖలు చేశారని న్యాయవాది పేర్కొనగా.. ఈ రెండు పిటిషన్లు కలిపి బుధవారం విచారిస్తామని ధర్మాసనం తెలిపింది.

# కాళేశ్వరం నివేదిక నుంచి నా పేరు కొట్టేయండి

## హైకోర్టుకు విన్నవించిన ఐఎఎస్ అధికారిణి స్మితాసబర్వాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 23:** ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కోర్టు మెట్లెక్కారు. హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. నివేదికలో తన పేరును తొలగించాలని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కట్టిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంపై జస్టిస్ పిసి ఘోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిషన్ ఇటీవల పూర్తి రిపోర్టును కాంగ్రెస్ ప్రభుత్వానికి అందజేసింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కార్యదర్శిగా కీలక హోదాలో స్మితా సబర్వాల్ పనిచేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆమెను ఘోష్ కమిషన్ విచారించింది. 3 బ్యారేజీల నిర్మాణంతో నాకు ఎలాంటి సంబంధం లేదు, పర్యవేక్షణ, నాణ్యతలోనూ నా పాత్ర లేదు. ముఖ్యమంత్రి అనుమతి కోసం వెళ్లే పత్రాలను పరిశీలించడం, సిఎంకు వివరించడం, లోపాలుంటే ఆయన దృష్టికి తీసుకెళ్లడమే నా బాధ్యత, జిల్లాల పర్యటనకు వెళ్లి కలెక్టర్లతో సమావేశం కావడం, క్షేత్ర స్థాయి పరిస్థితిని సిఎంకు చెప్పడమే నాకు కేటాయించిన బాధ్యతలు అని విచారణ సందర్భంగా ఆమె సమాధానం ఇచ్చినట్లు నివేదిక తెలిపింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాలకు ముందు కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను కొట్టేయండని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులు కూడా హైకోర్టును ఆశ్రయించారు. ఘోష్ కమిషన్ రూపొందించిన రిపోర్టును సవాల్ చేస్తూ.. హైకోర్టులో ఇద్దరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమపై రాజకీయ కక్ష సాధిస్తోందని, ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ రిపోర్ట్ ఆ విధంగా ఉందని ఆరోపించారు. ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకోలేదని, ఆ రిపోర్ట్ పై స్టే ఇవ్వాలని పిటిషన్ లో కోరారు. కెసిఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌లతోపాటు ఇంజినీరింగ్ అధికారులు, ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, ప్రజాసంఘాలను కమిషన్ విచారించి సమాచారాన్ని సేకరించింది.

# శాస్త్రీయంగా ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంటు ఉండాలి

## భూనిర్వాసితులకు అండగా ఉంటాం

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆయా ప్రాజెక్టుల మూలంగా భూమిని నష్టపోయే నిర్వాసితులకు అండగా ఉంటామని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్పష్టం చేశారు. రాష్ట్ర, జాతీయ రోడ్డు ప్రాజెక్టులతోపాటు ప్రాం తీయ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణం సందర్భంగా భూములను కోల్పోయే బాధితు లను ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వంపై ఒత్తిడి చేసి నిర్వాసితులకు న్యాయం జరిగేలా ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఆర్‌ఆర్‌ఆర్ ప్రభావిత జిల్లాలు, మండలాలకి చెందిన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీ సాగర్ అధ్యక్షత వహించగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆయా ప్రాజెక్టులు, పథకాలను అమలుచేస్తున్న సందర్భంగా అత్యధికంగా భూసేకరణ చేస్తున్నాయన్నారు.

## దేశవ్యాప్తంగా పలుచోట్ల సోదాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త:** విదేశాల్లో తక్కువ ధరకు లభించే ఖరీదైన లగ్జరీ కార్లను భారత్‌లో అక్రమంగా స్మగ్లింగ్ చేస్తూ వాటికి చి న్నపాటి మార్పులు చేసి ఇక్కడే తయారైనట్లు చూపి అధిక ధరలకు విక్ర యిస్తున్న స్మగ్లర్ల భరతం పట్టేందుకు కస్టమ్స్ అధికారులు ఆపరేషన్ సమకూర్ పేరిట దేశ వ్యాప్తంగా సోదాలు చేబట్టారు. భూటాన్ దేశంలో సైనిక శ్రేణిలో కొనసాగిన ఖరీదైన కార్లను అక్కడి ప్రభుత్వం తొలగించగా వాటిని తకు ్కవ ధరకు కొన్న కొందరు, భారత్‌కు అక్రమంగా తరలించి, ఎక్కువ ధరకు అమ్మినట్లు నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందుకుర్న కస్టమ్స్ అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పదికిపైగా ఖరీదైన లగ్జరీ కార్లను కస్టమ్స్ అధికారులు జప్తు చేశారు. వీటిని కొన్న ప్రము ఖులకు నోటీసులు జారీ చేశారు.

# విదేశీ లగ్జరీకార్ల స్మగ్లింగ్‌పై కస్టమ్స్ అధికారుల 'ఆపరేషన్ సమకూర్'

**భూటాన్ లగ్జరీ కార్ల బండారం బయటపడిందిలా..**

భారత్‌కు పొరుగునే వున్న బుల్లిదేశం భూటాన్ తన సైనికావసరాల కోసం కొన్నేళ్ల క్రితం ఖరీదు చేసిన 150 లగ్జరీ కార్లను ఇటీవలే సైన్యం నుంచి ఉపసంహరించింది. నిబంధనల మేరకు వాటిని ఆ దేశ సైనికాధికారులు విక్రయించారు. అయితే ఇందులో కొన్నింటిని భారత్‌కు చెందిన వ్యాపారు లు తక్కువ ధరకు కొన్నారు. అయితే ఇలాకొన్న వాహనాలను భారత్‌కు తరలించి ఇక్కడ నడపాలంటే కొత్తగా కస్టమ్స్ డ్యూటీతో పాటు ఇతరత్రా పన్నులు చెల్లించాల్సి వుండడంతో పాటు మరిన్ని నిబంధనలను పాటించాల్సి వుంటుంది. అయితే భూటాన్‌లో ఖరీదైన లగ్జరీ కార్లు కొన్న వారిలో భూటాన్‌కు పొరుగునే వున్న హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యాపారులు వున్నారు. భూటాన్‌లో లక్ష రూపాయల నుంచి ఐదు లక్షల రూపా యలకు ఈ లగ్జరీ కార్లను కొన్న వ్యాపారులు వాటికి భారత్‌లో అక్రమంగా తరలించి ఎలాంటి కస్టమ్స్ డ్యూటీలు, ఇతరత్రా పన్నులు చెల్లించకుండా, ఇతరత్రా నిబంధనలు పాటించకుండా దర్జాగా వాటిని నాలుగైదు రెట్లు అధిక ధరలకు అమ్మడంతో పాటు కొన్నింటిని తామే దర్జాగా వాడసాగారు. ఈ ఖరీదైన కార్లను భూటాన్ నుంచి అధికారిక చెక్‌పోస్టుల మీదుగా కాకుండా అడ్డదారిగుండా భారత్‌లోకి తెచ్చారు.

**ఒకటికి నాలుగింతల నుంచి పదింతల లాభసాటి వ్యాపారం**


ఇదిలావుండగా విదేశాల నుంచి ఖరీదైన లగ్జరీ కార్లను భారత్‌లోకి స్మగ్లింగ్ చేయడం కొత్తేమి కాదు. అయితే కస్టమ్స్ అధికారులు పట్టుకోనంత వరకు ఈ గోల్‌మాల్ వ్యాపారం లక్కీ భాస్కర్ సినిమా తరహాలో భాగానే వుంటుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది డబుల్ ప్రాఫిట్ వ్యాపారం.


అయితే రిస్క్ కూడా అంతేగా వుంటుంది. ఒకవేళ పోలీసులకో కస్టమ్స్ అధికారులకో దొరికి పోతే శిక్షలు కూడా కఠినం గానే వుంటాయి. కొన్ని సార్లు ఐదేళ్ల నుంచి పదేళ్ల జైలు శిక్ష అనుభ వించాల్సి వుంటుంది. ఇటీవల భూటాన్‌లో లక్ష రూపాయలకు కొన్న కార్లను కొందరు వ్యాపారులు భా రత్‌లో పది లక్షల రూపాయలు అంతకు ఎక్కువ ధరలకే అమ్మారు. వీటిని కొన్నవారికి నోటీసులు ఇచ్చారు. ఇదే సమయంలో ఈ గోల్‌మాల్‌లో వున్న అధికారులపైనా ఆరా తీయసాగారు.



## వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ నాల్గవ స్థానంలో హార్విందర్

**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా ఆర్చరీ ఛాంపియన్ షిప్-2025, పురుషుల రికర్వ్ ఓపెన్ క్వాలిఫికేషన్‌లో హార్విందర్ సింగ్ నాల్గవ స్థానంలో నిలిచాడు. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో మంగళవారం జరిగిన ఆర్చరీ ఛాంపియన్‌షిప్ అర్హత రౌండ్‌లో భారత్‌కు చెందిన హార్విందర్ సింగ్ నాల్గవ స్థానంలో నిలిచాడు. పురుషుల వ్యక్తిగత రికర్వ్ ఓపెన్‌లో పోటీ పడుతున్న ప్రస్తుత పారాలింపిక్ ఛాంపియన్ మొత్తం 645 పాయింట్లు సాధించి నాల్గవ ఉత్తమ ఆర్చర్‌గా నిలిచాడు. అలాగే భారత్‌కే చెందిన సాహిల్ 633 స్కోరుతో 14వ స్థానంలో నిలిచాడు. పురుషుల రికర్వ్ టీమ్ ఓపెన్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో హార్విందర్ మరియు సాహిల్ కలిసి 1278 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచారు. పురుషుల వ్యక్తిగత రికర్వ్‌లో మరో భారతీయుడు ధన్నా రామ్ గొడారా 617 స్కోరుతో 30వ స్థానంలో నిలిచాడు. మరోవైపు, మహిళల డబ్ల్యూ1 రికర్వ్ కాంపిటేషన్‌లో, భారతదేశానికి చెందిన శ్రియ 15 మంది అథ్లెట్లలో 422 స్కోరుతో 15వ స్థానంలో నిలిచింది.



## రెండో టెస్టులో 350 రన్స్‌తో ఆస్ట్రేలియా
### 5 వికెట్లతో చెలరేగిన భారత్ స్పిన్నర్ సుతార్

**న్యూఢిల్లీ:** భారత్‌తో జరిగిన రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 350 పరుగులు చేసింది. ఎకానా క్రికెట్ స్టేడియంలో ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్ట్ మ్యాచ్ తొలి రోజు మంగళవారం భారత్ యువ ఆటగాడు సుతార్ 5 వికెట్లతో చెలరేగాడు. భారత్‌తో రెండు అనధికారిక టెస్టులు, మూడు వన్డే మ్యాచ్‌ల కోసం ఆస్ట్రేలియా భారత్ పర్యటనలో ఉంది. తొలి టెస్టు డ్రా గా ముగియగా, రెండో మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వ్యక్తిగత కారణాలతో ఈ మ్యాచ్‌కు దూరం కాగా, ధ్రువ్ జురెల్ సారథ్య బాధ్యతలు చూస్తున్నాడు. టాస్ బోడి బ్యాటింగ్‌కు దిగిన పర్యాటక జట్టు తొమ్మిది వికెట్లకు 350 పరుగుల వద్ద నిలిచింది. ఏడో స్థానంలో వచ్చిన జాక్ ఎడ్వర్డ్స్ (78 బంతుల్లో 88 పరుగులు, 11 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడుగా ఆడి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓపెనర్ కాంప్‌బెల్ (9) ఆరంభంలోనే వెనుదిరిగాడు. అయితే మరో ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (91 బంతుల్లో 49 పరుగులు, 7 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ ( 162 బంతుల్లో 74 పరుగులు, 10 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టాడు. ఓలివర్ పీక్ (29), జోష్ ఫిలిప్ (39) పరుగులు చేశారు. తర్వాత ఎడ్వర్డ్స్ ఎడాపెడా బౌండరీలు బాదడంతో స్కోరు 300 దాటింది. ప్రస్తుతం టాడ్ మర్ఫీ (29 నాటౌట్), హెన్రీ థోర్న్టన్ (10 నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇక భారత్ బౌలర్లలో యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 28 ఓవర్లలో 93 పరులిగిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. సుతార్‌తో పాటు, గుర్నూల్ బ్రార్ (13-0-71-2), ప్రసిద్ధ్ కృష్ణ (13-3-63-1), మొహమ్మద్ సిరాజ్ (13-1-73-1) వికెట్లు తీశారు.







## బిల్లీ జీన్ కింగ్ కప్ ఛాంపియన్‌గా పావోలిని
### 2-0 తేడాతో పెగులా ఓటమి

**న్యూఢిల్లీ:** ఇటలీ బిల్లీ జీన్ కింగ్ కప్-2025 ఛాంపియన్‌గా జాస్మిన్ పావోలిని నిలిచింది. జెస్సికా పెగులాను ఓడించడం ద్వారా టైటిల్‌ను నిలబెట్టుకుంది. షెన్‌జెన్‌లో జరిగిన ఫైనల్‌లో ఇటలీ 2-0 తేడాతో 18 సార్లు ఛాంపియన్‌గా నిలిచిన యునైటెడ్ స్టేట్స్‌ను ఓడించి ఆరోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ప్రపంచ ఏడో ర్యాంకర్ పెగులాను 6-4 6-2 తేడాతో ఓడించడం ద్వారా పావోలిని విజయాన్ని కైవసంచేసుకుంది. తొలి సెట్‌లో బ్రేక్ పాయింట్లు ఇచ్చినప్పుడు పెగులా వృధాగా ఆడి నాలుగు ప్రయత్నాల తర్వాత గోల్‌ను మార్చలేకపోయింది. చివరికి పావోలిని ఆధిక్యంలోకి వెళ్లడంతో ఆమె ఓటమి పాలైంది, మరియు ఇటాలియన్ క్రీడాకారిణి రెండవ సెట్‌లో 5-1 ఆధిక్యంలోకి వెళ్లినప్పుడు దాన్ని అడ్డుకోవడంలో విఫలమైంది. పావోలిని తన మొదటి మూడు మ్యాచ్ పాయింట్లను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైనందున కొంత తడబడింది. కానీ తరువాతి ఆటలో సర్వీస్ బ్రేక్ చేయడం వల్ల ఇటలీ విజయం సాధించింది. ఇక ఎలిసబెట్టా కోకియారెట్టో ఎమ్మా నవారోను 6-4 6-4 తేడాతో ఓడించిన తర్వాత ప్రపంచ ఎనిమిదో నంబర్ క్రీడాకారిణి విజయం సాధించింది.

## స్లో రన్ రేటుతో భారత్ మహిళా జట్టుకు ఫైన్




**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత మహిళల జట్టుకు ఫైన్ పడింది. ఈ నెల 20వ తేదీన ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో స్లో ఓవర్ రేట్‌ను కొనసాగించినందుకు భారత మహిళా క్రికెట్ జట్టుకు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించారు. ఫిరోజ్ షా కోట్లాలో జరిగిన మ్యాచ్‌లో స్మృతి మంధాన 125 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియాకు 12 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకున్నప్పటికీ, ఆతిథ్య భారతదేశం 43 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. సమయాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత, లక్ష్యానికి రెండు ఓవర్లు తక్కువగా ఉన్న కారణంగా ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీలకు చెందిన జిఎస్ లక్ష్మి ఈ ఆంక్షలు విధించారు. కనీస ఓవర్ రేట్ నిబంధనలకు సంబంధించిన ఐసీసీ ఆటగాళ్ళు మరియు సహాయ సిబ్బంది ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, నిర్ణీత సమయంలో బౌలింగ్ చేయని ప్రతి ఓవర్‌కు వారి మ్యాచ్ ఫీజులో 5 శాతం జరిమానా విధించబడుతుంది" అని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. "భారత కెప్టెన్ హార్మన్‌ప్రీత్ కౌర్ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు అంగీకరించింది. మరియు ప్రతిపాదిత శిక్షను అంగీకరించింది. కాబట్టి అధికారిక విచారణ అవసరం లేదు" అని పేర్కొంది. కాగా ఆన్‌ఫీల్డ్ అంపైర్లు లారెన్ అగెన్‌బాగ్, జనని నారాయణన్, మూడవ అంపైర్ గాయత్రి వేణుగోపాలన్, నాల్గవ అంపైర్ బృందా రతి భారత్ జట్టుపై ఈ అభియోగాన్ని మోపారు.

## ఆసియా కప్‌లో తుఫాన్
### పాక్ ఓపెనర్ ఫర్హాన్ ఫైరింగ్ స్టిల్
### జెంటిల్‌మన్ గేమ్‌లో కాంట్రవర్సీ సెలబ్రేషన్స్

**న్యూఢిల్లీ:** జెంటిల్ మేన్ గేమ్ అయిన క్రికెట్‌లో ఓడినా, గెలిచినా కూడా ఇరు జట్ల ఆటగాళ్ల ఎంతో హుందగా ప్రవర్తిస్తూంటారు. అయితే కొందరు ఆటగాళ్ల ప్రవర్తన వల్ల చెడ్డపేరు వస్తుంటుంది. ఆసియా కప్, సూపర్4లో ఈ నెల 21న దుబాయ్‌లో పాక్‌తో జరిగిన మ్యాచ్‌లో












భారత్ విజయం సాధించింది. అయితే మ్యాచ్ సమయంలో పాక్ ఓపెనర్ ఫర్హాన్ అర్ధశతకం కొట్టి తదుపరి చేసుకున్న సెలబ్రేషన్స్ వివాదాస్పదమైంది. సాహిబ్జాదా ఫర్హాన్ ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో రాణించాడు. 45 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లు బాది 58 రన్స్ చేశాడు. అయితే హాఫ్ సెంచరీ తరువాత అతడు డగౌట్ వైపు తిరిగి తన బ్యాట్‌తో గన్ పట్టుకుని ఫైరింగ్ చేసిన తరహాలో సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. ప్రస్తుతం భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అతడి చర్య రెచ్చగొట్టేలా ఉందనే బిసిసిఐ భావిస్తోంది. గతంలో ఇలాంటి చర్యలకు సీసీఐ జరిమానాలు, డీమెరిట్ పాయింట్లను విధించింది. వాటిల్లో భారత్ స్టార్ విరాట్ కోహ్లీ 2012లో సిడ్నీ మ్యాచ్‌లో అనుచితంగా ప్రవర్తించాడు. ఆస్ట్రేలియా ఫ్యాన్స్ స్టేడియంలో దుర్భాషలాడటంతో కోహ్లీ తన మిడిల్ ఫింగర్‌ను స్టాండ్స్ వైపు చూపించాడు. దీన్ని ఐసీసీ లెవెల్ 1 నేరంగా పరిగణించి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించింది. అలాగే దక్షిణాఫ్రికా స్టార్ పేసర్ కగిసో రబాడ 2018లో ఆస్ట్రేలియా మ్యాచ్‌లో స్టీవ్ స్మిత్‌ను ఔట్ చేశాడు. ఆ ఆనందంలో భుజాలను ఎగరేస్తూ పెవిలియన్‌కు వెళుతున్న స్మిత్‌ను తాకుతూ దూకుడుగా సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. దీనిని లెవెల్2 నేరం కింద 2 టెస్టు మ్యాచ్‌ల సస్పెన్షన్ విధించింది. ఇక ఢాకీ ప్రీమియర్ లీగ్ 2021 మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయంపై




అసంతృప్తిని వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్ స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్ స్టంప్స్‌ను కాలితో తన్నాడు. దీన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తీవ్రంగా పరిగణించి 3 మ్యాచ్‌ల సస్పెన్షన్, భారీ జరిమానా వేసింది. 2015లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ప్లేయర్ రోహిత్ శర్మను డేవిడ్ వార్నర్ తిట్టడమే కాకుండా అనుచితంగా సెడాంప్ ఇచ్చాడు. దీంతో వార్నర్ మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా, 2 డీమెరిట్ పాయింట్లు విధించింది. 2017లో లీడ్స్‌లో వెస్టిండీస్ మ్యాచ్‌లో ఔటైన తరువాత పెవిలియన్‌కు వెళుతూ బెన్‌స్టోక్స్ అభ్యంతరకరమైన చేతి సంజ్ఞ చేశాడు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఐసీసీ అతడిని మందలించి, మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించింది. మరి ఇప్పుడు పాక్ ఓపెనర్ ఫర్హాన్ తీరుపై సీసీఐ ఏవిధంగా స్పందిస్తుందనేది చూడాలి.

## వాణిజ్యం



## 45% వృద్ధిని నమోదు చేసిన బజాజ్ ఫైనాన్స్

**ముంబయి, సెప్టెంబరు 23:** ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీసూచీలో ఈ ఏడాదిలో బజాజ్‌ఫైనాన్స్ ఇప్పటివరకూ 45శాతం లాభాలు ఆర్జించింది. నిఫ్టీ ఆర్థికసేవల సూచీ 13శాతంమాత్రమే పెరిగితే బజాజ్ మాత్రం 45శాతం లాభపడింది. ఇన్వెస్టర్లకు స్వల్పకాలిక రివార్డులుకూడా ఇచ్చింది. గతనెలలో 12శాతంమేర పెరిగిన ఈ స్టాక్ ఆరునెలల్లో 11శాతంపెరిగింది. దీర్ఘకాలిక షేర్ హోల్డర్లు ఈ స్టాక్‌తో సంపదసృష్టిని కూడా చేపట్టుకోగలిగారు ఐదేళ్ల కాలంలో 220శాతంమేర వృద్ధి ఉంటుందని అంచనా. 2015నుంచి 2025వరకూ బజాజ్ స్టాక్ 60 రూపాయలనుంచి 1006 రూపాయలకు పెరిగింది. 33శాతం వృద్ధిని నమోదుచేసింది. కంపెనీ లాభనష్టాల పట్టీకూడా శరవేగంగాపెరిగింది. నికరలాభాలు 898 కోట్లవరకూ 2015లో నమోదుచేస్తే 2025లో 16,661 కోట్లునమోదుచేసింది. సమిష్టివార్షిక వృద్ధిరేటులో 34శాతం వృద్ధిని నమోదుచేసింది. నిర్వహణ ఆస్తులు 32,410 కోట్లునుంచి 29శాతం వృద్ధిచెంది 4.17 లక్షలకోట్లుపెరిగింది. పది కేలండర్‌సంవత్సరాల్లో ఎనిమిది ఏళ్ల సానుకూల రిటర్నులే సాధించింది. స్టాక్స్ 2022, 2024లో క్షీణించినా తర్వాత శరవేగంగా రికవరీ అయ్యాయి. మార్కెట్ నిపుణుల అంచనాలనుపరిశీలిస్తే 21 బ్రోకింగ్ సంస్థలు కొనుగోలుచేయవచ్చని, 13 సంస్థలు అలాగే కొనసాగించాలని, ఐదుగురు విక్రయించవచ్చని సూచించాయి.

## రికార్డు కనిష్టానికి రూపాయి
### డాలర్ వర్సెస్ రూపాయి 88.73



**ముంబయి, సెప్టెంబరు 23:** భారత్‌రూపాయి డాలరు మారకం విలువల్లో మరింతగా క్షీణించింది. 41 పైసలు క్షీణించి మంగళవారం 88.73 రూపాయలుగా నమోదయింది. అంతకుముందురోజు 88.32 రూపాయలుగా చెలామణి అయిన రూపాయి 24 గంటల్లోనే మరింత క్షీణించింది. అంతర్జాతీయంగాను, దేశీయంగాను నెలకొన్న ఆర్థిక సంఘటనలే ఇందుకు కారణం అని తెలుస్తోంది. అంతకుముందు ట్రేడింగ్‌ప్రనారంభంలో దేశీయ కరెన్సీ 18 పైసలు క్షీణించి 88.50వద్ద రికార్డు అయింది. లండన్ ఎఫ్‌టిఎస్‌ఇనుంచి నిధుల విత్‌డ్రా, అంతకుముందు ఎఫ్‌పిఐల విత్‌డ్రాలతో డాలరు కొంత బలపడింది. దేశీయ కరెన్సీ ట్రేడింగ్ సెషన్ ఆరంభంలో 18 పైసలు క్షీణించి 88.50 వద్దప్రారంభం అయింది. ముందురోజు డాలరు బయర్లు 2900 కోట్ల విలువైన వాటాలను కొనుగోలుచేసారు. అమెరికా ట్యారిఫ్‌లు పెంచడం, యుఎస్ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచడం వంటివి రూపాయి అత్యంత కనిష్టానికి చేరడానికి దారితీసాయి. ఐపిఒలద్వారా కొంతమేర 7500 కోట్లవరకూ రాగలదని అంచనావేసినా ఆర్బీఐ డాలర్ కౌంటర్‌ను ప్రారంబిస్తే కొంతమేర క్షీణతను కట్టడిచేయవచ్చని అంచనా. ఇక వాణిజ్య విధానాల్లో అనిశ్చితికూడా రూపాయి క్షీణతకు తోడయింది. ఫెడ్‌రిజర్వు 25 బేసిస్ పాయింట్లు తగ్గించినసంగతి తెలిసిందే. అంతకుముందు సెప్టెంబరు తొలినాళ్లలోనే రూపాయి రికార్డుస్థాయిలో క్షీణించింది. డాలరుతో పోలిస్తే 88.44 రూపాయలవదనద స్థిరపడింది. రూపాయితోపాటే ఇతర ఆసియా కరెన్సీలు కూడా క్షీణించడంవల్ల డాలరు పటిష్టం అయ్యేందుకు దోహదంచేసింది.



## దీపావళి గిఫ్ట్‌లేవీ కొనవద్దు
### ప్రభుత్వశాఖలకు ఆర్థికశాఖ సర్క్యులర్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ప్రభుత్వ శాఖల్లో వృధా ఖర్చును తగ్గించేందుకుగాను తక్షణ చర్యలుచేపట్టింది. ప్రభుత్వం అన్ని మంత్రిత్వశాఖలు, ప్రభుత్వశాఖలు ఇతర చట్టబద్ధమైన కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు కూడా దీపావళికి బహుమతులు, అలంకరణలు వంటివాటిని నిషేధించినట్లు ఆర్థికశాఖ మార్గదర్శకాలుజారీచేసింది. కేంద్ర బ్యయనియంత్రణశాఖ ఆధ్వర్యంలో ఈ మార్గదర్శకాలను జారీచేసింది. ప్రభుత్వం వృధా ఖర్చును కట్టడిచేయడం అనేది ఈరోజుకొత్తగా వచ్చిందేమీ కాదు. కొవిడ్ 19 కాలంలోకూడా ప్రభుత్వం ఇదే విధమైన మార్గదర్శకాలు విడుదలచేసింది. ప్రభుత్వ వనరులను న్యాయవద్ధంగా వినియోగించాలన్న లక్ష్యంతో దీపావళి ఇతర పండుగల సందర్భంగా ఎలాంటి బహుమతులు ప్రభుత్వ నిధులతో కొనుగోలుచేయవద్దని సూచించింది. జాయింట్ సెక్రటరీ పికె సింగ్ సంతకంతో వెలువడిన ఈ ఉత్తర్వులు జిఎస్టీ 2.0 అమలుకు వచ్చినతర్వాతనే రావడం గమనార్హం. కొత్త జీఎస్టీ రేట్లుతో రోజువారి ఉత్పత్తులు, కార్లు, ఇతర ఉత్పత్తులపై ధరలు తగ్గనున్నాయి. ఈక్రమంలో ప్రభుత్వం అత్యవసరం కాని ఖర్చులన్నింటినీ కట్టడిచేసేందుకు ఈనిర్ణయం తీసుకున్నట్లు ఆర్థికశాఖ వెల్లడించింది. 2020 సెప్టెంబరులోకూడా కేంద్ర ప్రభుత్వరంగసంస్థలు, మంత్రిత్వశాఖలు అన్నీ కూడా క్యాలెండర్లు, డైయిరీలు ముద్రించడం, బహుమతులు కొనుగోలుచేయడం, గ్రీటింగ్‌కార్డులు పంపిణీ వంటివాటిని నిలిపివేయాలనికోరింది. ఇపుడు తాజాగా వచ్చిన ఉత్తర్వుల్లోకూడా ఈ పండగసీజన్‌లో ప్రభుత్వ అధికారులు అధిపతులు ఎలాంటి దుబారా వ్యయం చేయవద్దని సూచించింది.


## ఇపిఎఫ్ఓ పరిధిలోకి అదనంగా 21.04 లక్షల ఉద్యోగులు!


**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** ఎంప్లాయిస్ ప్రావిడెంట్‌ఫండ్ ఆర్గనైజేషన్ జులై నెలలో 21.04 లక్షలమంది సభ్యులను అదనంగాచేర్చుకోగలిగింది. వార్షికప ద్ధతిలో చూస్తే 5.55శాతం వృద్ధిఉన్నట్లు తెలుస్తోంది. రోజురోజుకూ ఉపాధి అవకాశాలు పెరుగుతుండటంతో ఉద్యోగుల ప్రయోజనాలపట్ల అవగామణ కూడాపెరుగుతోంది. ఇపిఎఫ్ఓ విజయవంతమైన చైతన్య కార్యక్రమాలునిర్వహిస్తుండటంతో కార్మికులకు కూడా తమకు లభించే బెనిఫిట్స్‌పై అవగాహనపెరిగింది. కొత్త చందాదారులే 9.79 లక్షలమంది ఉన్నట్లు ప్రకటించింది. 18-25 ఏళ్లమధ్య గ్రూపులో 61.06శాతంగా ఉన్నారు. అంటే 5.98 లక్షలమందివరకూ ఉన్నట్లు అంచనా. వీరిలో ఎక్కువమంది మొదటిసారి ఉదోనయగంలోకి వచ్చినవారే కావడం గమనార్హం. 18-25 ఏళ్లమధ్య వయసు ఉన్నవారు జూన్‌నెలలో 9.13 లక్షలమందివరకూ ఉన్నారు. అంటే గత ఏడాదితోపోలిస్తే 4.09శాతం మందిపెరిగారు. సంఘటిత రంగంలో వర్క్‌ఫోర్స్‌లో ఎక్కువమంది మొదటిసారి ఉద్యోగం పొందినవారు అందునా యుక్తవయస్కులే ఎక్కువమంది ఉన్నారు. గతంలో ఇపిఎఫ్ఒనుంచి వైదొలిగిన 16.43 లక్షలమంది సభ్యులు మళ్లీ రీజాయిన్ అయ్యారు. ఈ సంఖ్యకూడా ఈ ఏడాది 12.12శాతంపెరిగింది. ఇపిఎఫ్ఒ పరిధిలో ఉన్న సంస్థల్లోనే వీరు మళ్లీచేరినట్లు తెలుస్తోంది. మహిళా చందాదారులు కూడా 2.80 లక్షలమందివరకూ ఉన్నారు. ఇక సగటు మహిళా ఉద్యోగులు ఇపిఎఫ్ఒ పరిధిలోకి వచ్చినవారు 4.42లక్షలమందివరకూ ఉన్నారు. రాష్ట్రాలపరంగాచూస్తే మహారాష్ట్ర 20.47శాతంమందితో ఎక్కువగా ఉంది. తర్వాత కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు అదనంగా ఐదుశాతంగా ఇపిఎఫ్ఓ చందాదారులు పెరిగినట్లు తెలుస్తోంది. ఐదు కేంద్రపాలిత ప్రాంతాల్లో 60.85శాతంమందివరకూ పిఎఫ్ పొందేవారున్నారు.




## మూడో రోజూ ఈక్విటీల్లో నష్టాలే!

**ముంబయి, సెప్టెంబరు 23:** దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం స్వల్పనష్టాల్లోముగిసాయి. వరుసగా మూడోరోజు కూడా ప్రతికూలంగానే సెన్సెక్స్ నిఫ్టీలు ట్రేడింగ్‌ముగించాయి. హెచ్‌వన్‌బి వీసాఫీజు పెంపు భారత్ అమెరికా వాణిజ్య చర్చల్లో అనిశ్చితి నెలకొనడం వంటివాటితో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. నిఫ్టీ 25,200 మార్కు దిగువనే ముగిసింది. పిఎస్‌యు బ్యాంకులు, మెటల్స్, ఆటో స్టాక్స్ కొంతమేర పెరిగితే ఎఫ్‌ఎంసిజి, ఐటి షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలుకూడా వెనకబడ్డాయి. డాలరుతో రూపాయి మారకం కనిష్టానికి చేరింది. వాణిజ్యలోటు కలవరం కూడా పెరిగింది. భౌగోళిక ఉద్రిక్తతలు తోడుకావడంతో స్టాక్‌సూచీలపై ప్రభావం పడింది. ఫెడ్‌రేట్ కట్‌తో బంగారంధరలు పెంచింది. దేశీయంగా ఎనిమిది కీలక పరిశ్రమలు కొంత మద్దతునిచ్చాయి. ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ సెన్సెక్స్ 57.87 పాయింట్లు క్షీణించి 81,102.10 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 32.85 పాయింట్లు క్షీణించి 25,169.50 వద్ద ట్రేడింగ్ ముగించింది. మూడు సెషన్లలోసెన్సెక్స్ 1.09శాతం క్షీణిస్తే నిఫ్టీ 0.99శాతం తగ్గింది. స్టాక్స్‌లో హిందూస్థాన్ యూనిలీవర్ 1.94శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.49శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.65శాతం క్షీణించాయి. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.29శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.35శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్‌ఇలో మొత్తం 1798 కంపెనీలు పెరిగితే 2356 కంపెనీలషేర్లు క్షీణించాయి. 166 కంపెనీలు స్థిరంగా కొనసాగాయి. వచ్చేనెల 3 నాటికి ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 1.60శాతంపెరిగి 1,14,023వద్ద ట్రేడ్ అయింది. బ్రెంట్‌ముడిచమురు నవంబరు నాటికి 30 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 66.87 డాలర్లుగా ట్రేడ్ అయింది.






## ఈ యేడాది భారత్ వృద్ధిరేటు 6.5%
### ఎస్‌అండ్‌పి గ్లోబల్ అంచనా..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ ఎస్‌అండ్‌పి గ్లోబల్ రేటింగ్స్ భారత్ జిడిపి వృద్ధి 6.5శాతంగా ఉంటుందని అంచనావేసింది. పటిష్టమైన డిమాండ్, పెట్టుబడుల వృద్ధి, పన్నులరంగంలో సంస్కరణలు వృద్ధిని 6.5శాతంగా కొనసాగిస్తాయని వెల్లడించింది. ఆసియా ఆర్థిక ముఖచిత్ర నివేదిక పసిఫిక్ నాలుగోత్రైమాసికం పేరిట విడుదలచేసిన నివేదికలో ఎస్‌అండ్‌పి గ్లోబల్ జిడిపి వృద్ధి 6.5శాతంవద్ద స్థిరంగా ఉంటుందని తేల్చింది. దేశీయంగా మంచి డిమాండ్ ఉందని, రుతుపవనాల సీజన్ సగటు కంటే ఎక్కువ వర్షపాతం జిఎస్టీలో మార్పులు, శ్లాబుల కుదింపుతో పాటు పెట్టుబడులు పెరుగుతుండటం కూడా శుభసూచిక అని తెలిపింది. భారత్ ద్రవ్యోల్బణం 2026 సంవత్సరంలో 3.2 శాతంగా ఉండవచ్చుని అంచనావేసింది. ఆహారద్రవ్యోల్బణం కొంతమేర తగ్గుతుందని తెలిపింది. అలాగే ఆర్బీఐ మానిటరీ పాలసీలో కూడా 25 బేసిస్‌పాయింట్లు సర్దుబాటుచేయవచ్చని తెలిపింది. ఈనెల 29నుంచి అక్టోబరు ఒకటివరకూ మానిటరీ పాలసీ కమిటీ సమీక్షలు ఉంటాయి. రెపోరేటు 50 బేసిస్ పాయింట్లవరకూ ఉంటుందని రెపోరేటు5.5శాతంవరకూ ఉండవచ్చని అంచనా.జిడిపివృద్ధి 7.8శాతంగా జూన్‌త్రైమాసికంలో నమోదయింది. ఈ వృద్ధి మరింతగా పెరుగుతుందని, ఆదాయపు పన్నుకుదింపు, జిఎస్టీ సంస్కరణలతో వ1ద్ధిమరింతపెరిగే అవకాశం ఉందని అంచనావేసింది. భారత్ జిడిపి 330 లక్షలకోట్లవద్ద స్థిరపడుతుందని, అదే వినియోగం కూడా 202 లక్షలకోట్లరూపాయలవరకూ ఉంటుందని, గత ఏడాది 181 లక్షలకోట్ల నుంచి 12శాతంపెరుగుతుందని ఎస్‌అండ్‌పి గ్లోబల్ అంచనావేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.